PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 18 | విజయవాడ, ఆదివారం 18 ఆగస్టు 2024 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 18 August 2024 | Rs

అకృత్యంపై వెల్లువెత్తిన ఆగ్రహం

- ప్రాణం పోసే వైద్యుల ప్రాణాలు తీయొద్దు
- నిందితులను కఠినంగా శిక్షించాలి
- రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ వైద్యుల నిరసన

2

8

వినేశ్ ఫోగాట్‌కు ఘన స్వాగతం

- పూలదండలతో ముంచెత్తిన సహచర రెజ్లర్లు, అభిమానులు

పోలవరం, అమరావతికి

సత్వరమే నిధులు

- ప్రధానికి సిఎం విజ్ఞప్తి
- పలువురు కేంద్ర మంత్రులతో భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంతోపాటు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి సత్వరమే నిధులు విడుదల చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ప్రధానమంత్రి నివాసంలో శనివారం జరిగిన భేటీలో ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. దాదాపు గంటసేపు జరిగిన ఈ సమావేశంలో పలు రాజకీయ, ఆర్థిక అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం చేస్తున్నట్లు ఇటీవల కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ మొత్తం సాధమైనంత త్వరగా రాష్ట్రానికి చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 'పోలవరం' నిధులను కూడా వెంటనే విడుదల చేస్తే ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయడానికి వీలవుతుందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరించి, జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో చేసిన రుణాలను రీ షెడ్యూల్ చేయాలని కోరారు. అలాగే కొత్తగా రుణాలు చేయడానికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కూడా నిధులు ఇవ్వాలని కోరారు. విభజన చట్టంలో పేర్కొన్న పలు అంశాలను చంద్రబాబు ప్రస్తావించినట్లు సమాచారం. బడ్జెట్ సవరించిన అంచనాల్లో ఎపికి కేటాయింపులు పెంచాలని కోరారు. ప్రధాని మోడీని కలిసిన చంద్రబాబు వెంట కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు ఉన్నారు. ప్రధానమంత్రితో భేటీ అనంతరం హోంమంత్రి అమిత్ షా, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో కూడా చంద్రబాబు భేటీ అయ్యారు. ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్లిన ఆర్థిక అంశాలపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరించారు. అనంతరం నిర్మలా సీతారామన్‌తో కలిసి, ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామితో సమావేశమైనారు. ఈ సమావేశం 40 నిమిషాల పాటు సాగింది.

ప్రధానికి వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న చంద్రబాబునాయుడు, చిత్రంలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు

రాష్ట్రంలో సీ-ప్లేన్

అంతకు ముందు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె రామ్మోహన్‌నాయుడును ఆయన కార్యాలయంలో సిఎం చంద్రబాబు కలిశారు. దాదాపు రెండు గంటల సేపు వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం రామ్మోహన్‌నాయుడు మీడియాతో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో నూతన ఎయిర్ పోర్టుల నిర్మాణం గురించి అధికారులతో చర్చించినట్లు తెలిపారు. 'కుప్పం, దగదర్తి (నెల్లూరు), నాగార్జున సాగర్, తునిలో కొత్త విమానాశ్రయాల అభివృద్ధి కోసం పలు ప్రతిపాదనలు ఉన్నట్లు చెప్పారు. చిన్న విమానాశ్రయాల కనెక్టివిటీ పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వంలో ఉన్న ఉడాన్ పథకాన్ని వినియోగించుకోవాలని భావిస్తున్నట్లు వివరించారు. సీ -ప్లేన్ పాలసీ ప్రకారం ప్రకాశం బ్యారేజ్ బ్యాక్ వాటర్‌లో వాటర్ ఏరో డ్రోమ్ ఏర్పాటు గురించి చర్చించినట్లు తెలిపారు. నాగార్జునసాగర్‌తోపాటు కోస్తా తీరంలో చాలా చోట్ల సీ-ప్లేన్ సామర్థ్యాన్ని పెంపొందిస్తామని చెప్పారు. విజయవాడ విమానాశ్రయానికి ముంబాయి నుంచి రెండు, ఢిల్లీ నుంచి ఒకటి, బెంగళూరు నుంచి ఒకటి, విశాఖపట్నం నుంచి ఒక సర్వీసును త్వరలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉగ్రవాద దేశాల జాబితా నుండి

క్యూబాను తొలగించండి

- 123 దేశాల విజ్ఞప్తి

హవానా : క్యూబపై ఉగ్రవాద ముద్ర వేయడం ఎంతమాత్రం సరికాదని123 దేశాలు ముక్త కంఠంతో ప్రకటించాయి. ఈ మేరకు ఓ డిక్లరేషన్‌పై అవి సంతకాలు చేశాయి. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి ఈ డిక్లరేషన్‌ను జారీ చేసింది. క్యూబాను దుష్ట రాజ్యాల జాబితాలో చేర్చి, ఆ దేశంపై ఆరున్నర దశాబ్దాలుగా తీవ్ర ఆర్థిక దిగ్బంధనాన్ని అమెరికా కొనసాగిస్తోంది. క్యూబాకు ఇంత పెద్ద స్థాయిలో మద్దతును, తోడ్పాటును అందించినందుకు క్యూబా అధ్యక్షుడు మిగ్వెల్ డియాజ్ కానెల్ కృతజ్ఞతలు తెలియజేశారు. క్యూబా విదేశాంగ శాఖ మేగజైన్‌లో ఈ డిక్లరేషన్‌ను ప్రచురించారు. అన్యాయంగా తమపై ఇలాంటి ఆరోపణలు చేయడం, దానికి కొనసాగింపుగా ఆంక్షలు విధించడం అంతర్జాతీయ చట్ట నిబంధనలకు పూర్తి విరుద్ధమని ఆయన అన్నారు.



2

ఆపరేషన్ 'గేట్' సక్సెస్

- తాత్కాలిక ప్లేట్లు అమరిక పూర్తి
- తుంగభద్ర నీటి వృథాకు అడ్డుకట్ట

ఒకే ప్రాంతంలో ఐదేళ్లుంటే

బదిలీ

- మార్గదర్శకాలు విడుదల
- ఐటిడిఎలో ఖాళీల భర్తీకి ప్రాధాన్యత
- 31 వరకు కొనసాగనున్న ప్రక్రియ
- 14 శాఖలకు వర్తింపు
- ఎక్సైజ్‌శాఖలో 5 నుండి 15 వరకు
- ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య సిబ్బందికి మినహాయింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఒకే ప్రాంతంలో ఐదు సంవత్సరాలు పనిచేసిన ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పియూష్‌కుమార్ శనివారం విడుదల చేసిన బదిలీల మార్గదర్శకాల జిఓ (జిఓ ఎంఎస్ నెంబరు 75)లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న బదిలీలపై నిషేధాన్ని 19వ తేది నుండి 31వ తేది వరకు ఎత్తివేస్తున్నట్లు జిఓలో పేర్కొన్నారు. సెప్టెంబర్ ఒకటవ తేది నుండి మళ్లీ నిషేధం అమలులోకి వస్తుంది. 14 శాఖల సిబ్బందికి ప్రస్తుతం బదిలీలు నిర్వహించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖలో సిబ్బందికి సెప్టెంబర్ ఐదు నుండి 15వ తేది వరకు బదిలీల ప్రక్రియ నిర్వహించనున్నారు. ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య సిబ్బందిని ఈ జిఓ పరిధి నుండి మినహాయించారు.

ఈ ఏడాది జులై 31వ తేదీని ప్రామాణికంగా తీసుకుని బదిలీల ప్రక్రియను నిర్వహించనున్నారు. ఆ తేది వరకు ఒకే ప్రాంతంలో (గ్రామం, పట్టణం, నగరం)లో ఐదేళ్ల పనిచేసిన ప్రతి ఒక్కరిని తప్పనిసరిగా బదిలీ చేయనున్నారు. ఐదేళు పూర్తికాక పోయినా బదిలీ కోరుకున్న వారి అవసరాలను దృష్టిలో పెట్టుకుని బదిలీ చేయొచ్చని సూచించారు. మిగిలిన వారిని జిరో బేస్డ్ సర్వీసు రిక్వెస్ట్‌కు అనుమతి ఇచ్చారు. ఉద్యోగ సంఘాల నాయకులకు ఒకే స్థానంలో తొమ్మిదేళ్ల వరకూ మినహాయింపుగా పేర్కొన్నారు. ముఖ్యంగా దృష్టిలోపం ఉన్న పిల్లల అవసరాలకు తగిన విధంగా బదిలీ కోరుకునే వారికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. మెంటల్లీ ఛాలెంజ్డ్ ఉద్యోగులకు వారి అవసరాలకు తగిన విధంగా బదిలీలు చేయాలని అందులో పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు పైబడి పనిచేసిన ఉద్యోగులకూ బదిలీ అవకాశం కల్పించారు. 40 శాతం పైన వికలాంగత్వం ఉన్న సిబ్బందికీ ప్రాధాన్యత ఇవ్వనున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి లేదా దీర్ఘకాల వ్యాధులతో ఇబ్బంది పడుతున్న పిల్లలు ఉన్న వారికి వైద్య అవసరాల నిమిత్తం వారు కోరుకున్న చోట ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కారుణ్య పద్ధతిలో నియమితులైన

మిగతా 7లో

బదిలీలు వీరికే...

- రెవెన్యూ
- పంచాయతీరాజ్
- మున్సిపల్, గ్రామ, వార్డు సచివాలయం
- గనులు
- పౌరసరఫరాలు
- అన్ని ప్రభుత్వ శాఖల్లో ఇంజనీరింగ్ ఉద్యోగులు,
- దేవాదాయ
- అటవీ
- రవాణా
- పరిశ్రమలు
- విద్యుత్
- వాణిజ్య పన్నులు, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు
- అటవీ పర్యావరణం
- పరిశ్రమలు
- డెడ్‌లైన్ జులై 31

కర్ణాటకలో మరో గవర్నర్ గిరీ!

ముడా స్కాంలో సిద్ధరామయ్యపై విచారణకు గవర్నర్ ఆదేశం

రాజ్యాంగ విరుద్ధం, చట్ట వ్యతిరేకమన్న సిఎం

బెంగళూరు : లోక్‌సభ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలినప్పటికీ బిజెపి తీరు మారలేదు. ప్రతిపక్ష పాలిత కర్ణాటకలో ముఖ్యమంత్రికి ముడా భూ కుంభ కోణంలో ప్రమేయం ఉందున్న ఆరోపణలు రావడమే ఆలస్యం ఆ రాష్ట్ర గవర్నరు థావర్‌చంద్ గెహ్లాట్ ఆగమేఘాల మీద విచారణకు ఆదేశించారు. గవర్నరు చర్య రాజ్యాంగ విరుద్ధం, చట్ట వ్యతిరేకమని కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ప్రజలకు ఎలాంటి జవాబుదారీ లేని గవర్నరు పెత్తనమేమిటని ప్రశ్నించింది. తాను ఏ తప్పు చేయలేదని, కాబట్టి రాజీనామా చేసే ప్రసక్తే తలెత్తదని ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య తెలిపారు. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) కుంభకోణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ప్రమేయం ఉందని ఒక కార్యకర్త ఫిర్యాదు చేస్తే, దానిపై గవర్నరు విచారణకు ఆదేశించడం పెను దుమారం రేపింది. ఈ స్కామ్‌లోనే నిందితులుగా వున్న బిజెపి, దాని మిత్రపక్షం జెడిఎస్ నేతల విచారణకు ఎటువంటి అనుమతి ఇవ్వని గవర్నరు, ఈ విషయంలో వ్యవహరించిన తీరు ముమ్మాటికీ పక్షపాతంతో కూడిన చర్య అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. సిద్ధరామయ్య భార్య బిఎం

పార్వతి భూములకు ఎక్కువ పరిహారం లభించిందనే ఆరోపణలపై గవర్నర్ గత నెలలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ ఈ నోటీసును వాపసు తీసుకోవాలని గవర్నర్‌ను కోరింది. ప్రభుత్వ విజ్ఞప్తిని పెడచెవిన పెట్టిన గవర్నర్ సిద్ధరామయ్యపై విచారణకు ఆదేశించారు. ఈ కేసును న్యాయపరంగా కోర్టులో ఎదుర్కొంటానని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బిజెపి, జెడి(ఎస్) వంటి పార్టీలు కుట్ర పన్నాయని ఆయన ఆరోపించారు. 'రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్‌భవన్‌ను బిజెపి దుర్వినియోగం చేస్తోందని అన్నారు. ఈ కేసులో విచారణ కోసం పెండింగ్‌లో ఉన్న మాజీ

మిగతా 7లో

కొత్త క్రిమినల్ చట్టాలు

ప్రశ్నించే గొంతును నొక్కేందుకే

- వ్యతిరేకంగా ఉద్యమించాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రశ్నించే గొంతును నొక్కేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకొచ్చిందని రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిటీష్ పాలకులు చేసిన చట్టాల కంటే ఇందులోని అంశాలు ప్రమాదకరంగా ఉన్నాయని అన్నారు. ప్రజలు, పౌర హక్కులు, రాజ్యాంగ రక్షణ కోసం నిలబడే ప్రతిఒక్కరూ వీటికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. 'నూతన క్రిమినల్ చట్టాలు-ప్రజా హక్కులకు విఘాతాలు' అనే అంశంపై విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ), ఐఎఎల్, ఎపిసిఎల్,సిఎల్‌సి, కాంగ్రెస్ లీగల్ సెల్, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సుంకర రాజేంద్రప్రసాద్

ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమానికి ఐలూ ప్రధాన కార్యదర్శి ఎన్ మాధవరావు అధ్యక్షత వహించారు. నూతన చట్టాల్లో ఉన్న లోటుపాట్లను ఐలూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్ వివరించి మాట్లాడారు. ప్రజల కోసం పోరాటం చేసే వారిపై రానున్న కాలంలో నిరంకుశత్వం పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాల వల్ల ఏ ట్రేడ్ యూనియన్ పనిచేయలేదని, ఏ సంఘం కూడా హక్కుల కోసం పోరాడే పరిస్థితి ఉండదన్నారు. నిరంకుశ పోలీస్ రాజ్యంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాలు తీసుకొచ్చే సమయంలో ప్రతిపక్షాన్ని వెళ్లగొట్టి ప్రజాస్వామ్యాన్ని పార్లమెంటులోనే కేంద్ర ప్రభుత్వం హత్య చేసిందన్నారు. రాజ్యాంగాన్ని ప్రతిరోజూ హత్య చేస్తున్న బిజెపి ప్రభుత్వం 50 ఏళ్ల క్రితం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఎమర్జెన్సీ

మిగతా 7లో

ముంబయి దాడుల కేసు

రాణా అప్పగింతకు అమెరికన్ కోర్టు అనుమతి

వాషింగ్టన్ : ముంబయి దాడుల కేసులో నిందితుడు, కెనడా వ్యాపారవేత్త తహవూర్ రాణాను భారత్‌కు అప్పగించవచ్చని కాలిఫోర్నియా కోర్టు తీర్పు చెప్పింది. అమెరికా, భారత్‌ల మధ్య వున్న ఖైదీల అప్పగింత ఒప్పందం కింద రాణాను భారత్‌కు అప్పగించాల్సి వుంటుందని కోర్టు పేర్కొనడంతో రాణాను భారత్‌కు తీసుకొచ్చేందుకు దర్యాప్తు అధికారులకు మార్గం సుగమం అయింది. 2008 ముంబయి దాడుల కేసులో రాణా పాత్ర వుందని, అతడిని అప్పగించాలని భారత్ ఎప్పటి నుండో కోరుతోంది. అతడిని భారత్‌కు అప్పగించవచ్చని మేజిస్ట్రేట్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ 63ఏళ్ల రాణా పెట్టుకున్న పిటిషన్‌ను సర్క్యూట్ అమెరికా అప్పీళ్ల కోర్టు కొట్టివేస్తూ శుక్రవారం ఈ రూలింగ్ ఇచ్చింది. ప్రస్తుతం లాస్‌ఏంజెల్స్‌లోని జైల్లో రాణా వున్నాడు. ముంబయి దాడుల్లో ప్రధాన కుట్రదారుడైన లష్కరే తోయిబా తీవ్రవాది డేవిడ్ హేడ్లీ అమెరికన్ అయినందున అతడిని అప్పగించడానికి అగ్రరాజ్యం ససేమిరా అంటోంది.

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షునిగా

కేశినేని శివనాథ్

ప్రజాశక్తి- మధురవాడ (విశాఖపట్నం)

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. విశాఖలోని ఎసిఎ-విడిసిఎ స్టేడియంలో ఈ ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల స్క్రూట్నీ శనివారం జరిగింది. అందులో భాగంగా ఎసిఎ అధ్యక్షునిగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఉపాధ్యక్షునిగా వెంకట ప్రశాంత్, కార్యదర్శిగా సానా సతీష్, సహాయ కార్యదర్శిగా విష్ణుకుమార్ రాజు, కోశాధికారిగా శ్రీనివాస్, కౌన్సిలర్‌గా గౌరు విష్ణుతేజ్ ఎన్నికయ్యారు. వీరి ఎన్నికను సెప్టెంబర్ 8న అధికారికంగా ప్రకటించనున్నారు.

ప్రతికూల ధోరణే

ఖరీఫ్ సాగులో 11 లక్షల ఎకరాల తగ్గుదల

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఖరీఫ్ పంటల సాగులో గతంలో నెలకొన్న ప్రతికూల ధోరణే ఈ ఏడాదీ కొనసాగుతోంది. ఆగస్టు మధ్యకొచ్చినా ఇప్పటికి కావాల్సిన సాగులో 11 లక్షల ఎకరాల తగ్గుదల కనిపిస్తోంది. నిరుడు ఇదే సమయానికి లోటు 17 లక్షల ఎకరాలుగా ఉంది. ఇదేమీ గతానికి, ప్రస్తుతానికి పెద్ద మెరుగుదలేమీ కాదు. నిరుడు ఈపాటికి సాగు కావాల్సిన సాధారణ సాగు విస్తీర్ణం 62 లక్షల ఎకరాలు. ఈ సంవత్సరం ఇప్పటికి సాధారణ సాగు విస్తీర్ణం 57 లక్షల ఎకరాలు. దీన్ని పరిగణనలోకి తీసుకుంటే సాగు తగ్గుదల రేటు అటుఇటుగా సమానమే. గతేడాది తీవ్ర కరువు ఉంది. ఈ సంవత్సరం వర్షాలు సాధారణ స్థాయిలో కురిసినప్పటికీ జులై మధ్యలో నుంచి చాలా జిల్లాల్లో వానలు బిగేశాయి. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర, ఇతర మెట్ట ప్రాంతాల్లో పంటల సాగుకు సరిపడా వానల్లేవు. అదనుకు వర్షాల్లేక కొత్తగా సేద్యం సాగకపోగా వేసిన పంటలు ఎండుతున్నాయి. మరోవైపు జులై తొలి పక్షంలో కురిసిన భారీ వర్షాలు, వరదలు లక్షకుపైగా ఎకరాల్లో పంటలను దెబ్బతీశాయని ప్రభుత్వమే ప్రకటించింది. వాస్తవ నష్టం అంతకంటే ఎక్కువే ఉంటుందని రైతులు చెబుతున్నారు.

అదను తప్పిన ఆ రెండు పంటలూ

ఖరీఫ్‌లో వరి తర్వాత వేరుశనగ, పత్తి అధికంగా సాగవుతాయి. ఈ రెండు పంటలూ మెట్ట ప్రాంతాల్లోనే సాగు చేస్తారు. వేరుశనగ సాగుకు గడువు దాదాపు ముగిసింది.

ముమ్మరంగా సాగు కావాల్సిన జులైలో రాయలసీమలో సరైన వర్షాల్లేవు. దాంతో సాగు సగానికి సగం పడిపోయింది. వానల్లేక వేసిన పంట చేతికిరాని పరిస్థితి. వేరుశనగ ఎక్కువగా సాగయ్యే అనంతపురంలో 42 శాతమే సాగైంది. శ్రీసత్యసాయి 50 శాతం, కర్నూలు 72 శాతం, నంద్యాల 46 శాతం, చిత్తూరు 30 శాతం, తిరుపతి 25 శాతం, కడప 44 శాతం, కడపలో 44 శాతం సాగైంది. వేరుశనగకు ప్రత్యామ్నా యంగా అక్కడక్కడ రైతులు ఆముదాలు, కందులు సాగు చేశారు.

పత్తి ఈపాటికి 80 శాతం దాకా పడాలి. కానీ 59 శాతం విస్తీర్ణం లోనే సాగైంది. కర్నూలు 78 శాతం, ఎన్‌టిఆర్ 72 శాతం, గుంటూరు 70 శాతం, పల్నాడు 44 శాతం, ప్రకాశం 24 శాతం, కడప 28 శాతం, అనంతపురం 51 శాతం, నంద్యాల 17 శాతం సాగైంది.

వరి తక్కువే

సీజన్ తొలినాళ్లలో ప్రాజెక్టుల్లో నీరు లేని కారణంగా వరి నాట్లు తగ్గాయి. ముఖ్యంగా కృష్ణా డెల్టాలో నాట్లు ఆలస్యమయ్యాయి. పట్టిసీమ నీటితో కొంతవరకు సేద తీరగా, అనంతరం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పడి శ్రీశైలానికి, అక్కడి నుంచి నాగార్జునసాగర్‌కు నీరు రావడంతో గండం గడిచింది. ఇంకా సాగర్ కుడి కాల్వ కింద వరి సాగుపై మీమాంశ కొనసాగుతోంది. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, అనంతపురంలో వరి తగ్గింది. ప్రధానంగా నెల్లూరులో వరి సాగు బాగా తగ్గింది.

ఖరీఫ్ సాగు (లక్షల ఎకరాలు)

పంట	సీజన్ నార్మల్ సాగు	ఆగస్టు 14 నాటికి సాగు కావాల్సింది	సాగైంది	తగ్గుదల/ పెరుగుదల
వరి	37.8	22.90	21.57	1.33
తృణధాన్యాలు	4.85	3,25	3,62	0.37
పప్పుధాన్యాలు	7.42	4.27	4.42	0.15
ఆహారధాన్యాలు	50.02	30.42	29.62	0.80
నూనెగింజలు	15.30	11.07	7.42	3.65
వేరుశనగ	13.87	12.55	6.35	6.20
పత్తి	14.47	11.97	8.57	3.40
మొత్తం పంటలు	**81.00**	**57.17**	**46.07**	**11.10**

ఏచూరి, రాజా, యాదవరెడ్డిలకు రమేష్‌చంద్ర శాంతి పురస్కారం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ దేశంలో శాంతి సంఘీభావ ఉద్యమ నిర్మాణానికి విశేష కృషి చేసినవారికిచ్చే రమేష్ చంద్ర పురస్కారం సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, మాజీ ఎమ్మెల్సీ కె యాదవ రెడ్డికి లభించింది.

ప్రపంచ శాంతి మండలి 75వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం నాడిక్కడ హరికిషన్‌సింగ్ సుర్జీత్ భవన్‌లో ప్రపంచ శాంతి మండలి, ఆలిండియా పీస్ అండ్ సాలిడారిటీ ఆర్గనైజేషన్స్ (ఎఐపిఎస్ఒ) ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో వారికి ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏచూరి మాట్లాడుతూ, ప్రపంచ దేశాలు రక్షణ బడ్జెట్‌ను తగ్గించుకోవాలని కోరారు. యుద్ధాలు, ఘర్షణలు సృష్టిస్తూ మిలిటరీ వ్యయాన్ని పెంచేస్తున్నారని, ప్రపంచ శాంతిని నెలకొల్పితే, రక్షణపై పెట్టే నిధుల మిగులుతో ప్రపంచ ప్రజలందరికీ ఉచితంగా విద్య, వైద్యం అందించ వచ్చని తెలిపారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు వెంటనే ఆపాలని, ప్రపంచ దేశాల మధ్య సోదరభావం పెంపొందించాలని ఆయన కోరారు.. ఈ కార్యక్రమంలో ఆర్. అరుణ్‌కుమార్, పల్లాబ్‌సేన్ గుప్తా, డి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో జూనియర్ డాక్టర్ల దీక్షలకు మద్దతు తెలిపిన హోం మంత్రి అనిత

ఇబ్రహీంపట్నంలో నిరసన తెలుపుతున్న వైద్యులు, ఆశా వర్కర్లు

తిరుపతిలో జూనియర్ డాక్టర్ల బైక్ ర్యాలీ

అకృత్యంపై వెల్లువెత్తిన ఆగ్రహం

- ప్రాణం పోసే వైద్యుల ప్రాణాలు తీయొద్దు
- నిందితులను కఠినంగా శిక్షించాలి
- రాష్ట్ర వ్యాప్తంగా జూడాల నిరసన
- విశాఖలో దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపిన హోం మంత్రి

ప్రజాశక్తి-యంత్రాంగం

వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వైద్య విద్యార్థులు, వైద్యులు శనివారం పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) 24 గంటల సమ్మె పిలుపులో భాగంగా పలుచోట్ల ధర్నాలు, కొవ్వొత్తుల ర్యాలీలు, మానవహారాలు నిర్వహించి నిరసనలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని వైద్య సేవలను నిలిపివేశారు. ప్రాణం పోసే వైద్యుల ప్రాణాలు తీయొద్దని, నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని, వైద్యులకు, మహిళలకు రక్షణ కల్పించాలని నినదించారు. వారికి ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు తదితర ప్రజా సంఘాల నేతలు మద్దతు తెలిపారు.

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్ష చేపట్టారు. తొలుత ఆంధ్ర మెడికల్ కాలేజ్ నుంచి కెజిహెచ్, జగదాంబ జంక్షన్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టారు. జూనియర్ డాక్టర్ల దీక్షా శిబిరాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సందర్శించారు. వారి పోరాటానికి మద్దతు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు జూనియర్ డాక్టర్ల పోరాటానికి మద్దతు ప్రకటించారు. ఓల్డ్ టౌన్‌లోని విక్టోరియా ఘోసాస్పత్రిలో వైద్యులు, నర్సులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అనకాపల్లిలో ఎన్‌టిఆర్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. చోడవరంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. అల్లూరి జిల్లాలోని అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కడప, అన్నమయ్య జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల వైద్యులు, వైద్య విద్యార్థులు నిరసనలు తెలిపారు. అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. కడప రిమ్స్ ఆస్పత్రిలో నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లకు కడప ఎమ్మెల్యే మాధవి, ఐద్వా జిల్లా అధ్యక్షులు ఐ.ఎన్.సుబ్బమ్మ మద్దతు తెలియజేశారు. మదనపల్లెలో ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ సంఘీభావం తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా వైద్య విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు. విజయవాడలో ఆస్పత్రుల వద్ద ఆందోళనలు చేశారు. మైలవరం, ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, రెడ్డిగూడెం మండలాల్లో పిహెచ్‌సిలు, కళాశాలల వద్ద నల్లరిబ్బన్లతో నిరసన తెలిపారు. మైలవరంలో సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కృష్ణా డిస్ట్రిక్ట్ ఫార్మా డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు వైద్యశాలలను మూసివేసి నిరసన తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, నర్సులు, సిబ్బంది విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. అనంతపురం, బుక్కరాయసముద్రం, పుట్లూరు, పామిడి, పెద్దపప్పూరు, బొమ్మనహాల్, రాప్తాడు, శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం, ధర్మవరం, కదిరి, కొత్తచెరువు, చిలమత్తూరు, తనకల్లు తదితర మండలాల్లో వైద్య సిబ్బంది నిరసన ర్యాలీలు చేపట్టారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వైద్యులు ఒపి సేవలను నిలిపివేశారు. కర్నూలులో జూనియర్ డాక్టర్లు రాజ్ విహార్ కూడలి నుంచి జిజిహెచ్ వరకూ నిరసన ప్రదర్శన చేపట్టారు. నంద్యాల జిల్లా సున్నిపెంట, బండి ఆత్మకూరు, నందికొట్కూరు, బేతంచర్ల, రుద్రవరం, శ్రీశైలం, పాణ్యంలో వైద్యులు నిరసన తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు ధర్నాలు, ర్యాలీలు, మానవహారాలు నిర్వహించి నిరసనలు తెలిపారు. వైద్యుల విధులను బహిష్కరించి ఈ నిరసనల్లో పాల్గొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, మహిళలకు రక్షణ కల్పించాలని నినదించారు. తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో అన్ని పిహెచ్‌సిల పరిధిలోనూ నిరసనలు జరిగాయి. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో వైద్యులు విధులు బహిష్కరించి నిరసన ప్రదర్శనలు చేశారు. ఆయా ప్రాంతాల్లో తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. నరసాపురంలో మిషన్ హైస్కూల్ రోడ్డులో ర్యాలీ చేపట్టి ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌కు వినతిపత్రం అందించారు. వైద్యుల ఆందోళనకు సంఘీభావంగా భీమవరంలో ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యాన భారీ ర్యాలీ నిర్వహించారు. విజయనగరంలో ఐఎంఎ హాలు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జెసి నాయుడు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డిశంకరరావు, ఐఎంఎ మహిళా నాయకులు డాక్టర్ సన్యాసమ్మ మాట్లాడారు.

బొబ్బిలిలో తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. నెల్లిమర్ల సామాజిక ఆసుపత్రి వైద్యులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాజాంలో అంబేద్కర్ జంక్షన్ వద్ద మానవహారం చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లోనూ వైద్యులు నిరసన ర్యాలీలు నిర్వహించారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అన్ని ఏరియా ఆస్పత్రుల ఎదుట వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్లకార్డులతో నిరసనలు తెలిపారు. తిరుపతిలో బైక్ ర్యాలీ చేపట్టారు. గుంటూరులోని అంబేద్కర్ సర్కిల్ నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిజిహెచ్‌లో జూనియర్ డాక్టర్లు నిర్వహిస్తున్న న్యాయ పోరాట దీక్ష శిబిరానికి చేరుకుని మద్దతు తెలిపారు. మంగళగిరిలో ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ హాస్పిటల్ విద్యార్థులు నిరసన ర్యాలీ చేశారు. తెనాలిలో ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. చేబ్రోలు, పొన్నూరు, ప్రత్తిపాడు, మేడికొండూరులో నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ర్యాలీ చేశారు. ఎఎస్‌పి, జెసికి వినతిపత్రాలు ఇచ్చారు. మాచర్ల, అమరావతిలో మానవహారంగా ఏర్పడ్డారు. నెల్లూరు, శ్రీకాకుళం, జిల్లాల్లో ర్యాలీలు, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో నిర్వహించారు.

మహిళా వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కోల్‌కతాలో పిజి వైద్య విద్యార్థినిపై అఘాయిత్యం, హత్యకు నిరసనగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న డాక్టర్ల సమ్మెకు సిపిఎం రాష్ట్ర కమిటీ మద్దతు తెలిపింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ప్రకటన విడుదల చేశారు. హత్య వెనుక డ్రగ్ మాఫియా, సంఘ వ్యతిరేక శక్తులు ఉన్నట్లు రకరకాల కథనాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ త్వరితగతిన పూర్తి చేసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూడా డాక్టర్లకు ప్రత్యేకించి మహిళా డాక్టర్లు, నర్సులు, ఇతర మహిళా స్టాఫ్ భద్రతకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

శ్రీరామ్మూర్తి భౌతికకాయంపై యుటిఎఫ్ పతాకాన్ని కప్పి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు

రైతు, ఉపాధ్యాయ ఉద్యమ నేత వలవల శ్రీరామ్మూర్తి కన్నుమూత

- ఆశ్రం ఆస్పత్రికి భౌతికకాయం అప్పగింత

ప్రజాశక్తి - పాలకొల్లు, ఏలూరుఅర్బన్

రైతు, ఉపాధ్యాయ ఉద్యమ నేత, సిపిఎం సీనియర్ నేత వలవల శ్రీరామ్మూర్తి (90) కన్నుమూశారు. వారం రోజుల క్రితం అస్వస్థతకు గురవ్వడంతో రాజమండ్రిలోని ప్రయివేట్ హాస్పిటల్‌లో ఆయన చేరారు. పరిస్థితి విషమించి శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. భౌతికకాయాన్ని పాలకొల్లులోని ఆయన స్వగృహానికి తరలించారు. శ్రీరామూర్తికి ఇరువురు కుమారులు, కుమార్తె అల్లుడు ఉన్నారు. రాజమండ్రిలో కంటి దానం అనంతరం ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామం పాలకొల్లుకు తరలించారు. పాలకొల్లులో ప్రధాన రోడ్డు గుండా హౌసింగ్ బోర్డు శివారు వరకు అంతిమయాత్ర నిర్వహించారు. యాత్రలో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం రాత్రి ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీకి భౌతికకాయాన్ని అప్పగించారు.

ఉపాధ్యాయులుగా సుమారు 25 సంవత్సరాల పాటు పనిచేసిన అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేసి సిపిఎం పూర్తికాలం కార్యకర్తగా శ్రీరామ్మూర్తి పని చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో యుటిఎఫ్, రైతు ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. యుటిఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షునిగా పని చేశారు. సంతాపసభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ.. చివరివరకు ప్రజలు, పార్టీ కోసం పనిచేసిన ధన్యజీవి శ్రీరామ్మూర్తి అని కొనియాడారు. కుటుంబ సభ్యులకు పార్టీ రాష్ట్ర కమిటీ తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సభకు సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షత వహించగా సభలో పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, పూర్వ జిల్లా కార్యదర్శి చింతకాయల బాబురావు తదితరులు మాట్లాడారు. శ్రీరామ్మూర్తి మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. త్యాగనిరతితో పార్టీ, ప్రజా సంఘాల పట్ల అంకితభావంతో పనిచేశారని పేర్కొన్నారు. వృద్ధాప్యం, తీవ్ర అనారోగ్యం ఉన్నప్పటికీ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ వచ్చారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి సంతాపం ప్రకటించారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా పార్టీ కోసం పనిచేశారని వివరించారు. రైతు సంఘం మాజీ అధ్యక్షులు బి.తులసీదాస్ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

99.38 శాతం ఎస్ఎంసి ఎన్నికలు పూర్తి : సమగ్రశిక్షా డైరెక్టర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసి) ఎన్నికలు 99.38 శాతం పూర్తయ్యాయి. సవరించిన షెడ్యూల్ ప్రకారం అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలతో పాటు మిగతా జిల్లాల్లోనూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని సమగ్రశిక్షా డైరెక్టరు బి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 8న 40,150 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. 631 పాఠశాలలకు శనివారం నిర్వహించారు. మొత్తంగా ఇప్పటి వరకు 44,911 (99.38 శాతం) పాఠశాలల్లో పూర్తయ్యాయి. జీరో ఎన్‌రోల్‌మెంట్, పాఠశాలలు మూసివేత, కోరం లేకపోవడం వల్ల 282 పాఠశాలల్లో కమిటీలు ఏర్పాటు చేయలేదు.

ఎయిడెడ్‌లోకి మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు

- ఎపి టీచర్స్ గిల్డ్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం జరుపుతున్న వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో మిగిలిన ఉపాధ్యాయులను ఎయిడెడ్, గిరిజన పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ విద్యాశాఖ మంత్రిని కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి చిట్టిబాబు, ఎల్కే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజన, ఎయిడెడ్ పాఠశాలలకు అవసరమైన చోట సబ్జెక్టు టీచర్లు, పిఇటిలను కేటాయించాలని కోరారు.

కార్మిక వర్గంపై పెరుగుతున్న దాడులు

- సంఘటితంగా తిప్పి కొట్టాలి
- సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో డాక్టర్ కె హేమలత
- కేరళ బాధితులకు ఆర్థిక సాయం

సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కె హేమలత

ప్రజాశక్తి- నెల్లూరు

ప్రభుత్వ పాలన విధానాల వల్ల పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలోకి నెట్టివేయబడుతోందని, దానినుంచి బయటపడేందుకు, లాభాలను ఆర్జించేందుకు, ఆదాయాలు పెంచుకునేందుకు పెట్టుబడీదారీ వ్యవస్థ కార్మిక, శ్రమ జీవులపై దాడులకు పాల్పడుతోందని సిఐటియు ఆల్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత అన్నారు. మూడు రోజుల పాటు జరిగే సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో భాగంగా నెల్లూరులో తొలి రోజు శుక్రవారం బహిరంగ సభ నిర్వహించిన విషయం విదితమే. రెండో రోజు శనివారం నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో డాక్టర్ కె.హేమలత మాట్లాడారు. కోల్‌కత్తాలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు సిఐటియు ఆల్‌ఇండియా కౌన్సిల్ సమావేశం విజయవంతంగా నిర్వహించుకున్నామన్నారు. దీనిలో 17వ మహాసభలో తీసుకున్న నిర్ణయాలు, దిశ, నిర్దేశాలు ఏ మేరకు అమలు చేశామో సమీక్షించుకుంటున్నట్లు తెలిపారు. ఈ కర్తవ్యాలను 18వ మహాసభ నిర్వహించుకొనేలోగా పూర్తి చేయాలని తీర్మానించుకున్నట్లు వివరించారు. దానికి అనుగుణంగా రాష్ట్రంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను ఈ కౌన్సిల్ సమావేశంలో సభ్యులకు తెలియజేస్తామన్నారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో నెలకొంటున్న పరిస్థితులపై వివరంగా చర్చించి ఓ నిర్ణయం తీసుకున్నామని వివరించారు.

దేశం, రాష్ట్రంలో ప్రభుత్వాలు అనుసరిస్తోన్న నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యాన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సిఐటియు వేదికగానే కాకుండా అన్ని కార్మిక సంఘాలూ, ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాలు, జాయింట్ ట్రేడ్ యూనియన్లను కలుపుకొని ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిఐటియు బలోపేతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ప్రసంగించారు. ఈ సమావేశానికి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు ఇటీవల మృతి చెందిన సిఐటియు, వామపక్ష పార్టీల నాయకులకు సంతాపం తెలియజేస్తూ తీర్మానాన్ని ముజఫర్ అహ్మద్ ప్రవేశపెట్టారు. పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ బట్టాచార్యకు, కేరళలోని వయనాడ్ మృతులకు, ఇతర నేతలకు సంతాపం ప్రకటించారు. కేరళ వరదల్లో తీవ్రంగా నష్టపోయిన బాధితులను ఆదుకోవడానికి సిఐటియు రాష్ట్ర కమిటీ రూ.5 లక్షల చెక్కును డాక్టర్ కె.హేమలతకు అందజేసింది. విశాఖపట్నం జిల్లా సిఐటియు నుంచి 2.50 లక్షలు, కడప జిల్లా సిఐటియు శాఖ రూ.30 వేలు, పశ్చిమగోదావరి సిఐటియు శాఖ రూ.48 వేలు, శ్రీకాకుళం జిల్లా శాఖ రూ.20 వేల చెక్కును ఆల్ ఇండియా సిఐటియు నాయకులకు అందించారు.

సదస్సులో మాట్లాడుతున్న సతీష్

విద్యావిధానంలో మార్పులు అవసరం

- సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు పి.సతీష్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ప్రభుత్వ కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్మించి, ఉద్యోగాల సాధనకు విద్యార్థులు, యువకులు పోరాటాలు సాగించాలని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు పి.సతీష్ పిలుపునిచ్చారు. ప్రభుత్వాల విధానాలు మారేలా పోరాటాలు సాగాల్సిన అవసరముందని పేర్కొన్నారు. 'భారతదేశ నిరుద్యోగ సమస్య -కారణాలు - పరిష్కారం' అనే అంశంపై విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం సదస్సు జరిగింది. దీనికి ప్రధాన వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రమైందన్నారు. అవసరమైనన్ని ఉద్యోగాలు లేకపోవడం, విద్యార్హతలు ఉన్నా సరైన ఉద్యోగాలు లభించకపోవడం వంటివి అన్నిచోట్లా కనిపిస్తున్నాయని తెలిపారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వ, ప్రయివేటు రంగం కలిసి పనిచేయాల్సి ఉందన్నారు. విద్యావిధానంలో మార్పులు చేసి, నైపుణ్యాలను పెంపొందించడంపై దృష్టి పెట్టాలని కోరారు. మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఉద్యోగాల కల్పన మృగ్యమైందన్నారు. కార్పొరేట్ అనుకూల విధానాలే అమలవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్మించాలన్నారు. ఐసిఇయు విశాఖపట్నం డివిజన్ అధ్యక్షులు ఎం.కామేశ్వరి మాట్లాడుతూ నైపుణ్యంతో కూడిన విద్య ఉంటే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఆ దిశగా పాలకులు పనిచేయటం లేదని విమర్శించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ కె.పద్మ మాట్లాడుతూ వికసిత్ భారత్ అంటూ పాలకులు మభ్యపెడుతున్నారని తెలిపారు. దేశంలో అసమానతలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో ఐసిఇయు డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, పెద్ద ఎత్తున విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

ఆపరేషన్ 'గేట్' సక్సెస్

- తాత్కాలిక ప్లేట్లు అమరిక పూర్తి
- తుంగభద్ర నీటి వృథాకు అడ్డుకట్ట

ప్లేటును అమర్చుతున్న ఇంజనీరింగు సిబ్బంది

ప్రజాశక్తి -హోలగుంద, కర్నూలు ప్రతినిధి

తుంగభద్ర డ్యామ్‌లో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో తాత్కాలిక గేటును అమర్చడంలో అధికారులు, ఇంజనీర్లు సఫలీకృతమయ్యారు. శనివారం రాత్రి నాటికి తాత్కాలిక గేటు అమర్చే పనిని పూర్తి చేశారు. దీంతో నీటి వృథాకు అడ్డుకట్ట పడింది. తాత్కాలిక గేటును ఐదు ప్లేట్లుగా అమర్చాలని ఇంజనీర్లు చేపట్టిన ప్రయోగం విజయవంతమైంది. శుక్రవారం రెండు ప్లేట్లను అమర్చగా శనివారం మరో మూడు ప్లేట్లను విజయవంతంగా అమర్చారు. శనివారం ఉదయం ఆ గేటు ద్వారా 43 వేల క్యూసెక్కుల నీరు వృథాగా పోతుండగా గేటు బిగించిన తరువాత కేవలం 500 క్యూసెక్కుల నీరు మాత్రమే బయటకు వెళుతోంది. మిగిలిన 32 గేట్లను కూడా శనివారం మూసివేశారు. జలాశయ నీటి నిల్వ సామర్థ్యం 105 టిఎంసిలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 71.22 టిఎంసిలుగా ఉంది. ప్రస్తుతం 44 వేల క్యూసెక్కుల వరద డ్యాములోకి వచ్చి చేరుతోంది. గేటు కొట్టుకుపోయినప్పటి నుండి ఇప్పటి వరకు 33 టిఎంసిల నీరు వృథాగా పోయింది. 50 టిఎంసిల వరకు నీరు వృథాగా పోతుందని అధికారులు భావించినా ముందుగానే నీటి వృథాకు అడ్డుకట్ట వేశారు. ఈ నెల 10న రాత్రి తుంగభద్ర 19వ గేటు ప్రమాదవశాత్తు కొట్టుకుపోయింది. మరుసటి రోజు ఉదయం నుంచి గేటు నిపుణులు కన్నయ్య నాయుడు ఆధ్వర్యంలో ఇంజనీర్లు రంగంలోకి దిగారు. కొట్టుకుపోయిన గేటు స్థానంలో తాత్కాలిక గేటు అమర్చాలని నిర్ణయించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కొంత ప్రవాహం తగ్గి మరికొంత ప్రవాహం ఉండగానే గేటును బిగించాలని భావించారు. తాత్కాలిక గేటును ఐదు ప్లేట్లుగా తయారుచేసి అమర్చాలని ప్రణాళికలు రూపొందించారు. మూడు సంస్థలకు గేటు ఫాబ్రికేషన్ పనులు అప్పగించారు. శుక్రవారం ఉదయం నుంచి ప్లేట్ల అమరిక ప్రారంభించారు. 50 మంది కార్మికులు పనుల్లో నిమగ్నమయ్యారు. శనివారం రాత్రికి ఐదు ప్లేట్ల అమరిక పూర్తి చేశారు. అందుకోసం మూడు భారీ క్రేన్లను వినియోగించారు. నీటి వృథాకు అడ్డుకట్ట వేసే ప్రయత్నాలు ఫలించడంతో అధికారులు, సిబ్బంది, కార్మికులు సంబరాలు చేసుకున్నారు.

భూ ఆక్రమణలపై చర్యలు

- రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా

ప్రజాశక్తి - భీమునిపట్నం, కలెక్టరేట్ విలేకరులు (విశాఖపట్నం)

విశాఖలో భూ ఆక్రమణలపై దృష్టి సారించామని, త్వరలో తగు చర్యలు చేపడతామని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి.సిసోడియా చెప్పారు. జివిఎంసి, రెవెన్యూ అధికారుల సమన్వయంతో భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌తో కలిసి శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. బీచ్ రోడ్డులో ఉన్న ఎర్రమట్టి దిబ్బల ప్రాంతాన్ని సందర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కొత్తవలసలో విశాలమైన కొండపై శారదా పీఠానికి కేటాయించిన 15 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ కార్యాలయంలో భీమిలి మండలానికి చెందిన పలువురు నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సంబంధించిన పలు రికార్డులను సిసోడియా తనిఖీ చేశారు. విశాఖ కలెక్టరేట్‌లో ఆయనకు వివిధ సమస్యలపై 79 వినతులను ప్రజలు అందజేశారు. ప్రధానంగా భూములు ఆక్రమణ, తప్పుడు రిజిస్ట్రేషన్లు, పేర్లు మార్పు, ట్యాంపరింగ్, తప్పుడు రికార్డులు సృష్టించి దోపిడీ తదితర అంశాలపై విన్నవించారు. వినతుల స్వీకరణ అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడియాతో సిసోడియా మాట్లాడుతూ.. జిల్లాలోని వివాదాస్పద భూములను పరిశీలించామన్నారు. విశాఖ విస్తరణ చెందడం, భోగాపురం ఎయిర్‌పోర్టు రావడం తదితర కారణాలతో భూముల ధరలు అమాంతంగా పెరిగాయన్నారు. దీనివల్ల చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించి వాటి పరిష్కారానికి మార్గాలను అన్వేషిస్తున్నట్లు చెప్పారు. అసైన్డ్, డి- పట్టా భూములను ఫ్రీహోల్డ్ చేయడం, వాటిని రిజిస్ట్రేషన్ చేయడం వంటివి జిల్లాలో ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. 2600 ఎకరాలు ఫ్రీహోల్డ్ అవకాశాలున్న భూములు జిల్లాలో ఉండగా వాటిలో 626 ఎకరాల భూమిని ఫ్రీహోల్డ్ చేసి 22ఎ నుంచి ఆ భూములను తీసివేయడం జరిగిందని చెప్పారు. వాటిలో 133 ఎకరాలు కొత్త వారి పేరు మీద రిజిస్ట్రేషన్ అయ్యిందని, సుమారు 4 మండలాల్లో ఇటువంటి పరిస్థితులు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎర్రమట్టి దిబ్బల్లో కొంత వరకు భూమిని చదును చేశారని, అధికారులు తెలుసుకొని ఆ పనులను నిలిపివేశారని వివరించారు. ఎటువంటి నిర్మాణ పనులూ అక్కడ చేపట్టడానికి అనుమతులు ఇవ్వలేదన్నారు. దసపల్లా ఎస్టేట్ భూములపై కోర్టు కేసులున్నాయని, వాటిని పరిష్కరించుకోవాల్సి ఉందని తెలిపారు.

పోలవరం కార్యాలయ ఆవరణలో ఫైళ్ల దగ్ధం కలకలం

- పనికిరాని కాగితాలుగా ధ్రువీకరణ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరంలోని పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం ఘటన శనివారం కలకలం రేపింది. ఇటీవల చిత్తూరు జిల్లా మదనపల్లెలో జరిగిన ఘటన నేపథ్యంలో తాజా పరిణామంతో వేడెక్కింది. వార్త వైరల్ అయిన 30 నిమిషాల్లోనే ఘటనా స్థలానికి భూసేకరణ సబ్ కలెక్టర్ సరళ, రాజమహేంద్రవరం ఆర్‌డిఒ శివజ్యోతి, సౌత్ జోన్ డిఎస్‌పి భవ్యకిశోర్ చేరుకుని విచారణ చేపట్టారు. దగ్ధమైన కాగితాలు పనికిరానివని ప్రాథమికంగా నిర్ధారించారు. దీనిపై మీడియాతో ఆర్‌డిఒ మాట్లాడుతూ పోలవరం ఎడమ కాలువకు సంబంధించిన ఫైళ్లు దగ్ధం కాలేదని స్పష్టం చేశారు. కాగితాలు రికార్డు గదిలోవి కావని, జిరాక్స్‌లు, సంతకం లేని చిత్తు కాగితాలని, వాటిని తాము పరిశీలించామని తెలిపారు. శాఖాధిపతి సంతకాలు లేవు కాబట్టి, ఆ పత్రాలు ఏమంత ముఖ్యమైనవి కావని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేషన్ కార్యాలయానికి కొత్త బీరువాలు వచ్చాయని, ఫైళ్లు సర్దే క్రమంలో అవసరం లేని కాగితాలను తీసేశారని తెలిపారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న స్వీపర్ ఎప్పటిలానే కార్యాలయాన్ని శుభ్రం చేసి, పనికిరాని కాగితాలను చెత్తతో కలిపి ఆమె దహనం చేసినట్లు ఆర్‌డిఒ చెప్పారు. అనుమతి లేకుండా కాగితాలు దహనం చేయడంపై విచారణ చేస్తామని, అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. దగ్ధం చేసిన ఫైళ్లను పరిశీలించారు. ఉన్నతాధికారులతో చర్చించారు. సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని జిల్లా ఎస్‌పిని కోరారు.

ఉక్కు ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలపై దాడి తగదు

- స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఉక్కు ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలపై దాడిని విరమించుకోవాలని కోరుతూ స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్‌భట్‌కు స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఉత్పత్తి ఖర్చును తగ్గించేందుకు ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు కోత విధిస్తారంటూ వారం రోజులుగా ప్రచారం సాగుతోందని తెలిపారు. రా మెటీరియల్ అందుబాటులో లేక ఉత్పత్తిని కుదిస్తున్నారని, మూడు నెలలపాటు ప్లాంట్‌లో ఉత్పత్తిని నిలిపివేస్తారంటూ ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. విఆర్ఎస్ పేరుతో కార్మికులను తొలగిస్తారని, డిప్యుటేషన్‌పై పంపుతారని, కాంట్రాక్ట్ కార్మికులను తగ్గిస్తారని.. ఇలా పలు అంశాలపై తీవ్ర చర్చ నడుస్తోందని, వీటికి బలం చేకూర్చే విధంగా పలు రకాల ఆధారాలు ప్రచారంలో ఉన్నాయని తెలిపారు. ఈ విషయమై కార్మికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారన్నారు. ఇది ప్లాంట్ అభివృద్ధికి ఏమాత్రమూ మంచిది కాదని తెలిపారు. వాస్తవాలను కార్మికులకు వివరించి వారి సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. ప్లాంట్ పరిస్థితిని, ముఖ్యంగా కార్మికులకు సంబంధించిన అంశాలను గుర్తింపు యూనియన్‌తో చర్చించాల్సిన కనీస బాధ్యత యాజమాన్యంపై ఉందని గతంలో అనేక సందర్భాలలో సిఎమ్‌డి దృష్టికి తెచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అలా చేయకుండా కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను కుదించాలనే ప్రయత్నం అనైతికం, అప్రజాస్వామికమైనదని తెలిపారు. ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల కోతకు యాజమాన్యం సిద్ధపడితే తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీనివాసరాజు, ఉప ప్రధాన కార్యదర్శి టివికె.రాజు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల తగ్గింపునకు చర్యలు

- మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ప్రమాదాల తగ్గింపునకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. విద్యుత్ షాక్‌తో మృతిచెందిన వారి వివరాలపై అధికారులతో శనివారం వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ప్రమాదాలతో మరణించిన వారి వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రాణ నష్టాన్ని తగ్గించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటి వరకు విద్యుత్ షాక్‌తో మరణించిన వారి వివరాలపై నివేదిక తయారు చేయాలని చెప్పారు. భూమికి దగ్గరగా వైర్లు వేలాడటంతో విద్యుత్ షాక్ ప్రమాదాలతో ప్రజలు మరణిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వేలాడే వైర్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. లైన్ల మరమ్మతులపై ప్రత్యేకంగా దృష్టి సారించి త్వరితగతిన వాటిని పూర్తి చేయాలని వివరించారు. తరువాత సమీక్ష నాటికి పూర్తి సమాచారంతో రావాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా చొరవ చూపాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైసిపికి ఆళ్ల నాని రాజీనామా

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని, ఇకపై వ్యక్తిగా అందుబాటులో ఉంటానని మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఈ మేరకు మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఏలూరు వైసిపి జిల్లా అధ్యక్ష పదవికి, ఇన్‌ఛార్జి పదవికి ఇటీవలే రాజీనామా చేశానని చెప్పారు. ఇప్పుడు వ్యక్తిగత కారణాల వల్ల పార్టీ సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నానని తెలిపారు. గెలుపు, ఓటములకు అతీతంగా ఏలూరు ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, తన రాజీనామా కేవలం తన వ్యక్తిగతం మాత్రమేనని చెప్పారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- 20న విజయవాడలో రాష్ట్ర సదస్సు
- ఎపి గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రెండు నెలల వేతన బకాయిలు చెల్లించి ఉద్యోగ భద్రతకు చర్యలు తీసుకోవాలని సిఐటియు అనుబంధ సంఘం ఎపి గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి, ఎపి గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్స్ యూనియన్ అధ్యక్షులు హుమయూన్ బాషా, ఉపాధ్యక్షులు వెంకట్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బలవంతంగా రాజీనామా చేసిన వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని, సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల వేతనాన్ని చెల్లించాలని, వలంటీర్లందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వలంటీర్ల సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 20న విజయవాడలోని ఎంబివికెలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఈ సదస్సుకు వలంటీర్లు తరలిరావాలని పిలుపునిచ్చారు.

అదుపు తప్పి గోడను ఢీ కొట్టిన కారు

- ఇద్దరు మృతి

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)

కారు అదుపు తప్పి గోడను ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన గుంటూరు జిల్లా తెనాలి మండలం పెదరావూరు శివారులో శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. పెదకాకాని మండల కేంద్రానికి చెందిన దుర్గాప్రసాద్ (35) కారు ఓనర్ కం డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. శుక్రవారం రాత్రి గుంటూరు నుంచి వెల్లటూరుకు బాడుగకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వెల్లటూరుకు చెందిన వెంకటేశ్వరరావు (50)ను ఎక్కించుకున్నాడు. పెదరావూరు గ్రామ శివారుకు చేరుకోగానే కారు అదుపుతప్పి రోడ్డు వెంబడి ఉన్న గోడను బలంగా ఢీకొట్టింది. దీంతో దుర్గారావుతో పాటు వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మరణించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తెనాలిలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు పోలీసులు తరలించారు.

పరిహారం కోసం ఎదురుచూపులు

పెరవలిలో వరదలకు నీటిలో నానుతున్న అరటి పంట (ఫైల్)

- వర్షాలు, వరదలకు 32 వేల ఎకరాల్లో పంట నష్టం
- నెల రోజులు దాటినా అందని ప్రభుత్వ సాయం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గత జూన్, జులై నెలల్లో కురిసిన వర్షాలు, సంభవించిన గోదావరి వరదలకు తూర్పుగోదావరి జిల్లాలో పంటలు నీటిపాలయ్యాయి. ఎర్ర కాలువ ఉప్పొంగడంతో నల్లజర్ల, నిడదవోలు, ఉండ్రాజవరం మండలాల్లోనూ, కొవ్వాడ కాలువ ఉధృతికి గోపాలపురం, తాళ్లపూడి మండలాల్లోనూ పంటలు దెబ్బతిన్నాయి. మొత్తంగా 32,387 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. నెలరోజులైనా రైతులకు నేటికీ పరిహారం అందలేదు.

207 గ్రామాలపై వరద ప్రభావం

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 18 మండలాల పరిధిలోని 207 గ్రామాల్లో వరద ప్రభావం చూపించింది. జిల్లాలో మొత్తం 1,33,875 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. 32,387 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. 16,579 మంది రైతుల పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు నిర్ధారించారు. 107 ఎకరాల్లో వరి నారు మళ్లు నీట మునిగినట్లు లెక్కగట్టారు. అత్యధికంగా నిడదవోలులో 9,830 ఎకరాల్లో వరి నాట్లు, 50 ఎకరాల్లో చెరుకు పంట నీటిపాలయ్యాయి. ఉండ్రాజవరం మండలంలో 8,750 ఎకరాల్లో వరి నాట్లు నీట మునిగాయి. సీతానగరం మండలంలో 7,800 ఎకరాల్లో వరి, తాళ్లపూడి మండలంలో 1,252 ఎకరాల్లో వరి, 50 ఎకరాల్లో చెరకు, నల్లజర్ల మండలంలో వెయ్యి ఎకరాల్లో వరి, రాజానగరం మండలంలో 1,062 ఎకరాల్లో వరి నాట్లు దెబ్బతిన్నాయి. జిల్లాలోని 77 గ్రామాల పరిధిలో 1,102 మంది రైతులకు చెందిన 1,745 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. మిగిలిన మండలాల్లో 800 ఎకరాలకుపైగా కూరగాయలు, ఇతర పంటలు దెబ్బతిన్నాయి. మొత్తంగా రూ.17.48 కోట్ల వరకూ పరిహారం చెల్లించాల్సి ఉందని అధికారులు లెక్కలు తేల్చారు. నష్టపోయిన రైతులలో చిన్న సన్నకారు రైతులే అధికం. 33 శాతానికి పైబడి పంట దెబ్బతిన్నప్పటికీ నాట్లు వేసి 30 రోజులు దాటిన పంటలకు మాత్రమే పంట నష్టం అంచనాలు తయారు చేశారు. దీంతో, వేలాది మంది రైతులు పంట నష్టం పొందే అవకాశం కోల్పోయారు. 30 రోజుల నిబంధనల కారణంగా పంట నష్టం వాటిల్లినా వేలాది ఎకరాలు వ్యవసాయ శాఖ లెక్కల్లోకి రాలేదు.

రూ.30 వేల నష్టం వాటిల్లింది

రెండు ఎకరాల్లో వరి సాగు ప్రారంభించాను. రూ.30 వేలకుపైగా పెట్టుబడి పెట్టాను. కొవ్వాడ కాలువ వరద ముంచెత్తింది. పది రోజుల పాటు వరద నీరు పొలంలోనే ఉండిపోయింది. పంట మొత్తం కుళ్లిపోయింది. మళ్లీ నారు తీసుకొచ్చి నాట్లు వేయాల్సి ఉంది. దీనికి మరో రూ.20 వేల వరకూ ఖర్చవుతుంది. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా పరిహారం అందలేదు.

- బి.రామకృష్ణ, రైతు, తాళ్లపూడి

ప్రభుత్వమే ఆదుకోవాలి

రెండెకరాల్లో కర్పూరం రకం అరటి సాగు చేశాను. పంట చేతికి వచ్చే సమయంలో వరద ముంచెత్తింది. పది రోజులుగా నీటిలో ఉండడంతో తోటంతా ముగ్గిపోయింది. రూ.5 లక్షల వరకూ నష్టపోయాను. ప్రభుత్వమే ఆదుకోవాలి. తక్షణమే సాయం అందించాలి.

- బి. రమేష్, అరటి రైతు, పెరవలి

పోలవరం విధ్వంసం చంద్రబాబుదే

- వైసిపి వెబ్‌సైట్‌లో విదేశీ నిపుణుల కమిటీ నివేదిక పెడతాం
- మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టులో జరిగిన విధ్వంసం చంద్రబాబు ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్లే జరిగిందని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి వల్లే డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని ఇన్నాళ్లు దుష్ప్రచారం చేసిన టిడిపి.. ఇప్పుడు అంతర్జాతీయ నిపుణుల కమిటీనే గత టిడిపి ప్రభుత్వం నాటి చర్యల వల్లే కాఫర్ డ్యామ్‌లు, డయాఫ్రం వాల్ దెబ్బతిన్నాయని తేల్చిందని తెలిపారు. ఈ అంశంపై చంద్రబాబు గానీ, మంత్రి నిమ్మల రామానాయుడు గానీ తనతో చర్చకు రావాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు కమిషన్‌ల కోసం ప్రొటోకాల్‌ను మరిచి గందరగోళంగా స్పిల్‌వే, కాఫర్‌డ్యామ్, డయాఫ్రం వాల్ పనులు ఒకేసారి చేపట్టడంతో నిర్మాణంలో తప్పిదాలు చోటుచేసుకున్నాయన్నారు. ఈ అంశాన్ని పెద్ద తప్పిదంగా నిపుణుల కమిటీ తేల్చిందన్నారు. వాస్తవంగా వైసిపి హయాంలోనే పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా జరిగాయన్నారు. పనులకు సంబంధించి వైసిపి హయాంలోనే రావాల్సిన రూ.12 వేలకోట్లు రాకుండా అడ్డుకున్నది చంద్రబాబేనని విమర్శించారు. ప్రజలకు ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టుపై అంతర్జాతీయ నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను వైసిపి వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో వుంచుతున్నామని తెలిపారు.

స్వర్ణభారత్ ట్రస్ట్ స్ఫూర్తిదాయకం

- ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

ఛాయాచిత్ర పుస్తకావిష్కరణ చేస్తున్న ఉపరాష్ట్రపతి, గవర్నర్, వెంకయ్యనాయుడు తదితరులు

ప్రజాశక్తి - వెంకటాచలం (నెల్లూరు)

స్వర్ణభారత్ ట్రస్ట్ 23 ఏళ్ల ప్రస్థానం అంటే అంకెలు కాదని, స్ఫూర్తిదాయకమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ అన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్ 23వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ముందుగా అక్షర విద్యాలయాన్ని సందర్శించారు. ఆ తర్వాత ట్రస్ట్ ఆవరణలో నూతనంగా నిర్మించిన పరిపాలన భవనాన్ని ప్రారంభించారు. స్వర్ణభారత్ ట్రస్ట్, భగవాన్ మహవీర్ వికలాంగ్ సహాయ సమితి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న జైపూర్ ఫుట్ ఉచిత శిబిరాన్ని సందర్శించి కొందరికి కృత్రిమ అవయవాలను అందజేశారు.కార్యక్రమంలో భాగంగా వెంకయ్యనాయుడు జీవన ప్రస్థాన ఛాయా చిత్ర ఆంగ్ల గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. వెంకయ్యానాయుడు ఆలోచనలు మహోన్నతమైనవని పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారం లేకుండా 23 ఏళ్ల పాటు ట్రస్ట్‌ను ఓ మహాయజ్ఞంలా ట్రస్టీ దీపావెంకట్ నిర్వహించారని, దానికి ఎంతో నిబద్ధత కావాలని కొనియాడారు. వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. 23 ఏళ్ల క్రితం మిత్రుల సహకారంతో ఈ ట్రస్ట్ ప్రారంభమైందన్నారు. ఈ సంస్థ ద్వారా లక్ష మందికి పైగా నైపుణ్య శిక్షణను అందించామని తెలిపారు. ముఖ్యంగా రైతులు నవీన పద్ధతులను అందిపుచ్చుకుని సాధికారతతో తల ఎత్తుకుని నిలబడటం తమ కలగా అభివర్ణించారు. మహిళలు సైతం అదే సాధికారతతో తల ఎత్తుకు నిలబడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి, పూర్వ ఉపరాష్ట్రపతి దంపతులతో పాటు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ, పార్లమెంట్ సభ్యులు బీదా మస్తాన్ రావు, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ చైర్మన్, శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బాబూరావు, నేతలు

దుర్గారావుకు కన్నీటి వీడ్కోలు

- ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి- నూజివీడు టౌన్

సిపిఎం నేత దుర్గారావు (ఫైల్)

ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన సిపిఎం సీనియర్ నేత యెల్లినేని దుర్గారావు మృతి తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. శనివారం ఆయన దుర్గారావు భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. నూజివీడు ప్రాంతంలో దుర్గారావు అనేక భూ పోరాటాలు నిర్వహించారని తెలిపారు. కార్మిక, కర్షక సమస్యలపై ఉద్యమించారని గుర్తు చేశారు. దుర్గారావు కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ పార్టీ ఆశయాలకనుగుణంగా దుర్గారావు అహర్నిశలు శ్రమించారని, తనదంటూ పార్టీలో ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్నారని తెలిపారు. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం ఫోన్‌లో సంతాపం తెలిపారు. అనారోగ్యంతో విజయవాడలోని ప్రయివేట్ ఆస్పత్రిలో దుర్గారావు శుక్రవారం మృతి చెందడంతో ఆయన భౌతికకాయాన్ని కుటుంబసభ్యులు స్వగ్రామం నూజివీడు తీసుకొచ్చి శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. దీనికి ముందు భౌతికకాయంపై సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు పార్టీ జెండా ఉంచి నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర నాయకులు బిఆర్.తులసీరావు, ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.కేశవరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.నరసింహ, కె.శ్రీనివాస్, సిపిఐ నాయకులు సరసాని వెంకట రామారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బిడి.రవికుమార్, టిడిపి నాయకులు నూతక్కి వేణుగోపాల్, సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్ఆర్.హనుమాన్లు, ప్రజా సంఘాల నాయకులు ప్రసాద్, సుబ్బారావు, కృష్ణారెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

గంజాయి నిర్మూలనకు 27 స్పెషల్ టీమ్‌లు

- డిఐజి గోపినాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం 27 స్పెషల్ టీమ్‌లను నియమించినట్లు విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపినాథ్‌రెడ్డి తెలిపారు. గంజాయి రవాణా ఎక్కువగా వున్న అనకాపల్లి ఎస్‌పి ఎం దీపికా పాటిల్, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్‌పి అమిత్ బర్దార్, విజయనగరం ఎస్‌పి వకుల్ జిందాల్, మన్యం జిల్లా ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి, శ్రీకాకుళం ఎస్‌పి కెవి మహేశ్వరరెడ్డితో పాటు ఎన్‌డిపిఎస్ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి గోవిందరావుతో శనివారం సమావేశం నిర్వహించారు. సరిహద్దు రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో ఎక్కువ గంజాయి సాగు జరుగుతోందని, అక్కడ పండించిన గంజాయిని రాష్ట్రం గుండా ఇతర రాష్ట్రాలకు రవాణా చేసేందుకు కొన్ని ముఠాలు పనిచేస్తున్నాయని డిఐజి తెలిపారు. గంజాయి రవాణా చేసే ముఠాల కదలికల పట్ల అప్రమత్తంగా వుండాలన్నారు. స్పెషల్ టీమ్‌లను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. పొలాల్లోని గంజాయి పంటను గుర్తించేందుకు డ్రోన్‌లు వినియోగించాలన్నారు. దాచిన గంజాయిని గుర్తించేందుకు జాగిలాల సేవలను ఉపయోగించుకోవాలన్నారు. రాష్ట్రంలో వంద రోజుల ప్రణాళికతో గంజాయిని సమూలంగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

మూడేళ్లలో రెట్టింపు విస్తరణ : మైత్రిడెంట్ వెల్లడి

న్యూఢిల్లీ: రిటైల్ టచ్ పాయింట్స్‌ని రెట్టింపు చేయడం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 40 శాతం వృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఫర్నీషింగ్ బ్రాండ్ మైత్రిడెంట్ తెలిపింది. వచ్చే మూడేళ్లలో తమ టచ్ పాయింట్లను 5000 నుంచి 10,000 చేర్చాలని నిర్దేశించుకున్నట్లు ఆ సంస్థ మైత్రిడెంట్ ఛైర్‌పర్సన్ నేహా గుప్తా బెక్టర్ పేర్కొన్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో మైత్రిడెంట్ గణనీయమైన వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుందని సిఇఒ రజన్నీష్ బాటియా పేర్కొన్నారు. వచ్చే మూడేళ్లలో రూ.1,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలని నిర్దేశించుకున్నామన్నారు.

పి2పి లెండింగ్ కఠినతరం

న్యూఢిల్లీ: పీర్ టు పీర్ లెండింగ్ వేదిక (పి2పి)లో పారదర్శకత పెంచడానికి నిబంధనలను కఠినతరం చేసినట్లు ఆర్‌బిఐ వెల్లడించింది. ఈ వేదిక మధ్యవర్తిగా వ్యక్తులు మరో వ్యక్తికి అప్పులు ఇవ్వడానికి వీలుంటుంది. కొన్ని సంస్థలు నిబంధనలను ఉల్లంఘిస్తున్న నేపథ్యంలో ఆర్‌బిఐ పలు సవరణలు చేసింది. రుణదాతలకు కనీస రిటర్న్స్ ఇవ్వాలి. క్రాస్ సెల్లింగ్‌తో బీమా పథకాలను అంటగట్టడానికి వీలు లేదు. నిబంధనలకు విరుద్ధంగా రుణాలనూ మంజూరు చేస్తే ఆయా సంస్థలపై చర్యలు ఉంటాయని ఆర్‌బిఐ తెలిపింది.

మైనింగ్ పేరిట కొండను ధ్వంసం చేయొద్దు

- కుసులవాడలో రెండో రోజూ కొనసాగిన సిపిఎం పాదయాత్ర

పాదయాత్రలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి - ఆనందపురం (విశాఖపట్నం)

విశాఖ జిల్లా ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీకి ఆనుకొని ఉన్న కొండకు సంబంధించి మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని, ఈ నెల 28న అధికారులు తలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణను విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. మైనింగ్‌తో వాటిల్లే నష్టాలను తెలియజేస్తూ పార్టీ ఆధ్వర్యాన చేపట్టిన పాదయాత్ర శనివారానికి రెండో రోజుకు చేరుకుంది. కుసులవాడ ఎస్‌సి కాలనీ, గొల్లలపాలెం బిసి కాలనీ, దాసరి వీధి, కుసులవాడ ప్రాంతాల్లో ఈ పాదయాత్ర సాగింది. నాయకులు కరపత్రాలు పంచుతూ ప్రజలను చైతన్యవంతం చేశారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ మైనింగ్‌తో కుసులవాడ చుట్టుపక్కల ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్నటువంటి అన్ని రకాల పంటలకూ నష్టం వాటిల్లనుందని తెలిపారు. భూగర్భ జలాలు, చెరువులు, బోర్లు కలుషితమవుతాయన్నారు. ప్రజలు కిడ్నీ, శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, కేన్సర్ బారిన పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ భీమిలి జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి మాట్లాడుతూ మైనింగ్ అనుమతులు రద్దు చేయకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జోన్ కమిటీ సభ్యులు రవ్వ నర్సింగరావు, ఎస్.అప్పలనాయుడు, వాళ్ల నాగరాజు, పి.సూర్యనారాయణ, కొయ్య గౌరి పాల్గొన్నారు.

రోడ్డుపై బైఠాయించిన రైతులు

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

- తహశీల్దార్ హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)

పొలాలకు సాగునీరు అందడంలేదని రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. గుంటూరు జిల్లా తెనాలి మండలంలోని తంగెళ్లమూడి వద్ద నందివెలుగు-గుంటూరు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. దాదాపు గంటకుపైగా ఆందోళన కొనసాగడంతో వాహనాలు పెద్దఎత్తున నిలిచిపోయాయి. తెనాలి రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. అధికారులు వచ్చేంత వరకు ఆందోళన విరమించబోమని రైతులు భీష్మించారు. సమాచారం అందుకున్న తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ ఆందోళన వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడారు. సాగునీటిపై సమస్యల గురించి వారితో చర్చించారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన ఇరిగేషన్ అధికారులు అక్కడి రైతులకు వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. సాగునీటికి అడ్డుకట్ట వేస్తున్న రైతులపైనా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇరిగేషన్ అధికారులపైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించి సాగునీటి సమస్యలపై శుక్రవారం రాత్రి జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ నిర్వహించారని రైతులకు వివరించారు. సమస్యకు కచ్చితంగా పరిష్కారం చూపుతామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

- ఎస్ఎఫ్ఐ ఆలిండియా మాజీ అధ్యక్షులు వైవి

ప్రజాశక్తి - ఏలూరు

దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ ఆలిండియా మాజీ అధ్యక్షులు వైవి డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యావిధానం రోజురోజుకు పెరుగుతోందని, ప్రభుత్వ విద్యా విధానాన్ని రోజురోజుకు దిగజారుతోందన్నారు. ఏలూరులోని సిఐటియు కార్యాలయంలో శుక్ర, శనివారాల్లో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సమావేశాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెరుగైన విద్య అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ... కొల్‌కతా ప్రభుత్వ కళాశాల ఆస్పత్రిలో ట్రెయినీ వైద్యురాలిపై అమానుషంగా సామూహిక అత్యాచారం చేసి, పాశవికంగా హత్య చేసిన కేసులో సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి, సిబిఐ ఆధ్వర్యంలో త్వరితగతిన నేర పరిశోధన పూర్తి చేసి, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని కోరారు. వైద్యులకు, వైద్య సిబ్బందికి తగిన రక్షణ కల్పించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్రత్యేక రక్షణ చట్టాలు కేంద్ర స్థాయిలో తీసుకురావాలని, రాష్ట్రంలోని వైద్య సిబ్బంది రక్షణ చట్టాన్ని సవరించి కఠినతరం చేయాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థులు చేస్తున్న ఆందోళనల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ నాయకత్వం పాల్గొని మద్దతు తెలపాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్, సిహెచ్.వినోద్, పరమేష్, సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, రవి, వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వయనాడ్‌కు బొండాడ గ్రూపు సాయం

హైదరాబాద్ : వయనాడ్ ప్రకృతి వైపరీత్య బాధితులకు అపన్నహస్తం అందించినట్లు బొండాడ ఇంజినీరింగ్ లిమిటెడ్ (బిఇఎల్) ఓ ప్రకటనలో తెలిపింది. ఇందుకోసం కేరళ చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్‌కు రూ.25 లక్షలు ఇచ్చింది. ఈ చెక్కును కేరళ సిఎం పినరయి విజయన్‌కు బిఇఎల్ సిఎండి రాఘవేంద్రరావు అందించారు. ఈ మొత్తంతో వయనాడ్ ప్రకృతి బాధితులకు కొంతనైనా సాయంగా ఉంటుందని భావించి ముందుకు వచ్చామన్నారు.

హాస్పిటల్స్‌లో వ్యయాలపై ఐటి శాఖ దృష్టి

న్యూఢిల్లీ : ప్రయివేటు ఆసుపత్రులు, హోటళ్లలో పెద్ద ఎత్తున నగదు లావాదేవీలు జరుగుతున్నాయని.. వాటిపై దృష్టి సారించాలని ఐటి శాఖకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సిబిడిటి) ఆదేశాలు జారీ చేసింది. డిజిటల్ లావాదేవీలు అందుబాటులోకి వచ్చినప్పటికీ.. భారీగా నగదు లావాదేవీలు చోటు చేసుకోవడంపై సిబిడిటి ఆందోళన వ్యక్తం చేసింది. హోటళ్లు, లగ్జరీ బ్రాండ్ విక్రయాలు, హాస్పిటళ్లు, ఐవిఎఫ్ క్లినిక్స్ వద్ద ఎక్కువగా నగదు లావాదేవీలు జరుగుతున్నాయని గుర్తించింది. వాటిపై దృష్టి సారించాలని ఐటి శాఖను ఆదేశించింది. సాధారణంగా రూ.2 లక్షలకు పైబడి నగదు లావాదేవీలు జరిగితే ఆ వివరాలు ఐటి శాఖకు అందించాల్సి ఉంటుంది. కానీ నిబంధనలు అతిక్రమించి పెద్ద మొత్తంలో లావాదేవీలు యథేచ్ఛగా జరుగుతున్నాయని ఐటి శాఖను సిబిడిటి అప్రమత్తం చేసింది.

గత ప్రభుత్వ హయాంలో పోలవరం నిధులు దారిమళ్లింపు

- రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గత ప్రభుత్వం హయాంలో పోలవరం నిధులు దారి మళ్లించారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. శనివారం నాడిక్కడ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడే అర్హత వైసిపి నేతలకు లేదని అన్నారు. ఐదేళ్లపాటు అధికారంలో ఉండి పోలవరాన్ని గోదావరిలో ముంచేసిన వాళ్లు ఇప్పుడు మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014-19 మధ్య గత టిడిపి ప్రభుత్వం పోలవరానికి రూ.11,500 కోట్లకు పైగా ఖర్చు పెట్టిందని, ఆ సమయంలో కేంద్రం రూ.6 వేలకోట్లు మాత్రమే రీయింబర్స్‌మెంట్ చేసిందని అన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో రూ.4,167 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందని, కానీ మా హయాంలో జరిగిన పనితో కలుపుకుని రీయింబర్స్‌మెంట్ కింద రూ.8,382 కోట్లు వచ్చాయని గుర్తుచేశారు. అలా వచ్చిన పోలవరం నిధులను ప్రాజెక్టు కోసం ఖర్చుపెట్టకుండా దారి మళ్లించిన ఘనత వైసిపిదేనని విమర్శించారు.

వైసిపి హయాంలో ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మాణం పూర్తికాకపోవడం వల్ల 2020 భారీ వరదలకు డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నమాట వాస్తవం కాదా? అంటూ ప్రశ్నించారు. దీనిపై ఐఐటి హైదరాబాద్ నిపుణులు ఇచ్చిన నివేదిక వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. 2014-19 మధ్య ఉన్న కాంట్రాక్టర్లను రద్దు చేసి, కొత్త కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడానికి 13 నెలల సమయం పట్టిందని మంత్రి చెప్పారు. ఒకే పనిని రెండు ఏజెన్సీలతో చేయిస్తే ఎవరు బాధ్యత వహిస్తారంటూ పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఎ) లేఖ రాయడం నిజం కాదా? అని ధ్వజమెత్తారు. ఏజెన్సీలను మార్చడం సరికాదంటూ పిపిఎ మినిట్స్‌లో నమోదు చేసిన విషయం నిజమా.. కాదా? అని ప్రశ్నించారు. తమ అవినీతిని కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో భాగంగానే దస్త్రాల దహన కార్యక్రమాన్ని వైసిపి చేపట్టిందని ధ్వజమెత్తారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

రాయచోటిలో దారుణం

- వంట గ్యాస్ నిప్పంటించుకుని కుటుంబం ఆత్మహత్య
- ముగ్గురు సజీవ దహనం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్ (అన్నమయ్య జిల్లా)

మృతి చెందిన రమాదేవి, పిల్లలు (ఫైల్ ఫొటో)

అన్నమయ్య జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. రాయచోటి మండలం కొత్తపేటలో శనివారం వంట గ్యాస్‌కు నిప్పంటించుకుని కుటుంబం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనలో వివాహిత, ఇద్దరు పిల్లలు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటలోని తొగటవీధికి చెందిన ఎర్రగుడి రమాదేవి (35), తన ఇద్దరు పిల్లలు ప్రభు మనోహర్ (7), మన్విత (5)లతో కలిసి నివాసముంటున్నారు. ఆమె భర్త రాజా జీవనోపాధి కోసం మూడేళ్ల క్రితం కువైట్ వెళ్లారు. వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. భార్యపై అనుమానంతో ఇంట్లో సిసి కెమెరాలు బిగించి నిత్యం పర్యవేక్షించేవారు. భర్తతో గొడవలు, అనుమాన వేధింపులు తాళలేక వంట గ్యాస్‌కు నిప్పు అంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ప్రమాదంలో రమాదేవితో సహా తన ఇద్దరు పిల్లలు సజీవ దహనమయ్యారు. ఇంట్లో నుంచి దట్టమైన పొగలు బయటకు రావడంతో స్థానికులు అక్కడకు చేరుకొని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అర్బన్ సిఐ చంద్రశేఖర్, ఎస్ఐ నరసింహారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి నివాళులర్పించారు. ఇంట్లో సిసి కెమెరా ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ చంద్రశేఖర్ వెల్లడించారు. ప్రమాద ఘటన విషయం తెలుసుకున్న రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. ఈ ఘటనకు కారణాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం ఎలా జరిగింది? ప్రమాదానికి కారణాలను త్వరితగతిన గుర్తించాలని మంత్రి పోలీసు అధికారులను ఆదేశించారు.

సంపాదకీయం

ఈ ప్రశ్నకు బదులేది?

వందే మాతర గీతం వరస మారుతున్నది/ తరం మారుతున్నది ఆ స్వరం మారుతున్నది/ పుల్లకు సుమిత ధ్రుమదళ వల్లికామ తల్లి కలకూ/ చిదిమి వేసినా వదలని చీడ అంటుకున్నది/ ...ముసి ముసి నవ్వుల మాటున విషం మరుగుతున్నది' అంటారు సినారె. వందేమాతం పల్లవించిన నేలపై ఆమె తల్లడిల్లుతున్నది. 'పంజాబు, సింధు, గుజరాత్ మహారాష్ట్రలతో కూడిన పశ్చిమ తీర ప్రాంతం, తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, తుళు భాషలతో కూడిన ద్రావిడ ప్రాంతం, ఒరిస్సా మొదలైన రాష్ట్రాలతో కూడిన తూర్పు తీర ఉత్కళ ప్రాంతం, ఈశాన్య రాష్ట్రాలతో కూడిన బెంగాల్ ప్రాంతం, వింధ్య హిమాలయ పర్వతాలు, యమున గంగలు పై కంటే ఎగసే సముద్ర తరంగాలు- ఇవన్నీ... తమరి శుభ నామమే తలుచుకుంటున్నాయి. తమరి శుభ ఆశిస్సులనే కోరుకుంటున్నాయి. తమరి విజయగాధనే పాడుకుంటున్నాయి. ఓ జనసమూహాల మనసుల అధినాయక... మీకు జయము! ఓ భారత భాగ్య విధాత.. మీకు జయము' అని ఆసేతు హిమాచలము 'భారతదేశం నా మాతృభూమి, భారతీయులంతా నా సహోదరుల'ని పాడుకుంటున్న దేశంలో... 77 ఏళ్ళ స్వాతంత్ర్యమా... నాకు స్వేచ్ఛెక్కడ? అని దేశంలోని ప్రతి ఆడపడుచూ ప్రశ్నిస్తోంది. ఈ ప్రశ్న... 'ఆడపిల్ల అర్ధరాత్రి ఒంటరిగా నడిచిన నాడే అసలైన స్వాతంత్ర్యం' అన్న గాంధీజీ ఆకాంక్షను సవాలు చేస్తోంది.

గృహ బంధనాలను, పురుషాధిక్యతను ఛేదించుకొని ఇప్పుడిప్పుడే మహిళలు బయటి ప్రపంచంలోకి అడుగు పెడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో తమ ప్రతిభా సామర్థ్యాలను చాటుకుంటున్నారు. అయితే, పనిచేసే చోట సాధారణ శ్రామికుల నుంచి ఉన్నతోద్యోగుల వరకూ ఎదురౌతున్న లైంగిక వేధింపులు సమాజాన్ని చీడ పురుగులా పట్టి పీడిస్తున్నాయి. మహిళలకు భద్రత కరువౌవుతోంది. బయటకు వెళ్లినవారు క్షేమంగా తిరిగి రావడం ప్రశ్నార్థకంగా మారింది. కొల్‌కతా ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం... దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ ఘటనపై ఆందోళనలు నిరసనలు జరుగుతుండగానే... ఉత్తరాఖండ్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళుతున్న నర్సుపై హత్యాచారం జరిగింది. మహిళలకు కనీస భద్రత లేని సమాజాన్ని నాగరికమైందని అనగలమా? ఆడపిల్లలపై అకృత్యాలకు తెగబడుతోన్న కీచకులను శిక్షించలేనప్పుడు అది చట్టబద్ధమైన పాలన అనగలమా? ఇది ఏ ఒక్కరి ప్రశ్నో కాదు... దేశంలో జరుగుతున్న హత్యాచార ఘటనలపై ఎందరో మహిళలు అడుగుతున్న ప్రశ్నలు. 'అర్ధరాత్రి స్వతంత్రం అంధకార బంధురం/ అంగాంగం దోపిడైన కన్నతల్లి జీవితం/ ఇదే నేటి భారతం భరతమాత జీవితం' అంటాడు మహాకవి శ్రీశ్రీ. 'ఎఫ్‌బి వాల్‌పైనో, ఎక్స్ హ్యాండిల్‌లోనో స్పందిస్తే సమాధానం దొరకదు. మువ్వన్నెల జెండా రెపరెపలాడే వేళ ఈ హత్యాచారంపై స్వతంత్ర భారతం స్పందించాలని, నడివీధిలోకొస్తేనే పాలకుల్లో కదలిక వస్తుందని, అదీ అర్ధరాత్రి రోడ్డు ఎక్కి నిరసన తెలపాలని' కొల్‌కతాకు చెందిన 29 ఏళ్ల రిమ్‌జిమ్ సిన్హా పిలుపునిచ్చింది. సిన్హా పిలుపు సామాజిక మాధ్యమాల్లో జాతీయ గీతంలా మార్మోగింది. ఎందరో యువతీ యువకులు రోడ్డెక్కారు. మహిళలకు భద్రత కల్పించాలని దేశమంతా ఒక్కటిగా నినదిస్తోంది.

కొల్‌కతా వీధుల్లో గొంతువిప్పిన నిరసన జ్వాలలు...ఇప్పుడు దేశమంతా వెల్లువెత్తుతున్నాయి. 'అర్ధరాత్రి ఆడపిల్ల ఒంటరిగా సెమినార్ హాల్‌కి వెళ్లడం ఎందుకు?' అని స్వయానా ఆర్జీకార్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ అంటే, 'పెందరాళే ఇంటికి చేరుకోక... ఎందుకీ పెత్తనాలు' అని మరో పురుషపుంగవుడు సణిగితే, 'ఆడవాళ్లంతా రోడ్డెకుతున్నారు మంచిదే... కానీ, మిమ్మల్ని మీ మొగుళ్లు కొడితే, మా పూచీకాదు' అని సాక్షాత్తూ ఆ రాష్ట్ర మంత్రే వాక్రుచ్చితే... ఇలా నోరు పారేసుకున్నవారందరి మస్తిష్కాల మకిలి వదలగొడుతూ... బాలికల నుంచి వృద్ధుల వరకూ అంతా పిడికిలి బిగించారు. తమ భద్రతపై నినదిస్తున్నారు. వీరికి జవాబు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. భారతావని ప్రగతిపథంలో దూసుకుపోవాలంటే...మహిళా భాగస్వామ్యం పెరగాలి. పని ప్రదేశాల్లోనే కాదు, సురక్షితంగా ఇంటికి చేరగలిగే పరిస్థితి వుండాలి. లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చెయ్యాలి. అప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సాధికారమౌతుంది.

మహనీయుల మాట



దేవుడు మానవ కల్పితం.
స్వర్గ నరకాలు లేనే లేవు.
మతం, గుళ్లు, గోపురాలు అక్కర్లేదు.
కావలసింది మానవత్వం.
- లూథర్ బర్‌బాంక్,
ప్రముఖ వృక్ష శాస్త్రజ్ఞుడు.

మూడో పాదంలో మోడీ ఎజెండా ముప్పు

విశ్లేషణ

తెలకపల్లి రవి

గత రెండు ఎన్నికల తర్వాత తొలిసారి బిజెపి ఆధిక్యత కోల్పోయిన ప్రభావమేంటో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో స్పష్టంగా కనిపించింది. ఆగష్టు 15న ఎర్రకోటపై నుంచి ప్రధాని మోడీ చేసిన ప్రసంగం కూడా దానికే అద్దం పట్టింది. కాంగ్రెస్ అధికారిక ప్రతిపక్షంగా ఆవిర్భవించడం, రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేత హోదా పొందడం, లౌకిక పార్టీలు ఇండియా బ్లాక్‌గా ఒక్క తాటి పైకి రావడం బిజెపి జీర్ణించుకోలేక పోతున్నది. లోక్‌సభలో తొలిసారి హిందుత్వ రాజకీయాలపై సూటిగా చర్చ జరగడం కన్నా ఇందుకు మరో నిదర్శనం అక్కర్లేదు. అయితే ప్రతిపక్షాల పెరుగుదలపై ఉక్రోషంతో బిజెపి సభ్యులు మంత్రులు చేసిన దాడి అనేక సందర్భాల్లో వికృతంగా తయారైంది. ఆగష్టు 15న ఎర్రకోటపై నుంచి ప్రధాని మోడీ చేసిన ప్రసంగం ఈ కుల మత రాజకీయాల వ్యూహంలో భాగమే. ఏకరూప పౌరస్మృతి అనే బిజెపి ఎన్నికల నినాదం కోసం ఇప్పుడు దేశంలో వున్నది మతతత్వ పౌరస్మృతి అన్నట్టు ఆయన వ్యాఖ్యానించారు. ఈ మాటలు ముస్లిం మైనార్టీలను ఉద్దేశించినవన్నది స్పష్టమే. ఎందుకంటే హిందూ పౌరస్మృతిని ఆయన ఏమీ అనే ప్రసక్తి వుండదు. వాంఛనీయమూ కాదు. రాజ్యాంగం ప్రకారం ఇప్పుడు అమలు జరుగుతున్న వాటిని మతతత్వంగా మోడీ ఎలా ఆరోపిస్తారు? విభిన్న మతాలు, విశ్వాసాలతో కూడిన ఈ దేశంలో అందరినీ ఒప్పించి ప్రజాస్వామికంగా ఉమ్మడి పౌరస్మృతి తీసుకురావాలే గానీ ఒకరి విశ్వాసాలు మరొకరిపై రుద్దడం సాధ్యం కాదు.

నిజానికి బిజెపి పూర్వపు అవతారమైన జనసంఘం ఆది నుంచి అదేపనిగా వివాదం రేపుతున్న అంశాల్లో ఏకరూప పౌరస్మృతి ఒకటి. 1951 అక్టోబర్‌లో జనసంఘం ఆవిర్భవించి నప్పటి ఎజెండాలోనే ఈ అంశం వుంది. అయినా బిజెపి ఏర్పడిన తర్వాత 1989 ఎన్నికల వరకూ ఈ ఊసే ఎత్తుకోలేదు. అయోధ్య చిచ్చు రగిలిన తర్వాతనే బిజెపి కీలక ఎజెండా కింద చేపట్టిన మూడు అంశాలలో దీన్ని చేర్చింది. అయోధ్య రామమందిర నిర్మాణం, కాశ్మీర్ 370 అధికరణం రద్దు అన్నవి తక్కిన రెండు అంశాలుగా ప్రకటించింది. రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలో 44వ అధికరణం ఏకరూప పౌరస్మృతి వుండాలని చెబుతున్నమాట నిజమే. కానీ తన మత రాజకీయాలకు భూమిక లభించిందని రూఢి అయిన తర్వాతనే 1989లో దీన్ని ఆ పార్టీ ముందుకు తెచ్చింది. అప్పటి నుంచి దీనిపై ఏదో రూపంలో చర్చ చేస్తూనే వుంది. ఇక్కడ ఇంకో విశేషం కూడా గమనించాలి.

రెండూ పూర్తయినట్టేనా?

అయోధ్యలో రామమందిరం, 370 రద్దు అనే లక్ష్యాలు ఇప్పటికే తాను సాధించేశానని ఆ పార్టీ అతిశయంతో వుంది. మిగిలింది ఏకరూప పౌరస్మృతి (కామన్ సివిల్ కోడ్-యుసిసి) మాత్రమేనని అహంభావం కూడా, సంఘ పరివారం దీనిపై ఒత్తిడి చేస్తున్నది. ఉత్తరాఖండ్‌తో సహా పలు బిజెపి పాలిత రాష్ట్రాలు దీనిపై శాసనసభలో తీర్మానాలు చేశాయి కూడా. ఈ ఏడాది అనేక కీలక రాష్ట్రాల్లో ఎన్నికలు జరగవలసి వుంది. మూడోసారి ఎలాగో అధికారంలోకి వచ్చాము గనక ఎలాగోలా దీన్ని పూర్తి చేసుకోవాలనే ఆరాటమూ వుంది. ఇన్ని కారణాలతోనే మోడీ సూటిగా ఎర్రకోట ప్రసంగంలో దాన్ని లేవనెత్తారు. తద్వారా ఒకటి రెండు విషయాలు స్పష్టం చేయదలిచారు. మొదటిది మెజార్టీ రాకపోయినా తమ ఎజెండాలో, ఆలోచనల్లో మార్పు లేదనేది దేశానికి మాత్రమే గాక ఎన్‌డిఎ మిత్రులకూ స్పష్టం చేయడం. రెండోది హర్యానా, కాశ్మీర్, తర్వాత మహారాష్ట్ర ఆ తర్వాత ఢిల్లీ వంటి శాసనసభల ఎన్నికలకు ముందే మతతత్వ ఎజెండాను మళ్లీ సిద్ధం చేయడం. తద్వారా హిందువుల ఓట్లను ఆకర్షించాలనే తాపత్రయం.



> ఆగష్టు 15న ఎర్రకోటపై నుంచి ప్రధాని మోడీ చేసిన ప్రసంగం ఈ కుల, మత రాజకీయాల వ్యూహంలో భాగమే. ఏకరూప పౌరస్మృతి అనే బిజెపి ఎన్నికల నినాదం కోసం ఇప్పుడు దేశంలో వున్నది మతతత్వ పౌరస్మృతి అన్నట్టు ఆయన వ్యాఖ్యానించారు. ఈ మాటలు ముస్లిం మైనార్టీలను ఉద్దేశించినవన్నది స్పష్టమే. ఎందుకంటే హిందూ పౌరస్మృతిని ఆయన ఏమీ అనే ప్రసక్తి వుండదు. వాంఛనీయమూ కాదు. రాజ్యాంగం ప్రకారం ఇప్పుడు అమలు జరుగుతున్న వాటిని మతతత్వంగా మోడీ ఎలా ఆరోపిస్తారు? విభిన్న మతాలు, విశ్వాసాలతో కూడిన ఈ దేశంలో అందరినీ ఒప్పించి ప్రజాస్వామికంగా ఉమ్మడి పౌరస్మృతి తీసుకురావాలే గానీ ఒకరి విశ్వాసాలు మరొకరిపై రుద్దడం సాధ్యం కాదు.

మిత్రుల ఇరకాటం

బిజెపి అనుకున్నట్టే ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీలేవీ మోడీ ప్రసంగంపై ప్రతికూలంగా స్పందించలేదు. టిడిపి మైనార్టీ నాయకులొకరు దీనిపై స్పందిస్తూ యుసిసిలో ఏ అంశాలపై ప్రభావం ఎలా వుంటుందో తెలుసుకోగోరుతున్నామని చెప్పారు. అంతకు ముందు వక్ఫ్ చట్టంపైనా ఇలాగే కొన్ని అభ్యంతరాలు చెబుతూనే మార్పులను స్వాగతిస్తామని వ్యాఖ్యానించారు. తమ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల వల్లనే కేంద్రం వక్ఫ్ చట్ట సవరణల బిల్లును సంయుక్త పార్లమెంటరీ సంఘానికి నివేదించిందని కూడా ఆయన చెప్పారు. ఇక్కడ టిడిపి ఇరకాటం స్పష్టమే. ఇక జెడియు విషయానికి వస్తే సీనియర్ నాయకుడు కె.సి.త్యాగి మాట్లాడుతూ ఏకరూప పౌర స్మృతిపై తమ వైఖరిని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఎప్పుడో ప్రకటించారని దాటేశారు. క్లిష్టమైన ఇలాంటి విషయాల్లో రాష్ట్రాలను సంప్రదించి ముందుకు పోవాలని నితీష్ లేఖ రాశారని గుర్తుచేశారు. అంతేగాని ఏకపక్ష వైఖరిని వ్యతిరేకిస్తున్నట్టు గట్టిగా చెప్పలేకపోయారు. దీనిపై విదేశీ పత్రికలు కూడా స్పందిస్తుంటే భాగస్వామ్య పార్టీలు, బడా మీడియా మౌనం దాల్చడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రధాని మోడీ ప్రసంగంలో సమ్మిళిత అనే పదం వాడారు గానీ అది మతం విషయాలలో కాదని ఒక పత్రిక విశ్లేషించింది. భౌగోళిక ప్రాంతాల తేడాలు, లింగభేదం వంటి విషయాల్లోనే ఆయన అందరినీ కలుపుకోవాలనే పదాలు వాడారు. అదే మతం విషయానికి వస్తే మెజార్టీ మత భాషనే ఉపయోగించారు. మతం, దేవుడు వంటి ప్రస్తావనలకు వచ్చే సరికి కనిపించింది అదే. మన దేశంలో ప్రతి రాతిలో శివుణ్ని చూస్తామనీ, ప్రతి నదినీ తల్లిగా భావించడం గర్వ కారణమంటూ కీర్తించారు. మహిళలను శక్తిస్వరూపిణిగా పరిగణిస్తారనడంలోనూ మత భావనే వినిపించారు. ఎందుకంటే ఇతర మతాల వారికి ఇది వర్తించదనీ, వారి విశ్వాసాలు, ఆచారాలు వేరుగా వుంటాయని మోడీకి తెలుసు. ఇంకా చెప్పాలంటే బంగ్లాదేశ్ పరిణామాలను కూడా హిందువులపై దాడులు అన్న కోణంలోనే ఆయన ప్రస్తావించడం యాదృచ్ఛికం కాదు.

కాశ్మీర్ పాఠాలేంటి?

మోడీ మొన్నటి ఎన్నికల ఫలితాల ప్రభావాలనూ పాఠాలనూ నేర్చుకోదలచలేదని ఈ ప్రసంగం స్పష్టం చేసింది. ఎందుకంటే బిజెపి కీలక ఎజెండాలోని ముఖ్యాంశాలు మూడింటిలో రెండు నెరవేరినట్టు చెప్పడమే అతిశయోక్తి. అయోధ్య సమస్యపై రాజకీయం చేయడం ద్వారా ఆ పార్టీ లాభపడిన మాట నిజం. ఏకంగా మూడోసారి కేంద్రంలో అధికారం రావడానికి మత రాజకీయం బాగా దోహదం చేసింది. అయితే ఆ అయోధ్యలోనే బిజెపి అభ్యర్థి మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ మందిరం కట్టిన యు.పి లోనూ బిజెపి వెనకబడింది. చడీ చప్పుడు లేకుండా కాశ్మీర్ 370వ అధికరణాన్ని రద్దు చేయడం కూడా నిజమే. కాని అక్కడ ఇంతవరకూ సాధారణ పరిస్థితి నెలకొల్పలేకపోయింది. ఆ రద్దుకు ముందు, తర్వాత పదేళ్లపాటు ఎన్నికలు కూడా వాయిదా వేయవలసి వచ్చింది. జరిగిన మేరకు ఏకధాటిగా విజయాలు సాధించిందీ లేదు. ఎన్నికలు జరపకపోవడానికి అదీ ఒక కారణం. ప్రధాని ప్రసంగించిన ఆగష్టు 15 తర్వాత రోజున ఎన్నికల సంఘం తేదీలు ప్రకటించింది. సెప్టెంబరు 30 లోగా అక్కడ ఎన్నికలు జరిపి శాసనసభను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించి వుండకపోతే ఇవైనా జరిగేవా అన్నది సందేహమే. ఇప్పుడు కూడా అక్టోబర్ 1 వరకూ జరపాల్సి వస్తుందన్నారు. కారణం భద్రతా దళాల కొరత! 370 రద్దు తర్వాత పరిస్థితి ఎంత లక్షణంగా వుందో దీన్ని బట్టే తెలుస్తుంది. ఈ ఎన్నికలకు ముందే జమ్మూలో తీవ్రవాదం విజృంభించిందనే ప్రచారాలూ అణచివేతలూ చూస్తున్నాం. ఇవన్నీ ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రభావం చూపేది తెలియదు. సాధ్యమైనంత త్వరలో కాశ్మీర్ రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరిస్తామనే పూచీలు ఏమైందీ తెలియదు. బిజెపి, కేంద్రం ప్రత్యేకించి మోడీ మాటలకూ వాస్తవాలకూ ఎంత తేడానో ఇక్కడే తెలిసిపోతుంది.

ఏక కాల ఎన్నికల మోజు

బిజెపి ప్రచారంలో కీలకమైన మరో అంశాన్ని అర్థం చేసుకోవడానికి కూడా ఈ సందర్భం సరిపోతుంది. మోడీకి చాలా ఇష్టమైన మంత్ర జపం ఒకే దేశం ఒకే ఎన్నికలు ఈ ప్రసంగంలోనూ వినిపించారు. అసలు ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే కార్డు, ఒకే పార్టీ, ఒకే మతం, ఒకే మోడీ అన్నది ఆయనకు ఇష్టమైన ప్రచారం. ఒకే దేశం ఒకే ఎన్నిక సాధించడానికి కృషి చేయాలని మొన్నటి ప్రసంగంలోనూ నొక్కి వక్కాణించారు. అయితే ఆ మరుసటి రోజునే వచ్చిన ఎన్నికల తేదీల ప్రకటన సంకేతాలేంటి? మూడు రాష్ట్రాలలో ఎన్నికలు జరగాల్సి వుండగా వాటిలో ఒకటైన మహారాష్ట్రలో జరపలేక పోతున్నట్టు సిఇసి రాజీవ్ కుమార్ తేల్చి చెప్పారు. ఇందుకు అనేక కారణాలు చూపించినా ప్రధానమైంది మాత్రం భద్రతా దళాలు కాశ్మీర్‌లో వుండాల్సి రావడంతో ఏర్పడిన కొరత. కేవలం మూడు రాష్ట్రాల్లో ఎన్నికలు జరపడమే ఇంత కష్టమైతే 28 రాష్ట్రాల్లో ఒకేసారి జరపాలనడం ఎంత హాస్యాస్పదం? పైగా రాజ్యాంగ నిబంధనల ప్రకారం కూడా శాసనసభల ఏర్పాటు, పార్లమెంట్‌లో లోక్‌సభ ఏర్పాటు వేర్వేరు విషయాలు. భారత దేశం రాష్ట్రాల సమాఖ్య అని చెబుతున్న రెండవ అధికరణం ఏ శాసనసభకు దానిగా కాలపరిమితిని బట్టి ఎన్నికలు జరపాలంటుంది. ఒకే ఎన్నిక కోణమే లేదు. పైగా మిశ్రమ ప్రభుత్వాల యుగంలో ఏ కారణంతో ఏ సర్కారు కూలిపోయి సభ రద్దయినా...మిగిలిన చోట్ల అకారణంగా సభల పదవీ కాలం వున్నా ఎన్నికలు జరపడమనే ఆలోచనే అర్థరహితం. విడివిడిగా రాష్ట్రాలలో గానీ లేక ఏకంగా కేంద్రంలో గానీ సర్కార్లు పడిపోయి ఎన్నికలు జరపాల్సి రావచ్చు. మిగిలిన పదవీ కాలానికి వాటిని కృత్రిమంగా కొనసాగించడం అకారణ సమస్యలను అనైతిక పెత్తనాన్ని ఆహ్వానించడమే అవుతుంది. అలాంటి అవకాశమే కల్పించితే నీతిమాలిన నేతలు కావాలని అనేక మాయోపాయాలకు పాల్పడతారు కూడా. నిజానికి ఏకీకృత పెత్తనం కోరుకునే బిజెపి, ఆరెస్సెస్ రాజకీయాల కోసం తప్ప ఈ విధానానికి హేతుబద్ధతే లేదు. దేశాన్ని వంద రాష్ట్రాలుగా విభజించి కేంద్రానికే కీలకాధిపత్యం అప్పగించాలనేది వారి మనోగతం. ఒకేసారి ఎన్నిక జరిగితే ఘనత వహించిన మోడీ వంటి నేతను చూసి ప్రజలు రాష్ట్రాల నేతలను గాక ఆయనను చూసి అన్ని చోట్లా గెలిపిస్తారని అత్యాశ. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో టికానా లేని బిజెపి నిరంతరం ఒకే ఎన్నిక పాట పాడుతూనే వుంటుంది. ఒకేసారి ఎన్నికల కోసం ఎన్నుకున్న పదవీకాలం పూర్తి కాకుండా ఏ సభను రద్దు చేసినా సుప్రీంకోర్టులో సవాలు చేయొచ్చు కూడా.

సింహస్వప్నం ఎవరికి?

తమ పాలనలో అభివృద్ధి తదితర గొప్పలు షరా మామూలుగా మోడీ పలికారుగానీ గానీ దేశ ఆర్థిక దుస్థితి, రైతాంగ పరిస్థితి, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటివి కనిపిస్తూనే వున్నాయి. అవినీతిపై సింహస్వప్నంలా వ్యవహరిస్తామని హెచ్చరించేవారు అదానీ కంపెనీలతో సెబీ చైర్మన్ మాధబి బుచ్ దంపతుల కుమ్మక్కుపై ఏ చర్యా తీసుకోక పోవడమూ చూస్తున్నాం. మరోవైపున కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రాసిక్యూషన్‌కు అనుమతినివ్వడం బట్టి చూస్తే మోడీ బెదిరింపు ప్రతిపక్షాలకేనని స్పష్టమ వుతుంది. గత పదేళ్లుగా ఆయన వాగాడంబరాన్ని, పాలన తీరును చూసిన ప్రజలు ఇప్పటికే కొంత పాఠం నేర్చారు గనక రాబోయే రోజుల్లో మరింత కచ్చితమైన తీర్పులతో దేశాన్ని గాడిలో పెడతారని ఆశించాలి. అవసరార్థం ఆయనతో జట్టు కట్టిన లౌకిక పార్టీలూ ఆలోచించుకోవాలి. •

> ప్రధాని ప్రసంగించిన ఆగష్టు 15 తర్వాత రోజున ఎన్నికల సంఘం తేదీలు ప్రకటించింది. సెప్టెంబరు 30 లోగా అక్కడ ఎన్నికలు జరిపి శాసనసభను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించి వుండకపోతే ఇవైనా జరిగేవా అన్నది సందేహమే. ఇప్పుడు కూడా అక్టోబర్ 1 వరకూ జరపాల్సి వస్తుందన్నారు. కారణం భద్రతా దళాల కొరత! 370 రద్దు తర్వాత పరిస్థితి ఎంత లక్షణంగా వుందో దీన్ని బట్టే తెలుస్తుంది. ఈ ఎన్నికలకు ముందే జమ్మూలో తీవ్రవాదం విజృంభించిందనే ప్రచారాలూ అణచివేతలూ చూస్తున్నాం. ఇవన్నీ ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రభావం చూపేది తెలియదు. సాధ్యమైనంత త్వరలో కాశ్మీర్ రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరిస్తామనే పూచీలు ఏమైందీ తెలియదు. బిజెపి, కేంద్రం ప్రత్యేకించి మోడీ మాటలకూ వాస్తవాలకూ ఎంత తేడానో ఇక్కడే తెలిసిపోతుంది.

సెబీ చీఫ్ లాలూచీ బహిర్గతం

వ్యాఖ్య

> బిజెపి, మోడీ ప్రభుత్వం సెబీ చీఫ్‌పై వచ్చిన ఈ ఆరోపణలను వెనక్కు కొట్టడానికి ప్రయత్నిస్తున్నాయి. భారతదేశ స్టాక్ మార్కెట్‌ను ఆర్థిక వ్యవస్థను అస్థిరపరచడానికి కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రతిపక్షాలు విదేశీ సంస్థలతో కుమ్మక్కు అవుతున్నాయని ఆరోపిస్తున్నాయి. సెబీ చీఫ్‌కు వత్తాసుగా ఇలాంటి దారుణమైన వినాశకరమైన సమర్థనకు దిగడం చిన్నశ్రేణి మదుపరులలో గానీ, ప్రజలలోకానీ విశ్వాసం పాదుకొల్పడం సాధ్యం కాదు. ఒక నయా ఉదారవాద వ్యవస్థలో నియంత్రణ సంస్థలను బడా కంపెనీలు ఏ విధంగా గుప్పిట పెట్టుకోగలవో బుచ్ ఉదంతం బహిర్గతం చేస్తోంది. కనుక ఈ సరికొత్త సాక్ష్యాల నేపథ్యంలో సుప్రీంకోర్టు...అదానీ గ్రూపు సాగించిన దారుణమైన నియమోల్లంఘనలనూ స్టాక్ మార్కెట్ మాయాజాలాలనూ కూడా కోర్టు ఆధ్వర్యంలో దర్యాప్తు చేయించడం మరింత శ్రేయస్కరం అవుతుంది.

అమెరికాకు చెందిన పరిశోధన సంస్థ హిండెన్‌బర్గ్ విడుదల చేసిన తాజా నివేదిక సెబీ ప్రధాన అధికారి మాధబి పురి బుచ్ పాత్ర గురించి తీవ్రమైన ప్రశ్నలు ముందుకు తెచ్చింది. అదానీ గ్రూపు వివిధ నిబంధనల ఉల్లంఘనలకు, షేర్ల రేట్ల విషయంలో మాయాజాలానికి పాల్పడిందనే ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ఆ నియంత్రణ సంస్థకి ఆమె బాధ్యత వహిస్తున్నారు.

హిండెన్‌బర్గ్ నివేదిక ప్రకారం సెబీ చైర్‌పర్సన్ బుచ్ 2015లో 'గ్లోబల్ డైనమిక్ ఆపర్చునిటీ ఫండ్' అన్న దాంట్లో పెట్టుబడులు పెట్టారు. సరిగ్గా ఆమె సెబీ పూర్తి కాలపు సభ్యురాలిగా బాధ్యత స్వీకరించడానికి ముందే 2017లో ఆమె వాటిని తన భర్త ఖాతాకు బదలాయించారు. ఆ నిధులను నిర్వహించేది ఆమె భర్త అయినా 2018లో బుచ్ స్వయంగా ఇచ్చిన మెయిల్‌తో వాటి నుంచి బయటపడ్డారు. పెట్టుబడులు మళ్లీ ప్రారంభమయ్యాయి.

విదేశాల్లోని ఈ సంస్థలో బుచ్ పెట్టుబడులు పెట్టినట్టు ఒక సమాచార వేగు ఇచ్చిన ప్రకటన ఆధారంగా హిండెన్‌బర్గ్ నిర్ధారించింది. గౌతమ్ అదానీ సోదరుడైన వినోద్ అదానీ నిర్వహిస్తున్న 'బెర్ముడా మారిషస్ ఫండ్'లో అది భాగంగా ఉంది. అప్పటికే గౌతమ్ అదానీపై సెబీ దర్యాప్తు సాగుతున్నా పెట్టుబడులు పెట్టారు.

తొలి నివేదిక సంచలనం-సుప్రీం కోర్టు

హిండెన్‌బర్గ్ 2023 జనవరిలో విడుదల చేసిన నివేదిక సంచలనం కలిగించిన సంగతి గుర్తు చేసుకోవాలి. అదానీ గ్రూప్ చాలా బాహాటంగా దశాబ్దాల తరబడి స్టాక్ మార్కెట్ మాయాజాలానికి పాల్పడిందని, లెక్కలు తారుమారు చేసిందని ఆ నివేదిక ఆరోపించింది. ఫోరెన్సిక్ విశ్లేషణ తర్వాత అదానీ గ్రూప్ అనేక విదేశీ సంస్థల పేరుతో తన స్వంత నిధులనే అటూ ఇటూ తిప్పి తమ కంపెనీలలో పెట్టుబడి పెట్టిందీ కళ్లకు కట్టినట్లు వివరాలు నమోదు చేసింది. అదానీ గ్రూపు చట్ట ఉల్లంఘనల పట్ల తగు విధంగా వ్యవహరించడంలో సెబీ వైఫల్యం ఉందేమో దర్యాప్తు చేయడానికి 2023 మార్చిలో సుప్రీంకోర్టు ఆరుగురు సభ్యులతో నిపుణుల బృందాన్ని నియమించింది. అంతేకాక ప్రభుత్వ రంగ సంస్థల తరపున వున్న వాటాలకు సంబంధించిన వ్యవహారాలలో ఏమైనా ఉల్లంఘనలు జరిగాయేమో నిర్దిష్టంగా విచారించాలని ఆదేశించింది. అదానీ కంపెనీలకు సంబంధిత పక్షాలు నడిపిన లావాదేవీల సమాచారం వెల్లడించడంలో వైఫల్యాలు, షేర్ల రేట్లలో కుంభకోణాలు ఏమైనా ఉన్నాయేమో చూడాలని ఆదేశించింది.

ఈ ఉల్లంఘనల పైన, అదానీ కంపెనీకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం పైన జరిపిన సెబీ దర్యాప్తులో ఏ తప్పూ కనుగొనలేకపోయిందని 2023 మే లో కోర్టుకు నిపుణుల కమిటీ తెలియజేసింది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమంటే అదానీ గ్రూపునకు సంబంధించిన వివిధ ఉల్లంఘనల ఆరోపణలపై సెబీ అంతకన్నా ముందే దర్యాప్తు జరుపుతున్నది. ఈ విషయంలో ఎలాంటి తీవ్ర ఉల్లంఘనలు ఉన్నట్లు నిరూపించడంలో విఫలం కావడం బట్టి చూస్తే సెబీ వైఫల్యం అనుమానాస్పదమని, ప్రశ్నార్థకమని హిండెన్‌బర్గ్ తాజా నివేదిక స్పష్టం చేస్తోంది. బుచ్ స్వయానా వినోద్ అదానీకి సంబంధించిన విదేశీ సంస్థలో పెట్టుబడులు పెట్టడమే ఇందుకు కారణం అవుతుంది.

ఎప్పుడూ చెప్పలేదే?

హిండెన్‌బర్గ్ నివేదిక లోని ఆరోపణలను అసంబద్ధమైనవని వ్యక్తిగత శీలహననమేనని చైర్‌పర్సన్ బుచ్, అలాగే సెబీ ఖండించాయి. ఈ ఫండును నెలకొల్పిన అనిల్ అహూజా తన భర్తకు బాల్యమిత్రుడు కావడం వల్లనే పెట్టుబడులు పెట్టామని బుచ్ ఒక ప్రకటనలో చెబుతున్నారు. ఆ పెట్టుబడులు పెట్టిన విషయం తమకు సరైన సమయంలోనే తెలియచేశారని, అలాగే అవసరమైనప్పుడు ఆమె ఆ వ్యవహారాలకు దూరంగా ఉన్నారని సెబి అంటున్నది. అయితే ఆమె అదానీకి సంబంధించిన దర్యాప్తులలో దూరంగా ఉన్నారని చెప్పగల నిర్దిష్టమైన సమాధానం లేదు. బుచ్ విదేశీ నిధులకు సంబంధించి తన భాగస్వామ్యాన్ని సుప్రీంకోర్టుకు గాని ఆరుగురు నిపుణుల బృందానికి కానీ 2023 మార్చిలో కోర్టు నియమించిన బృందానికి గాని ఆమె తెలియజేసినట్లు సమాచారం లేదు. అదానీ గ్రూపుపై వచ్చిన 22 ఆరోపణలలో 20 విషయాలను దర్యాప్తు ముగించినట్లు మాత్రమే సెబీ సుప్రీంకోర్టుకు తెలిపింది. మిగిలిన వాటి దర్యాప్తును మరో రెండు మూడు నెలల్లో ముగించనున్నట్టు తెలియజేసింది. మరో సమస్యపై కూడా దర్యాప్తు ముగించినట్టు ఇక ఒకటి మాత్రమే మిగిలినట్టు సెబీ 2024 జనవరిలో కోర్టుకు తెలియజేసింది. అదానీ గ్రూపు కంపెనీలకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు దొరికినట్టు చెప్పనేలేదు. చైర్‌పర్సన్‌గా బుచ్ ఆ కంపెనీలపై దర్యాప్తు జరుగుతున్న సమయంలోనే రెండుసార్లు అదానీతో సమావేశమైన విషయాన్ని కూడా వెల్లడించలేదు. దీన్నిబట్టి చూస్తే ఆమెపై వచ్చిన తీవ్ర ఆరోపణలకు ప్రాధాన్యత లభిస్తున్నది. సెబీ చీఫ్ వ్యక్తిగత అంత:కరణ, అలాగే ఒక స్వతంత్ర నియంత్రణ సంస్థ అధిపతి నుంచి ఆశించే ఉన్నత స్థాయి ప్రమాణాలకు సంబంధించిన సమస్య ఇది. ఈ రెండు కోణాలరీత్యా మాధబి బుచ్ తన స్థానం నుంచి తక్షణం తప్పుకోవాల్సి ఉంటుంది.

కేంద్ర సమర్థన-వాస్తవాల నిర్ధారణ

బిజెపి, మోడీ ప్రభుత్వం సెబీ చీఫ్‌పై వచ్చిన ఈ ఆరోపణలను వెనక్కు కొట్టడానికి ప్రయత్నిస్తున్నాయి. భారతదేశ స్టాక్ మార్కెట్‌ను ఆర్థిక వ్యవస్థను అస్థిరపరచడానికి కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రతిపక్షాలు విదేశీ సంస్థలతో కుమ్మక్కు అవుతున్నాయని ఆరోపిస్తున్నాయి.

సెబీ చీఫ్‌కు వత్తాసుగా ఇలాంటి దారుణమైన వినాశకరమైన సమర్థనకు దిగడం చిన్నశ్రేణి మదుపరులలో గానీ, ప్రజలలోకానీ విశ్వాసం పాదుకొల్పడం సాధ్యం కాదు. ఒక నయా ఉదారవాద వ్యవస్థలో నియంత్రణ సంస్థలను బడా కంపెనీలు ఏ విధంగా గుప్పిట పెట్టుకోగలవో బుచ్ ఉదంతం బహిర్గతం చేస్తోంది.

కనుక ఈ సరికొత్త సాక్ష్యాల నేపథ్యంలో సుప్రీంకోర్టు...అదానీ గ్రూపు సాగించిన దారుణమైన నియమోల్లంఘనలనూ స్టాక్ మార్కెట్ మాయాజాలాలనూ కూడా కోర్టు ఆధ్వర్యంలో దర్యాప్తు చేయించడం మరింత శ్రేయస్కరం అవుతుంది. లేదంటే ఈ మొత్తం వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ దర్యాప్తు జరపటం ఏకైక మార్గంగా వుంటుంది.

/ ఆగస్టు 14 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం /

జనవాక్యం

పని సర్దుబాటా...?

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ నిలిపి వేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులను సర్దుబాటు ప్రక్రియలో భాగంగా బలవంతంగా బదిలీలకు రంగం సిద్ధం చేస్తోంది. దీని వల్ల విద్యా బోధనకు ఆటంకం కలగడమేగా, విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమయ్యే పరిస్థితులు నెలకొనేలా ఉన్నాయి. ప్రభుత్వం విద్యా రంగాన్ని మరింత బలహీన పరచడానికి సర్దుబాటు ప్రక్రియను తెర పైకి తీసుకొని రావడం విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తోంది. కావున సర్దుబాటు ప్రక్రియను నిలుపుదల చేసి పదోన్నతులు, బదిలీలు జరపడానికి మార్గదర్శకాలు జారీ చేయాలి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం 117 రద్దు చేసి 3,4,5 తరగతులను తిరిగి వెనక్కి పంపాలి. ఇంగ్లీషు మీడియం దృష్ట్యా విద్యార్థుల నాణ్యమైన విద్య కోసం ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు టీచర్లను నియమించాలి. ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు నిర్వహించాలి. ఉపాధ్యాయులకు బదిలీలు జరపాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా.

కార్ల అమ్మకాల్లో పతనం

● రెండేళ్లలో తొలిసారి క్షీణత ● రుణదాతల్లో గుబులు ● డిస్కౌంట్లపై కంపెనీల దృష్టి

న్యూఢిల్లీ : ఆర్థిక వ్యవస్థ పనితీరుకు ప్రధాన గీటురాయిగా భావించే వాహన అమ్మకాలు క్షీణించాయి. గడిచిన రెండేళ్లలో ఎప్పుడూ లేని విధంగా తొలిసారి 2024 జులైలో ప్యాసింజర్ వాహన అమ్మకాలు తగ్గాయి. వాహన పరిశ్రమ బాడీ సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరర్స్ (సియోమ్) గణంకాల ప్రకారం.. గత జులై మాసంలో మొత్తంగా 341,510 కార్లు, యుటిలిటీ వాహనాలు, వ్యాన్‌లు అమ్ముడయ్యాయి 2023 అదే మాసంలో 3,50,355 యూనిట్ల విక్రయాలు జరిగాయి. దీంతో పోల్చితే గడిచిన నెల అమ్మకాల్లో 2.5 శాతం పతనం చోటు చేసుకుంది. 2022 ఫిబ్రవరిలో చివరి సారిగా ప్యాసింజర్ వాహన అమ్మకాలు పడిపోయాయి. ఆ సమయంలో 1.8 శాతం తగ్గి 3,02,965 యూనిట్లుగా నమోదయ్యాయి. ఫ్యాక్టరీ నుంచి డీలర్‌షిప్‌లకు చేరిన వాహనాలను సియోమ్ పరిగణలోకి తీసుకుని ఈ గణంకాలను విడుదల చేస్తుంది. గత నెలలో చిన్న కార్లు, సెడాన్లు, హ్యాచ్‌బ్యాక్‌ల అమ్మకాలు క్షీణించాయి. మరోవైపు స్పోర్ట్-యుటిలిటీ వాహనాలు (ఎస్‌యువి), ఎర్టిగా, ఇన్నోవా వంటి మల్టీపర్పస్ వాహనాలు ఒక అంకె స్థాయిలో పెరిగాయి. సియోమ్ అంచనా ప్రకారం.. ప్రస్తుతం డీలర్ల వద్ద 405,000 - 410,000 మధ్య వాహనాల నిల్వలు పేరుకుపోయాయి. గడిచిన నెలలో ప్రముఖ కార్ల తయారీ సంస్థలు మారుతీ సుజుకీ, హ్యుందాయ్ మోటార్ ఇండియా, టాటా మోటార్స్ అమ్మకాలు తగ్గాయి. మారుతి సుజుకి విక్రయాలు 9.6 శాతం, హ్యుందాయ్ మోటార్ ఇండియా 3.3 శాతం, టాటా మోటార్స్ 6 శాతం చొప్పున అమ్మకాల్లో తగ్గుదలను చవి చూశాయి. మరోవైపు మోటారు సైకిళ్లు, స్కూటర్ల అమ్మకాలు 12.5 శాతం పెరిగాయి. తిచక్ర వాహనాల్లోనూ 5.1 శాతం వృద్ధి చోటు చేసుకుంది.

ప్యాసింజర్ వాహన అమ్మకాల్లో భారీగా తగ్గుదల చోటు చేసుకోవడం రుణదాతల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వాహనాలకు డిమాండ్ పడిపోవడంతో తమ ఫైనాన్స్ వ్యాపారాలపై ప్రభావం పడుతుందని భావిస్తున్నాయి. సాదారణంగా పండుగ సీజన్‌లో వాహనాలకు డిమాండ్ ఉంటుంది. కానీ ప్రస్తుతం డిమాండ్ లేమితో డీలర్లు, కంపెనీల వద్ద నిల్వలు పెరుకుపోతున్నాయి. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది జూన్‌లో వాహన రుణాల వృద్ధిలో 15 శాతం పతనం చోటు చేసుకుంది. లగ్జరీ వాహనాలకు, ద్విచక్ర వాహనాలకు డిమాండ్ ఉన్నప్పటికీ.. మధ్యస్త విభాగం నాలుగు చక్రాల వాహనాల్లో స్తబ్దత ఆటో, రుణ పరిశ్రమ వర్గాలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.మరోవైపు ఆర్‌బిఐ కీలక వడ్డీ రేట్లను పెంచి కూచోవడంతో రుణాలు భారం అయ్యాయి. వాహనాలపై కనీస వడ్డీ రేటు 8.75 శాతంగా ఉంది. రుణదాతలు కూడా తమ డీలర్ ఫైనాన్స్ పోర్ట్‌ఫోలియోలలో రీపేమెంట్ ఆలస్యాన్ని ఎదుర్కొంటున్నట్లు సమాచారం.

పారదర్శక అర్జీలకు సత్వర న్యాయం

● మంత్రి అనగాని, టిడిపి నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పారదర్శకంగా ఉన్న అర్జీలకు వెంటనే న్యాయం జరుగుతోందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో పాటు టిడిపి నేతలు అన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం శనివారం కూడా జరిగింది. మంత్రి అనగానితోపాటు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు, వర్ల రామయ్య, బాపట్ల ఎంపి కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా తమ వద్దకు వచ్చిన అర్జీలపై వెంటనే ఆయా శాఖల మంత్రులకు పంపుతున్నామని చెప్పారు. పశ్చిమబెంగాల్‌లో జరిగిన దుర్ఘటన రాష్ట్రంలో జరగకుండా మహిళలకు, మహిళా డాక్టర్ల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో మహిళలు అర్ధరాత్రి కూడా స్వేచ్ఛగా తిరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పలు సమస్యలపై ఫిర్యాదులు

తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామ పంచాయతీ టైమ్ స్కేల్ ఉద్యోగులు గ్రీవెన్స్‌లో కోరారు. మూడేళ్లపాటు వైసిపి ప్రభుత్వం తమకు జీతాలు ఇవ్వకుండా పనిచేయించుకుందని తెలిపారు. అంబులెన్స్ సేవకులుగా పనిచేస్తున్న తమ జీతభత్యాలలో స్లాబ్ సిస్టమ్ తీసివేయాలని కోరారు. వైసిపి నేతల అరాచకాలు, భూ కబ్జాలను అడ్డుకున్నందుకు మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి తమపై అక్రమ కేసులు పెట్టించి రౌడీషీట్ ఓపెన్ చేయించారని తిరుపతికి చెందిన జంపాల గోపి, ఇర్ల గౌతమ్.. నేతలకు ఫిర్యాదు చేశారు. 2018-19లో తాను చేసిన సిసి రోడ్ల వర్క్ బిల్లులు రూ.44.48 లక్షలు తనకు తెలియకుండా వైసిపి నేతలు అక్రమంగా కొట్టేశారని నూజివీడు మండలం సిద్ధార్థనగర్‌కు చెందిన యాదాల శ్రీనివాస్ తెలిపారు. డబ్బు కొట్టేసిన అధికారులు, వైసిపి నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా జిల్లా, గూడూరు మండలం, కలపటం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జొన్నల గడ్డ శ్రీనివాసరావు కూడా ఇదే అంశంపై ఫిర్యాదు చేశారు.

టిటిడి అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో అగ్నిప్రమాదం

● దర్యాప్తు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలన విభాగం కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆకస్మికంగా మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో టిటిడి పరిధిలోని 13 ఆలయాలకు సంబంధించిన ఫైల్స్ దగ్ధమైనట్లు ప్రాథమిక దర్యాప్తులో వెలుగు చూసింది. అగ్నిప్రమాదంపై టిటిడి పరిపాలన భవనం ఉద్యోగి నాగార్జున పైఅధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకునేలోపే మంటలు అదుపులోకి వచ్చాయని పోలీసులు తెలిపారు. టిటిడి పరిపాలన విభాగం కార్యాలయం అసిస్టెంట్ ఇంజనీర్ భాస్కర్ ఫిర్యాదు మేరకు తిరుపతిలోని అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయా?, కుట్ర కోణం ఏదైనా ఉందా? తదితర కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

ఢిల్లీ కోచింగ్ సెంటర్ కేసులో బెయిల్‌పై తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ : ఢిల్లీలో కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లో వరద ఉధృతి కారణంగా ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన కేసులో నిందితుల బెయిల్ పిటీషన్‌పై తీర్పును స్థానిక ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు రిజర్వ్ చేసింది. ఈ తీర్పును ఈ నెల 23న వెల్లడించే అవకాశం ఉంది. ఢిల్లీలో కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లో వరద సంభవించి ముగ్గురు విద్యార్థులు మరణించిన సిబిఐ విచారణ చేస్తోంది. ఈ కేసులో నిందితులు, కోచింగ్ సెంటర్ సహా యజమానులు పర్వీందర్ సింగ్, తాజిందర్ సింగ్, హర్వీందర్ సింగ్, సర్బ్‌జిత్ సింగ్ బెయిల్ కోసం పిటీషన్ దాఖలు చేశారు. ఇరువైపుల వాదనలు విన్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి అంజు బజాజ్ చందనా శనివారం తీర్పును రిజర్వ్ చేశారు.

HDB FINANCIAL SERVICES
హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్
బ్రాంచ్ ఆఫీస్: 78-8-10/1, ... విజయవాడ-520012.
స్వాధీన ప్రకటన
[illegible]
తేదీ : 18-08-2024 సం/- అధీకృత అధికారి, హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్.

IDBI BANK
IDBI Bank Limited,
BSR Plaza, Near Maris Stella College,Ring Road, Vijayawada-520008,AP
[illegible]

HDB FINANCIAL SERVICES
హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్
స్వాధీన ప్రకటన
[illegible]
తేదీ : 18-08-2024 సం/- అధీకృత అధికారి, హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్.

Can Fin Homes Ltd
కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్
బ్రాంచ్ కార్యాలయం: 40-5-9/17, ... విజయవాడ - 520010. ఫోన్: 0866-2474761 / 2481731.
Email: vijaywada@canfinhomes.com. CIN:L85110KA1987PLC008699
స్వాధీనత ప్రకటన
(for immovable property) [(Rule 8(1)]
[illegible]
తేదీ : 17-08-2024
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి, కెన్ ఫిన్ హోమ్స్ లి.,

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
... బ్రాంచ్-1 (కోడ్-05172), ... హైదరాబాద్ - 500095. తెలంగాణ రాష్ట్రం. ఇ-మెయిల్ : sbi.05172@sbi.co.in
చర/ స్థిరాస్తుల కొరకు అమ్మకం ప్రకటన
[illegible]
Reception Unit (Quantity-10), 2) Milk Storage Unit (Quantity-5), 3) Processing Unit (Quantity-7), 4) Ghee Plant & Bi Products Unit (Quantity-9), 5) Milk Packing Unit (Quantity-5), 6) Steam Supply Plant (Quantity-1), 7) Refrigeration & Cold Room Section (Quantity-16) and 8) Other Assets- a) Sub- station Equipment, b) D.G. Set 125 KVA, c) Laboratory Equipment, b) Pasto-Flash, c) Cans(plastic) & Sachet Crates, d) Crate Transporters, e) Electronic Weigh Scale, f) Office Furniture, g) Computers (2 Nos), Printers (2 Nos), h) Data Coding & Rewinding machine, i) RO & Softner Plant & j) Air Compressor.
రిజర్వు ధర: రూ.1,10,00,000/- , ధరావత్తు: రూ.11,00,000/-, బిడ్ పెంపుదల: రూ.50,000/-
(2) ఆస్తి ఐడి : SBIN400020984553: [illegible]
రిజర్వు ధర: రూ.94,00,000/- , ధరావత్తు: రూ.9,40,000/-, బిడ్ పెంపుదల: రూ.50,000/-
(3) ఆస్తి ఐడి : SBIN400018719195: [illegible]
రిజర్వు ధర: రూ.1,74,00,000/- , ధరావత్తు: రూ.17,40,000/-, బిడ్ పెంపుదల: రూ.50,000/-
[illegible] https://www.ebkray.in [illegible]
SBI, SARB-1, [illegible]

HDB FINANCIAL SERVICES
హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్
ఇ-వేలం అమ్మకం ప్రకటన
[illegible]

రిజర్వు ధర	ధరావత్తు	బిడ్ పెంపుదల మొత్తం	వేలం తేదీ సమయం	ధరావత్తు చివరి తేదీ & సమయం
Rs.65,12,850/-	Rs.6,51,285/-	Rs.1,00,000/-	05-09-2024 at 11 AM to 12 Noon	04-09-2024 up to 06.00 p.m

[illegible] www.vehicleduniya.com [illegible]
ప్రదేశం: విజయవాడ, తేదీ: 18-08-2024 సం/- అధీకృత అధికారి, హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్.

HDB FINANCIAL SERVICES
హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్
ఇ వేలం అమ్మకం ప్రకటన
[illegible]

రిజర్వు ధర	ధరావత్తు	బిడ్ పెంపుదల మొత్తం	వేలం తేదీ సమయం	ధరావత్తు చివరి తేదీ & సమయం
Rs.1,54,26,630/-	Rs.15,42,663/-	Rs.1,00,000/-	05-09-2024 at 11 AM to 12 Noon	04-09-2024 up to 06:00 p.m

[illegible] www.vehicleduniya.com [illegible] https://www.bankeauctions.com [illegible]
ప్రదేశం: విజయవాడ, తేదీ: 18-08-2024 సం/- అధీకృత అధికారి, హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్.

196 హెక్టార్లలో పంట నష్టం

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురం జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దాదాపు 196 హెక్టార్లలో పంట నష్టం జరిగి ఉంటుందని అంచనాలు వచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారిని ఉమామహేశ్వరమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక నివేదిక ప్రకారం మొక్కజొన్న-89 (హెక్టార్లలో), కంది, వేరుశెనగ-22, ఉద్దులు-15, పత్తి -14, వరి-12, సోయాబిన్-8, 4 హెక్టార్లలో పంట నష్టం జరిగిందన్నారు. ఫలితంగా సుమారు రూ.53లక్షల నష్టం అంచనా వేశామన్నారు.

దేశం గర్వించేలా వినూత్న పరిశోధనలు చేపట్టాలి

ఘనంగా ఎపి నిట్ 6వ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశం గర్వించేలా వినూత్న పరిశోధనలు, ఆవిష్కరణలు చేపట్టాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బోర్డ్ ఆఫ్ గవర్నెన్సు ఛైర్మన్, ఐఐటి అల్యూమిని కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ రవి శర్మ విద్యార్థులకు సూచించారు. నిట్ 6వ స్నాతకోత్సవాన్ని ప్రాంగణంలోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రవిశర్మ మాట్లాడుతూ డిగ్రీలు అందుకుంటున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఎన్ఐటి ఆంధ్ర ప్రదేశ్‌లో విద్యార్థులు సంపాదించిన జ్ఞానం, నైపుణ్యాలు వారు జీవితంలో ముందడుగు వేయడానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త సాంకేతికతలు ఆవిష్కృతం అవుతున్నాయని, వాటిలో మెలకువలు నేర్చుకుని పట్టు సాధించిన వారు అగ్రస్థానాల్లో నిలదొక్కుకుంటారన్నారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ బిఎస్.మూర్తి మాట్లాడుతూ పరిశోధన, అభివృద్ధికి పెద్దపీట వేసినప్పుడే విద్యార్థులైనా దేశాలైనా పురోగతిలో పయనిస్తాయని తెలిపారు. తమ విద్యార్థులు చదువుతోపాటు పలు క్రీడల్లో రాణించి పతకాలను అందుకోవడం, గేట్ పరీక్షల్లో మంచి ర్యాంకులతో సత్తాచాటడం అభినందనీయమని కొనియాడారు. ముందుగా 2020 -24గాను బిటెక్ నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సును పూర్తి చేసుకున్న 527 మంది విద్యార్థులకు, రెండేళ్ల ఎంటెక్ కోర్సు పూర్తి చేసిన 15 మంది విద్యార్థులకు డిగ్రీలు, 25 మంది పరిశోధనా విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేశారు. 8 కోర్సులకు గాను అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులకు, 2020- 24 బ్యాచ్‌లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించి ఇనిస్టిట్యూట్ టాపర్‌గా నిలిచిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన సలాడి వెంకట శశిభూషన్ (9.83)కు అదనంగా మరో బంగారు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్‌రెడ్డి, డీన్‌లు జిఆర్‌కె.శాస్త్రి, టి.కురుమయ్య, వీరేష్ కుమార్, ఎన్.జయరామ్, కార్తీక్ శేషాద్రి పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న రవిశర్మ

సంచార జాతుల అభివృద్ధికి కృషి చేయాలి

- ఎస్‌టి జాతీయ కమిషన్ సభ్యులు జాతోతు హుస్సేన్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

గిరిజనుల, సంచారజాతుల అభివృద్ధికి ప్రతి ఒక్క అధికారి కృషి చేయాలని నేషనల్ ఎస్.టి కమిషన్ మెంబర్ జాతోతు హుస్సేన్ పేర్కొన్నారు. శనివారం తిరుపతి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, తిరుపతి నగరపాలక కమిషనర్ మౌర్య, డి.ఆర్.ఓ పెంచల కిషోర్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సూర్యనారాయణలతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. గిరిజనుల అభ్యున్నతి కొరకు జిల్లాలో అమలు చేస్తున్న కార్యక్రమాలు, జిల్లాలో గిరిజనులు ఎదుకొంటున్న రెవెన్యూ, అట్రాసిటీ తదితర సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు సూచనలిచ్చారు. అంతకు మునుపు జిల్లా కలెక్టరేట్ కు చేరుకున్న జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులకు కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ సాదర స్వాగతం పలికారు. ఎస్‌సి, ఎస్‌టిలు ప్రతి ఒక్కరూ చదువుకునేలా గిరిజన ప్రాంతాల్లో క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు. గిరిజన, ఏకలవ్య హాస్టళ్ళలో విద్యార్థులకు రక్షిత తాగునీరు, పారిశుద్యం, పరిశుభ్రమైన ఆహారం మెనూ ప్రకారం అందించాలని అన్నారు. మరమ్మతులకు గురైన స్కూళ్ళను, హాస్టళ్ళను బాగుచేయించాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. జిల్లాలోని గిజనులకు సంబందించిన మఠం భూములకు రక్షణ కల్పించాలని అధికారులకు సూచించారు. తిరుపతిలో గిరిజన భవన్‌ను అధికారులు అన్ని సదుపాయాలతో, అన్ని హంగులతో తీర్చి దిద్ది గిరిజన సంఘాలకు అప్పగించాలన్నారు.

జాతీయ క్యారమ్స్ క్రీడాకారిణి లిఖితరెడ్డి మృతి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన జాతీయ క్యారమ్స్ క్రీడాకారిణి వి.లిఖిత రెడ్డి (24) శనివారం మృతి చెందారు. తెలంగాణ రాష్ట్ర జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం ధర్మవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందారు. ఆమె తల్లితండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులు. నంద్యాల జిల్లా తిమ్మాపురం లిఖితరెడ్డి ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి సుమారు 8 సార్లకుపైగా రాష్ట్ర జట్టుకు తరుపున అనేక పతకాలు సాధించారు. పదికిపైగా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి కర్నూలు వస్తుండగా కారు ప్రమాదంలో మృతి చెందారు. లిఖిత రెడ్డి మృతికి రాష్ట్ర క్యారమ్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నీరజ్ కుమార్ సంపతి, అబ్దుల్ జలీల్, కర్నూలు జిల్లా కార్యదర్శి చెన్నకేశవరాజు, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు జగదీష్ గౌడ్, శ్రీనివాసులు సంతాపం ప్రకటించారు.

దువ్వాడ వాణికి 41ఎ నోటీసు జారీ

ప్రజాశక్తి-టెక్కలి రూరల్ (శ్రీకాకుళం జిల్లా)

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ భార్య దువ్వాడ వాణికి టెక్కలి పోలీసులు శనివారం 41ఎ నోటీసును జారీ చేశారు. ఈ మేరకు శ్రీనివాస్ నివాసం ఆవరణలో నిరసన తెలుపుతున్న వాణికి నోటీసులు అందజేసేందుకు పోలీసులు వెళ్లారు. తానే స్వయంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నోటీసులు తీసుకుంటానని వాణి పోలీసులకు వివరించారు. ఎమ్మెల్సీ వివాదంలో వాణిపై కేసు నమోదైన విషయం పాఠకులకు విధితమే. ముగ్గురు ఎస్ఐలు, ఏఎస్ఐలు 20 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

భారత ప్రభుత్వం

రోడ్డు రవణా మరియు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ

బహిరంగ ప్రకటన

S.O. 3174 (E). – జాతీయ రహదారుల చట్టం, 1956 (48 ఆఫ్ 1956)లోని సెక్షను 3ఎ లోని సబ్-సెక్షన్(1) (ఇకమీదట సదరు చట్టంగా నిర్దేశించబడును) ద్వారా సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ కేంద్ర ప్రభుత్వం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలోని భూమి యొక్క విస్తీర్ణంలో నిర్వహణ, పర్యవేక్షణ మరియు నిర్మాణం కోసం (విస్తరించడం/ఆరు లేనింగ్ మొదలైనవి), నుండి కి.మీ.380.600 నుండి కి.మీ. 432.650 వరకు జాతీయ రహదారి నెం. 16 (చిలకలూరిపేట నుండి విజయవాడ సెక్షన్) వరకు భూమి ప్రజోపయోగార్థం కావలసివున్నదని సంతృప్తి చెందిన మీదట సదరు భూసేకరణకు తన ఉద్దేశాన్ని ఇందుమూలంగా ప్రకటిస్తోంది.

సదరు భూమిలో ప్రయోజనం గల ఏ వ్యక్తి అయినా అధికారిక గెజిట్లో ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి 21 రోజులలోగా సదరు చట్టంలోని సెక్షన్ 3సి లో సబ్-సెక్షన్ (1) క్రింద పైన తెలిపిన అవసరార్థం సదరు భూమి ఉపయోగానికి ఆక్షేపణ తెలియచేయవచ్చును.

అట్టి ప్రతి ఆక్షేపణ అధికృత అధికారికి అంటే సబ్ కలెక్టర్, తెనాలి, గుంటూరు జిల్లా వారికి వ్రాతపూర్వకముగా దానికి గల కారణాలతో తెలియచేయవలెను మరియు అధికృత అధికారి ఆక్షేపణదారుకు స్వయంగా గాని లేదా లీగల్ ప్రాక్టిషనర్ ద్వారా విచారించబడేందుకు అవకాశం కల్పిస్తారు మరియు అట్టి ఆక్షేపణలన్నీ విచారించిన తర్వాత అధికృత అధికారికి అవసరమని భావిస్తే తదుపరి విచారణ జరిపిన తర్వాత అక్షేపణలను అనుమతిస్తూ లేదా నిరాకరిస్తూ ఉత్తర్వు జారీచేస్తారు.

సదరు చట్టంలోని సెక్షన్ 3సి లోని సబ్-సెక్షన్ (2) క్రింద అధికృత అధికారిచే చేయబడే ఏ ఉత్తర్వు అయినా తుదిగా ఉంటుంది.

ఈ ప్రకటన క్రింద తెలియజేసిన భూమి ప్లాన్లు మరియు భూమి ఇతర వివరాలు అధికృత అధికారి యొక్క పైన తెలిపిన కార్యాలయంలో లభిస్తాయి, ప్రయోజనం గల వ్యక్తులు తనిఖీ చేసుకోవచ్చును.

షెడ్యూల్

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో గుంటూరు జిల్లాలోని (చిలకలూరిపేట నుండి విజయవాడ సెక్షన్) జాతీయ రహదారి నెం.16 పై కి.మీ. 380.600 నుండి కి.మీ. 432.650 వరకు వరకు ఉన్న భూమిలో నిర్మాణాలతో లేదా లేకుండా సేకరించాల్సిన భూమి యొక్క సంక్షిప్త వివరణ

జిల్లా : గుంటూరు
https://egazette.gov.in
Publication Date: 6th August, 2024
CG-DL-E-08082024-256174

[F. N. NHAI/15021/6-lane/BOT/2008/Tech/GM(CK-I)/3A]

అభయ్ జైన్, డిప్యూటి సెక్రటరీ

https://bhoomirashi.gov.in//showFile_qr.cshtml?TAB=bGFfVGhyZWVBX2ZpbGVz&fk=bm90aWZpY2F0aW9uX2lk&fkid=NjkyMjA=&EncHid=64322164&type_id=1

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate
విజయవాడ మెయిన్ బ్రాంచ్ (13340), విజయవాడ, ఆంధ్రప్రదేశ్. ✆ 0866-2567779, 9440905155
సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) (ఇక మీదట "చట్టం"గా రిఫర్‌చేయబడును) ...
తేదీ: 13/08/2024, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

HDB FINANCIAL SERVICES — హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్
ప్రీ - సేల్ నోటీసు
తేదీ : 18-08-2024, ప్రదేశం : తెనాలి — సం/- అధీకృత అధికారి, హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

యూనియన్ బ్యాంక్ Union Bank of India — ASSET RECOVERY BRANCH
#249/3RT, I floor, Main Road, S.R. Nagar, Hyderabad 500 038 (T.S.) Mail id: ubin0556009@unionbankofindia.bank
ప్రదేశం: హైదరాబాద్, తేదీ: 17.08.2024 — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

భౌతిక స్వాధీనత నోటీసు
ICICI Bank — శాఖ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10 మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హోసూర్ మెయిన్ రోడ్డు, బెంగళూరు-560068
ఏదైతే
దిగువసంతకందారు అయిన ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపల దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది. ...
1. | LBVJW00004384276/ LBVJW00006007122 | 14/08/2023 Rs. 40,81,146.00/- | విజయవాడ
తేదీ: 17 ఆగస్టు, 2024, ప్రదేశం: విజయవాడ — అధీకృత సెక్రటరీ, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్., తరపున

UNITY SMALL FINANCE BANK LIMITED — Corporate Office : Centrum House, Vidyanagari Marg, Kalina, Santacruz (E) Mumbai 400098
లాంఛనప్రాయ స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు) చూడండి రూల్ 8(1)
USFBVJWLOAN000005007833 — డిమాండ్ నోటీసు తేదీ: 21.05.2024, మొత్తం 18.05.2024 నాటికి రూ.21,13,638.44/-
తేదీ: 18-08-2024, ప్రదేశం: ఆంధ్రప్రదేశ్ + తెలంగాణ — సం/- (అధీకృత అధికారి) యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

కెనరా బ్యాంక్ Canara Bank — విజయవాడ మెయిన్ బ్రాంచ్ (13340), విజయవాడ, ఆంధ్రప్రదేశ్. ✆ 0866-2567779, 9440905155
సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
తేదీ: 13/08/2024, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

THE GANDHI CO-OPERATIVE URBAN BANK LTD.
Head Office: No.H.948, Museum Road, Governorpeta, Vijayawada, Andhra Pradesh-520002. Ph: 0866-2433379, 2436365
వేలం విక్రయ నోటీసు
సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (అమలు) రూల్స్, 2002లోని రూల్ 8(6)కి సంబంధించిన నిబంధనతో చదవగల సెక్యూరిటైజేషన్ మరియు ఫైనాన్షియల్ అసెట్స్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 ...
తేదీ: 18.08.2024, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, ది గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

భౌతిక స్వాధీనత నోటీసు
ICICI Bank — శాఖ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10 మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హోసూర్ మెయిన్ రోడ్డు, బెంగళూరు-560068
1. | 067905020904 / 067955000511 | 07-10-2022 Rs. 3,71,69,683.59/- | గుంటూరు
తేదీ: 17 ఆగస్టు, 2024, ప్రదేశం: గుంటూరు — అధీకృత సెక్రటరీ, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్., తరపున

ఐఎంఎ పిలుపు మేరకు శనివారం ఢిల్లీలో ఎయిమ్స్ వద్ద వైద్యుల ఆందోళన

లెఫ్ట్ పార్టీల పిలుపుతో కోల్‌కతాలో జరిగిన ఆందోళన, పాల్గొన్న సిపిఎం నేత ఎండి సలీమ్

స్తంభించిన వైద్య సేవలు

- కొల్‌కతా ఘటనపై దేశవ్యాప్త సమ్మె
- పలు నగరాల్లో భగ్గుమన్న నిరసనలు
- ప్రధాని జోక్యం చేసుకోవాలి : ఐఎంఎ అధ్యక్షుడు
- డాక్టర్ల భద్రత కోసం చర్యలు తీసుకుంటున్నామన్న ఆరోగ్య శాఖ
- చర్యల సూచనకు త్వరలో కమిటీ ఏర్పాటు

ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో భారీ నిరసన ప్రదర్శన

న్యూఢిల్లీ, కొల్‌కతా : కొల్‌కతాలోని ఆర్‌జి కార్ వైద్య కళాశాల ఆస్పత్రిలో తమ సహచరురాలిపై పైశాచికంగా లైంగికదాడికి పాల్పడి, హత్య చేసిన ఘటనను దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్య సిబ్బంది తీవ్రంగా నిరసించారు. తమ సహచరురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం 24 గంటల నిరసన చేపట్టారు. దీంతో దేశంలోని పలు ప్రాంతాలలో వైద్య సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నెల 9న పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడి, ఆమెను హత్య చేసిన ఘటన వైద్య సిబ్బందిలో పెద్ద ఎత్తున ఆగ్రహాన్ని కలిగించింది. ఈ అమానుషాన్ని నిరసిస్తూ శనివారం ఉదయం 6 గంటల నుంచి అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని సేవలనూ నిలిపివేయాలని, ప్రదర్శనలు నిర్వహించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) పిలుపునిచ్చింది. ఆదివారం ఉదయం 6 గంటల వరకూ ఈ నిరసన కార్యక్రమం కొనసాగుతుంది. ఐఎంఎ గురువారం ప్రభుత్వం ముందు ఐదు డిమాండ్లను ఉంచింది. ప్రధానంగా రెసిడెన్షియల్ వైద్యుల పని, జీవన పరిస్థితులను సమూలంగా మార్చేయాలని, పని ప్రదేశంలో వైద్య సిబ్బందిపై హింస జరగకుండా నివారించేందుకు కేంద్ర చట్టాన్ని తీసుకురావాలని కోరింది.

దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ నిరసన ప్రదర్శనలు, ధర్నాలు తదితర రూపాల్లో ఆందోళనలు నిర్వహించారు. ఎక్కడ పనిచేస్తున్నారు, ఏ విభాగంలో చేస్తున్నారనే దానితో సంబంధం లేకుండా శనివారం ఉదయం 6గంటల నుండి 24గంటల పాటు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి. మరోవైపు డాక్టర్ల భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలన్నీ తీసుకుంటామని ఆరోగ్య మంత్రిత్వ శాఖ హామీ ఇచ్చింది. జూనియర్ డాక్టర్లు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొనడంతో ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలో అడ్మిషన్లు 90శాతానికి పైగా తగ్గిపోయాయి. ఎయిమ్స్, ఆర్‌ఎంఎల్ సహా వివిధ ఆస్పత్రుల నుండి వచ్చిన రెసిడెంట్ వైద్యుల సంఘాలు నగరంలో ప్రదర్శనలు, కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించాయి. ఎయిమ్స్, రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్), జవహర్‌లాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సహా పలు ప్రముఖ ఆస్పత్రుల వైద్యులు దేశవ్యాప్తంగా సమ్మెలో భాగస్వాములయ్యారు. లక్నోలో సివిల్ ఆస్పత్రిలో ఓపిడినే నిర్వహించడం లేదు. ఉత్తర ప్రదేశ్‌లో ప్రైవేటు డాక్టర్లు కూడా తమ సేవలను స్తంభింపజేశారు. లక్నోకి చెందిన జూనియర్ డాక్టర్లు చేతులకు నల్ల బ్యాండ్‌లు కట్టుకుని కాలా రక్షాబంధన్ నిర్వహించారు. మహారాష్ట్రలో డాక్టర్ల సమ్మె ఐదవ రోజుకు చేరుకుంది. ప్రైవేట్ డాక్టర్లు కూడా సమ్మెలో పాల్గొన్నారు. నిరసన విరమించి విధులకు రావాల్సిందిగా మధ్యప్రదేశ్ హైకోర్టు శనివారం డాక్టర్లను ఆదేశించింది. బీహార్, పంజాబ్, హర్యానా, కర్నాటక, కేరళ, గుజరాత్ ఒరిస్సా, హిమాచల్ ప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, గోవా సహా పలు రాష్ట్రాల్లో సేవలు స్తంభించాయి. పశ్చిమ బెంగాల్‌లో వైద్య సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులలో ఔట్ పేషెంట్ సేవలు కూడా నిలిచిపోయాయి. 'మా పోరాటం కొనసాగుతుంది. మా డిమాండ్లు నెరవేరాలంటే ఇంత కంటే వేరే దారి లేదు' అని ఓ వైద్యుడు చెప్పారు. పోలీసులు ఉన్నప్పటికీ ప్రజలు ఆస్పత్రి లోపలికి వచ్చి తమపై ఎలా దాడి చేస్తారని ప్రశ్నించారు. బెంగాల్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎస్-ఎస్‌కేఎం ఆస్పత్రి, శంభూనాథ్ పండిట్ ఆస్పత్రి, కోల్‌కత్తా నేషనల్ మెడికల్ కాలేజీ ఆస్పత్రితో పాటు ప్రయివేటు ఆస్పత్రులలో కూడా అత్యవసరం కాని వైద్య సేవలు స్తంభించిపోయాయి. కొల్‌కతాలోని ఆర్‌జి కర్ ఆసుపత్రి నుంచి శ్యామ్ బజార్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు.

గుజరాత్‌లోని అమ్రేలిలో శుక్రవారం రాత్రి క్యాండిల్ మార్చ్ సందర్భంగా, వైద్యులనుద్దేశించి మాట్లాడుతూ తన లైసెన్స్‌డ్ తుపాకీ ప్రదర్శించిన డాక్టర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. గోవాలోని ఆజాద్ మైదాన్ నుంచి ఓల్డ్ గోవా మెడికల్ కాలేజి, ఆసుపత్రి భవనం వరకూ శనివారం వైద్యులు నిరసన కవాతు నిర్వహించారు.

సిబిఐ ముందు హాజరైన ఆస్పత్రి మాజీ ప్రిన్సిపాల్

ఆర్‌జికార్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్ వరుసగా రెండో రోజూ సిబిఐ ముందు హాజరయ్యారు. విషయం తెలియగానే ఆయన ఎలా స్పందించారు, ఏ చర్యలు తీసుకున్నారనే అంశాలను సిబిఐ ప్రశ్నించింది. జరిగిన నేరంలో కొంతమంది ఇంటర్న్స్, వైద్యుల పాత్ర కూడా వుందని బాధితురాలి తల్లిదండ్రులు సిబిఐకి తెలిపారు.

మమతా బెనర్జీ రాజీనామా చేయాలి : నిర్భయ తల్లి

పరిస్థితులను చక్కదిద్దడంలో విఫలమైన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన పదవికి రాజీనామా చేయాలని నిర్భయ తల్లి డిమాండ్ చేశారు.

బ్రిటన్, బంగ్లాదేశ్‌లోనూ సంఘీభావ ప్రదర్శనలు

బాధితురాలికి న్యాయం చేయాలని కోరుతూ బ్రిటన్‌లోని భారత డాక్టర్లు బహిరంగ లేఖ రాశారు. చర్యలు తీసుకోని బెంగాల్ ప్రభుత్వ వైఖరిని ఖండించారు. లండన్‌లోని ఇండియా హౌస్ వెలుపల శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఎడిన్‌బరోతో సహా పలు నగరాల్లో సంఘీభావ కార్యాచరణ చేపట్టారు. బంగ్లాదేశ్‌లో విద్యార్థులు భారత విద్యార్థులకు సంఘీభావంగా ప్రదర్శనలు చేశారు. పార్టీ రాజకీయాలకు అతీతంగా ఈ విషయంలో స్పందించాలని బిఎస్‌పి అధినేత్రి మాయావతి కోరారు. దోషులను శిక్షించడం, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడడం ఇప్పుడు చాలా కీలకమని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. బిజెపి ఎలాంటి రాజకీయాలకు పాల్పడరాదని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యానించారు.

చర్యల సూచనకు కమిటీ ఏర్పాటు

ఆరోగ్య సంరక్షణ రంగంలో పనిచేసేవారి భద్రతకు హామీ కల్పిస్తూ తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు త్వరలో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ శనివారం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వాలతో సహా అన్ని పక్షాలకు చెందిన ప్రతినిధులు ఈ కమిటీకి తమ సూచనలు తెలియజేయవచ్చని పేర్కొంది. పెరుగుతున్న డెంగ్యూ, మలేరియా కేసులను, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తక్షణమే ఆందోళనలు విరమించి విధుల్లో చేరాల్సిందిగా దేశవ్యాప్తంగా డాక్టర్లకు విజ్ఞప్తి చేసింది.

ప్రధాని జోక్యం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది : ఐఎంఎ

ప్రధాని మోడీ ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) అధ్యక్షుడు ఆర్‌వి అశోకన్ వ్యాఖ్యానించారు. దీనిపై ప్రధానికి లేఖ రాయనున్నట్లు చెప్పారు. కేంద్ర ఆరోగ్య మంత్రిని ఇప్పటికే కలిశామని, ఇక స్పందించాల్సి ప్రభుత్వమేనని అన్నారు. ప్రాథమిక హక్కు అయిన జీవించే హక్కుకు రక్షణ కల్పించాలని మాత్రమే కోరుతున్నామని, కానీ స్పందించడానికి రాజకీయ సంకల్పం వుండాలని వ్యాఖ్యానించారు.

ఆంక్షలు, వాతావరణ మార్పులపై గ్లోబల్ సౌత్ ఆందోళన

- ఉగ్రవాదంపై పోరులో కలిసిరావాలన్న ప్రధాని

శనివారం భారత్ నిర్వహించిన 'వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్' ఆన్‌లైన్ సమ్మిట్ దృశ్యం. పాల్గొన్న వివిధ దేశాల నేతలు

న్యూఢిల్లీ : ఆంక్షలు, రుణభారం, వాతావరణ మార్పులు వంటి అంశాలపై గ్లోబల్ సౌత్ (పేద, వర్ధమాన దేశాలు) ఆందోళన వ్యక్తం చేసింది. శనివారం భారత్ నిర్వహించిన మూడవ 'వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్' ఆన్‌లైన్ సమ్మిట్‌లో పాల్గొన్న వర్ధమాన దేశాల నాయకులంతా దీనిపైనే ఎక్కువ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేకించి ఏ దేశం గురించి ప్రస్తావించకున్నా గ్లోబల్ సౌత్ ఉమ్మడిగా ఎదుర్కొంటున్న సమస్యల్లో ఆంక్షలు, రుణాలు, లిక్విడిటీ సంక్షోభం వంటి వాటితోబాటు వాణిజ్యం, ఫైనాన్స్, టెక్నాలజీ అందుబాటు వంటివి దాదాపు అన్ని ఎదుర్కొంటున్న పెద్ద సమస్య అని ఈ దేశాల నేతలు పేర్కొన్నారు. ఈ సదస్సును రెండు సెషన్లుగా నిర్వహించారు. ప్రారంభ సెషన్‌లో విదేశాంగ మంత్రి జై శంకర్ మాట్లాడగా, ముగింపు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడారు. గ్లోబల్ సౌత్ దేశాల ఆందోళనలకు చాలా వాటిని ప్రధాని తన ఉపన్యాసంలో దాటేశారు. గ్లోబల్ సౌత్ సహకారం గురించి ఎప్పటిలా గంభీర ఉపన్యాసం చేశారు. ఇందుకోసం 'గ్లోబల్ డెవలప్‌మెంట్ కాంపాక్ట్' పేరుతో ఒక అభివృద్ధి నమూనాను భారత్ తరపున ప్రవేశపెడుతున్నానని చెప్పారు. ఇది భారత్ అభివృద్ధిలో భాగస్వామ్యం, అనుభవాలపై ఆధారపడి రూపొందించిందన్నారు. ఆ వెంటనే బిజెపి, ఆరెస్సెస్‌లకు అత్యంత ప్రీతిపాత్రమైన ప్రకృతి వ్యవసాయం గురించి లెక్చరిచ్చారు. షరా మామూలుగానే ఉగ్రవాదం గురించి ప్రస్తావించారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగించిన దాడి గురించి మిగతా గ్లోబల్ సౌత్ నాయకులు పదే పదే ప్రస్తావించినా, మోడీ మాత్రం దానిపై మౌనం వహించారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదం తీవ్రమైన ముప్పుగా ఉన్నాయని ప్రధాని చెప్పారు. గ్లోబల్ గవర్నెన్స్‌తో వ్యవహరించడానికి గత శతాబ్దంలో ఏర్పడిన సంస్థలు ప్రస్తుత శతాబ్దపు సవాళ్లను ఎదుర్కోనలేకపోయాయని ప్రధాని చెప్పారు. ఇలాంటి తరుణంలో భారతదేశ నైపుణ్యం, అనుభవాలను గ్లోబల్ సౌత్‌లో పంచుకోవడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచ ఉద్రిక్తతల పర్యవసానాలు అభివృద్ధి చెందుతున్న దేశాలపై ప్రభావం చూపుతున్నాయని, మరీ ముఖ్యంగా ఆహారం, ఇంధన భద్రత రంగాలపై తీవ్రమైన ప్రభావం చూపుతున్న నేపథ్యంలో ఈ సదస్సు జరుగుతోందని విదేశాంగ మంత్రి జై శంకర్ తొలుత పేర్కొన్నారు.

కర్ణాటకలో మరో గవర్నర్ గిరీ!

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి, ప్రస్తుత కేంద్ర మంత్రి హెచ్‌డి కుమారస్వామి, మాజీ మంత్రులు, బిజెపి నాయకులు శశికళ జొల్లె, మురుగేష్ నిరాణీలపై విచారణకు గవర్నర్ అనుమతి ఇవ్వకపోవడాన్ని సిద్ధరామయ్య ప్రశ్నించారు.

ముడా స్కామ్ అంటే...

ముడా స్కామ్ అనేది వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చి ప్లాట్లుగా విభజించే ప్రక్రియకు సంబంధించినది. స్కామ్‌లో సిద్ధరామయ్య, ఆయన భార్య బిఎం పార్వతి భూములకు ఎక్కువ పరిహారం లభించిందని ఆరోపణలున్నాయి. బిఎం పార్వతికి చెందిన కెసరె గ్రామంలో ఉన్న మూడు ఎకరాల భూమును 2021 ముడా స్వాధీనం చేసుకుంది. తరువాత ఆమెకు అక్రమంగా మైసూర్ పరిసరాల్లో 14 ప్లాట్లు కేటాయించారనేది ప్రధాన ఆరోపణ. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు సుమారు రూ.45 కోట్లు నష్టం వాటిల్లిందని ప్రదీప్ కుమార్, టిజె అబ్రహాం, స్నేమయి కృష్ణ లోకాయుక్తకు జూలైలో ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలను సిద్ధరామయ్య ఖండించారు. 2014లో బిజెపి ప్రభుత్వ హయాంలోనే ఈ కేటాయింపులు జరిగాయని సిద్ధరామయ్య చెబుతున్నారు.

నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ కేసులకు తొలిసారిగా డిజిటల్ కోర్టు

- కేరళలో ప్రారంభించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయ్

తిరువనంతపురం: నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ కింద కేసులను పరిష్కరించేందుకు దేశంలోనే మొట్టమొదటి ప్రత్యేక డిజిటల్ కోర్టును సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ కేరళలో ప్రారంభించారు. ఇక్కడ హైకోర్టు ఆడిటోరియంలో జరిగిన ఒక కార్యక్రమంలో.. జస్టిస్ గవాయ్ ఆన్‌లైన్ వివాద పరిష్కార ప్లాట్‌ఫారమ్, వీ-సాల్వ్ వర్చువల్ సొల్యూషన్ మేకర్‌ను కూడా ప్రారంభించారు. ఇది అన్ని వాటాదారుల ఆన్‌లైన్ చర్చలను సులభతరం చేస్తుంది. సాంప్రదాయ కోర్టు గదుల పరిమితులను అధిగమించేందుకు ప్రత్యేకంగా కేరళ హైకోర్టు రూపొందించిన మోడల్ డిజిటల్ కోర్టు గదిని కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేరళ సిఎం పినరయి విజయన్.. ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీల నిరోధక) చట్టం, 'బడ్స్' చట్టం (నియంత్రిత డిపాజిట్ పథకాల నిషేధ చట్టం, 2019) కింద కేసులను నిర్వహించటానికి ప్రత్యేక కోర్టులను ఎర్నాకులం, అలప్పుజాలో ప్రారంభించారు. కోవిడ్-19 తర్వాత సాంకేతిక జోక్యాల ఆగమనాన్ని ప్రస్తావిస్తూ.. లాక్డౌన్ అయిన 48 గంటల్లో సుప్రీంకోర్టు వర్చువల్ విచారణలను ప్రారంభించిందని జస్టిస్ గవాయ్ అన్నారు. ఈ సందర్భంగా విజయన్ మాట్లాడుతూ.. సాంకేతికత మన దైనందిన జీవితంలో భాగమని తెలిపారు. అలాగే, హైకోర్టు కాంప్లెక్స్‌లో నూతనంగా నిర్మించిన సెక్యూరిటీ కమ్ ఫెసిలిటేషన్ బ్లాక్‌ను రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పి.రాజీవ ప్రారంభించగా, సిసి టీవీ నిఘా వ్యవస్థను ఆర్థిక మంత్రి కె.ఎన్.బాలగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓపెన్ అండ్ నెట్‌వర్క్ కోర్ట్ సిస్టమ్ నాలెడ్జ్ పార్టనర్, ప్యుకార్ మెంటర్ నందన్ నీలేకని కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రాజేష్ బిందాల్, సి.టి రవికుమార్, కేరళ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ఎ. మహమ్మద్ ముస్తాక్, కేరళ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎ.కె జయశంకర్ నంబియార్, జస్టిస్ వి. రాజా విజయరాఘవన్, అడ్వకేట్ జనరల్ కె.గోపాలకృష్ణ కురుప్‌లు పాల్గొన్నారు. వాస్తవానికి, భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ డి.వై చంద్రచూడ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాల్సి ఉండగా, అనారోగ్య కారణాల వల్ల ఆయన ఈ కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు.

దోహాలో ముగిసిన చర్చలు

- వచ్చే వారం కైరోలో ఒప్పందం ?
- కొత్త షరతులు అంగీకరించేది లేదన్న హమాస్

దోహా : కతార్ రాజధాని దోహాలో రెండు రోజుల పాటు జరిగిన కాల్పుల విరమణ చర్చలు ముగిశాయి. గాజాలో కాల్పుల విరమణకు ఉద్దేశించిన ఒప్పందాన్ని ఖరారు చేయడానికి వచ్చే వారం కైరోలో తిరిగి సమావేశమవనున్నట్లు చర్చల మధ్యవర్తులు శుక్రవారం తెలిపారు. చర్చలు నిర్మాణాత్మకంగా, సానుకూల వాతావరణంలో జరిగాయని అమెరికా, ఈజిప్ట్, కతార్‌లు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. హమాస్, ఇజ్రాయిల్ మధ్య రాజీకి ఒక ప్రతిపాదన'ను చేశామని మధ్యవర్తులు తెలిపారు. గాజాలో తక్షణమే సమగ్ర కాల్పుల విరమణకు పిలుపునిస్తున్న ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానం నెంబరు 2735 నిబంధనలు ఆ ప్రతిపాదనలో వున్నాయన్నారు. 10మాసాల దాడులను అంతమొందించడం, బందీల విడుదలపై ఈ చర్చల్లో ప్రధానంగా కేంద్రీకరించినట్లు తెలిపారు. తొలుత పేర్కొన్న ప్రతిపాదనకు కొత్త షరతులను చేర్చారని హమాస్ , అవి తమకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని హమాస్ స్పష్టం చేసింది. ఈజిప్ట్‌తో గాజా సరిహద్దు పొడవునా బలగాలను వుంచాలని ఇజ్రాయిల్ డిమాండ్ చేస్తోందని హమాస్ పేర్కొంది. అలాగే ఖైదీల మార్పిడిపై షరతులు విధించాలని కూడా చూస్తున్నారని పేర్కొంది. పూర్తిగా కాల్పుల విరమణ, ఇజ్రాయిల్ బలగాల ఉపసంహరణ, నిర్వాసితులు వెనక్కి రావడం, ఎలాంటి ఆంక్షలు, షరతుల లేని ఖైదీల మార్పిడిని హమాస్ కోరుతోంది. బైడెన్ ప్రభుత్వం బూటకపు సానుకూల వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని హమాస్ సీనియర్ అధికారి సామి అబూ జుహారి విమర్శించారు. చర్చల ఫలితం పట్ల సందేహాలు వ్యక్తం చేశారు.

గాజాలో దాడులు ముగిశాయి: ఇజ్రాయిల్ మీడియా

గాజాలో ఇజ్రాయిల్ ఆర్మీ పోరు ముగిసిందని భద్రతా అధికారులను ఉటంకిస్తూ ఇజ్రాయిల్ ప్రభుత్వ టివి తెలిపింది. కొత్త ఇంటెలిజెన్స్ సమాచారం వుంటేనే ఇజ్రాయిల్ వెనక్కి తిరిగి గాజాలోకి ప్రవేశిస్తుందని టివి వార్తలు తెలిపాయి. హమాస్‌కి చెందిన రఫా బ్రిగేడ్‌ను ఓడించామని, ఇక అది లేనట్లేనని ఇజ్రాయిల్ ఆర్మీ పేర్కొంది. హమాస్‌కి చెందిన పోరాట దళాలు చాలా వరకు నిర్వీర్యమయ్యాయని, అందువల్ల బందీల విడుదలకు ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇది తగిన సమయమని సీనియర్ రక్షణాధికారుల తెలిపారని టివి వార్తలు పేర్కొన్నాయి.

శ్మశానాన్ని తలపిస్తున్న గాజా

ఇజ్రాయిల్ కిరాతక దాడుల్లో నెత్తురోడుతున్న గాజా నేడు శ్మశానాన్ని తలపిస్తోంది. ఎప్పటికప్పుడు వచ్చే మృతదేహాలకు అవసరమైన స్థలం లేక ఒక్కోసారి పాత సమాధులనే తవ్వి మరీ కొత్త వాటిని పూడ్చి పెట్టిన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. డేర్ అల్ బాలాహ్‌లో సమాధులు తవ్వే స్వచ్ఛంద కార్యకర్తలు సూర్యోదయంతో పని మొదలు పెడితే మళ్లీ సూర్యుడు అస్తమించేవరకు నిరంతరాయంగా తవ్వడం, పాతిపెట్టడంతో సరిపోయేది. చనిపోయిన వారిని ఎక్కడికక్కడ పాతిపెట్టి, మళ్ళీ దాడుల నుండి తప్పించుకునేందుకు పారిపోవాల్సిన పరిస్థితులు వుండడంతో ఇంటి వెనుక స్థలాలు, పార్కింగ్ ప్రదేశాలు, మెట్ల కింద ప్రాంతాలు, రోడ్ల పక్కన ఇలా ఏ స్థలాన్ని విడిచిపెట్టలేదు. శిథిలాల దిబ్బల కింద మగ్గిపోతున్న మృత దేహాల సంఖ్యకు అంతే లేదు. గత 48గంటల్లో గాజాలో 69మంది మరణించగా, 136 మంది గాయపడ్డారు. దీంతో ఇప్పటివరకు గాజాలో మరణించిన వారి సంఖ్య 40,074కి చేరింది. గాయపడిన వారి సంఖ్య 92,537కి చేరింది.

కొత్త క్రిమినల్ చట్టాలు ప్రశ్నించే గొంతును నొక్కేందుకే

(మొదటి పేజీ తరువాయి)

పేరుతో జూన్ 25వ తేదీన రాజ్యాంగ హత్య దినోత్సవంగా ప్రకటించడం గమనార్హమన్నారు. ప్రభుత్వ దుర్మార్గాలను ప్రజలు గుర్తించకుండా పక్కదారి పట్టించేందుకు ఇలాంటి అంశాలను తీసుకొస్తున్నారని చెప్పారు. మెట్రోపాలిటన్, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులను తొలగించడం తగదని, ఇది కేసుల విచారణను జాప్యం చేస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ చట్టాలను నిలుపుదల చేసి తగిన సవరణలు చేసిన తరువాతే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాల ద్వారా కొత్త చట్టాలను ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగంపై నమ్మకం లేని ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో నడుస్తున్న బిజెపి అందరి హక్కులపై వరుసగా దాడులు చేస్తోందన్నారు. కార్మికుల హక్కులను దెబ్బకొట్టేలా కొత్త కార్మిక కోడ్లను, రైతాంగాన్ని దెబ్బకొట్టేలా నల్ల చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ప్రజలపై దాడి చేసేందుకు ఈ క్రిమినల్ చట్టాలను తీసుకొచ్చిందని వివరించారు. వీటిని రద్దు చేసేవరకు పెద్దయెత్తున ఉద్యమం జరగాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. కొత్త చట్టాలను నిలుపుదల చేయాలని అనేక రాష్ట్రాలు కేంద్రాలకు లేఖలు రాస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని, ప్రతిపక్ష వైసిపి కూడా ఈ చట్టాలపై నోరు విప్పాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర నాయకులు అక్కినేని వనజ మాట్లాడుతూ.. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేసిన ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని పోరాటం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ నాయకులు నరహరశెట్టి నరసింహారావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. ప్రజల హక్కులను కాలరాసే ఉద్దేశంతోనే వీటిని తీసుకొచ్చిందన్నారు. సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్ నాయకులు వై కోటేశ్వరరావు మాట్లాడుతూ.. తిరోగమని చట్టాలను కేంద్రం తీసుకొచ్చిందని విమర్శించారు. ఒక పథకం ప్రకారం ప్రజా హక్కులను హరించడానికి వీటిని చేశారని తెలిపారు. వీటి నిలుపుదల కోసం ప్రజలను సమీకరించి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పియుసిఎల్ నాయకులు బండ్ల సాంబశివరావు, బెజవాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరిగల శివరామ్ ప్రసాద్ ప్రసంగించిన ఈ కార్యక్రమంలో ఐలూ నాయకులు నర్రా శ్రీనివాసరావు, ఆలూరి సుధాకర్ రావు, సిఎల్‌సి నాయకులు శ్రీమన్నారాయణ, టి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఒకే ప్రాంతంలో ఐదేళ్లుంటే బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

వితంతువులకు బదిలీల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. దృష్టిలోపం ఉన్న ఉద్యోగులను బదిలీ నుండి మినహాయించారు. వారికోసం ఖాళీలను బట్టి వారి అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని బదిలీలు ఉంటాయని తెలిపారు. భార్యాభర్తలకు ఒకే ప్రాంతంలో బదిలీ ఉండాలని, లేనిపక్షంలో సమీపంలో ఉండేలా చూడాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో ఇలా...

గిరిజన ప్రాంతాల్లో ఖాళీలను పూర్తిగా బదిలీ చేయాలని జిఓలో సూచించారు. అక్కడ రెండేళ్లు పూర్తి చేసిన ఉద్యోగులకు వారు కోరుకునే ప్రాంతంలో ఖాళీలను బట్టి బదిలీకి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. గిరిజన ప్రాంతాల్లో నియమించే వ్యక్తికి 50 ఏళ్లలోపు వయసు ఉండేలా చూడాలని ఆదేశించారు. ఐటిడిఎ పరిధిలో పోస్టింగు ఇచ్చిన వారు ఖచ్చితంగా చేరాలని, నిర్దిష్టకారణం లేకుండా విధుల్లో చేరకపోతే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బదిలీల మొత్తాన్ని కలెక్టర్ స్థాయిలో అధికారులు పర్యవేక్షించాలని, వీటన్నిటినీ జిల్లా, జోనల్, మల్టీజోనల్ క్యాడర్లు అన్నీ ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం పాత జిల్లాల ప్రాతిపదికనే చేయనున్నారు.

బదిలీల్లో ప్రాధాన్యతను అంతర్గత కమిటీలు ఖచ్చితంగా పరిశీలిస్తాయని పేర్కొన్నారు. ఈ కమిటీలు సీనియారిటీని కూడా పరిగణనలోకి తీసుకోవాలని, ఎక్కడా లోపం ఉండకూడదని, ఒకవేళ అక్రమం జరిగినట్లు గుర్తిస్తే తీవ్ర చర్యలు ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గుర్తింపు పొందిన ప్రభుత్వ ఉద్యోగ సంఘాల్లో ఆఫీసు బేరర్లకు కూడా తొమ్మిదేళ్ల మినహాయింపు ఇచ్చారు. రాష్ట్రస్థాయి సంఘాలకు సంబంధించిన ఉద్యోగుల వివరాలను హెచ్‌ఓడిలు పరిశీలిస్తారని, జిల్లా అధికారుల వివరాలను కలెక్టర్లు పరిశీలిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టైమ్ బాంబులా అమెరికా రుణ భారం !

వాషింగ్టన్ : అమెరికా ప్రభుత్వ మొత్తం రుణాలు జులై 26నాటికి 35.001 లక్షల కోట్ల డాలర్లకు చేరుకున్నాయని అమెరికా ఆర్థిక శాఖ వెల్లడించిన డేటా పేర్కొంది. వాస్తవానికి అమెరికా ప్రభుత్వం తన రుణ పరిమితి 31.4 లక్షల కోట్ల డాలర్లని గతేడాది జనవరిలోనే అధిగమించింది. దేశంలో సగటు అమెరికన్ రుణ భారం పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతతం సగటు అమెరికన్ రుణం ఒక్కో వ్యక్తికి లక్ష డాలర్లు పైమాటగానే వుంది. ఇలా రుణ భారం పెరగడం వల్ల దేశ దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధి అవకాశాలు ముప్పులో పడతాయి. అంతర్జాతీయ ఆర్థిక పురోగతి కూడా తగ్గుతుంది. కచ్చితంగా చెప్పాలంటే ఈ రుణం ఒక టైమ్ బాంబ్ వంటిది. కనబడని ముప్పులతో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదంగా మారుతోంది.

బంగ్లా అలర్లల్లో మృతులు 650 మంది

- ఐరాస నివేదిక

ఢాకా/ జెనీవా : బంగ్లాదేశ్‌లో నిరంకుశ హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన విద్యార్థుల తిరుగుబాటుపై నిర్బంధం, దేశ వ్యాపితంగా చెలరేగిన ఘర్షణల్లో దాదాపు 650 మంది మరణించారని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం (యుఎన్‌హెచ్‌ఆర్‌సి) తన ప్రాథమిక నివేదికలో పేర్కొంది. హత్యలు, చట్టవిరుద్ధమైన అరెస్టులు, నిర్బంధాలు వంటి వార్తలపై సమగ్రమైన, నిష్పాక్షికమైన, పారదర్శక దర్యాప్తు జరగాలని యుఎన్‌హెచ్ ఆర్‌సి కోరింది. 'బంగ్లాదేశ్‌లో ఇటీవలి నిరసనలు, అల్లర్లు యొక్క ప్రాథమిక విశ్లేషణ' అన్న పేరుతో 10 పేజీల నివేదికను విడుదలజేసింది.

ఆ నివేదిక ఈ ఏడాది జూలై 16 నుంచి ఆగస్టు 4 మధ్య దాదాపు 400 మరణాలు సంభవించాయి. ఆగస్టు 5,6 తేదీల్లో జరిగిన అల్లర్లల్లో 250 మంది మరణించారు. చనిపోయినవారిలో నిరసనకారులు, సాధారణ పౌరులు, పాత్రికేయులు, భద్రతా దళాల సిబ్బంది ఉన్నారని తెలిపింది. ప్రస్తుతందేశంలో భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, శాంతియుత సమావేశాలపై తీవ్రమైన ఆంక్షలు ఉన్నాయని నివేదిక తెలిపింది. మైనార్టీలపై దాడులు, మాజీ అధికార పార్టీ నాయకులపై ప్రతీకార దాడులు కొనసాగుతుండడం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నెల 15న బంగబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించేందుకు తరలివచ్చిన అవామీ లీగ్ పార్టీ మద్దతుదారులపై వెదురు కర్రలు, ఇనుప రాడ్లు, పైపులు వంటి వాటితో సాయుధ గుంపు దాడికి దిగినట్లు తెలిపింది, శాంతిభద్రతలను వేగంగా పునరుద్ధరించడం, ప్రాణనష్టం, ప్రతీకార దాడులను నివారించడానికి బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరింది.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రీజనల్ ఆఫీస్, విజయవాడ.
1వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎపి - 520001.

బంగారు ఆభరణాల అప్రైజర్ ఎంపానెల్‌మెంట్ ప్రకటన

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయవాడ, ప్రాంతీయ కార్యాలయం వారు నూతన పూలింగ్ గోల్డ్ అప్రైజర్స్/ప్రొఫెషనల్స్ జాబితా రూపొందించాలని భావిస్తున్నారు. బంగారు ఆభరణాల నాణ్యతా మదింపు ప్రక్రియలో సహాయం చేయుటకు ప్రాంతీయ కార్యాలయం పరిధిలో పనిచేయవలసి ఉంటుంది. **అప్రైజర్ సర్వీస్ అనునది పూర్తిగా కాంట్రాక్టు సంబంధించిన విషయం. భవిష్యత్తులో ఏ సమయంలోనైనా పార్ట్ టైమ్ లేదా పూర్తి కాలం అప్రైజర్ ఉద్యోగం పొందుటకు ఎటువంటి క్లెయిమ్‌ను బ్యాంకు స్వీకరించదు.** ప్రాథమికంగా ఆభరణాల అప్రైజర్ నియామక కాలం ఒక్క సంవత్సరం ఉంటుంది. ఇది 30 రోజుల అడ్వాన్స్ నోటీస్ ఇచ్చుట ద్వారా బ్యాంక్ ఐచ్ఛికాన్ని బట్టి ఏదేని కారణంతో తొలగించే విధానంలో ఉంటుంది. వినియోగదారుల ఫిర్యాదులు లేకుండా మరియు ఎటువంటి తీవ్రమైన ఆడిట్ తప్పిదాలు లేకుండా సంతృప్తికరమైన పనితీరు కనబరచవలసి ఉంటుంది.

నోట్: ఎప్పుడైనా వారిని తీసివేసే అధికారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అధీకృత అధికారికి కలదు.

నూతన జాబితా కొరకు అర్హత:

1) దరఖాస్తుదారు ప్రాంతీయ కార్యాలయం పరిధి నివాసి అయి ఉండవలెను మరియు అతని/ఆమె లావాదేవీలు/ వ్యాపారం/వృత్తి అదే ప్రాంతంలో కలిగి కె.వై.సి ధృవీకరణ కలిగి ఉండవలెను.
2) అప్రైజర్ గోల్డ్ వస్తువు తయారీ నాణ్యతలో కనీసం 03 సంవత్సరాల అనుభవం కలిగి ఉండి నైపుణ్యం కలిగిన స్వర్ణకారుడు అయి ఉండవలెను.
3) తగిన గుర్తింపుతో స్థానిక బులియన్ మార్కెట్లో దరఖాస్తుదారు సభ్యుడు అయి ఉండవలెను.
4) ఎం. ఎస్. ఎం. ఇ, గోల్డ్ జ్యూయలరీ అసోసియేషన్, గోల్డ్ స్మిత్ అసోసియేషన్, పాలిటెక్నిక్ వంటి ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా జారీ చేయబడిన పరిశీలించదగిన అనుభవం & సర్టిఫికేట్‌తో ఆభరణాల తయారీ మరియు **ఆభరణాల స్వర్ణకారుడుగా అనుభవం సర్టిఫికేట్ కలిగి ఉండవలెను.**
5) బంగారు ఆభరణాలు పరీక్షించుటకు సంబంధించిన లైసెన్స్ కలిగి ఉండవలెను.
6) దరఖాస్తుతో పాటు (అనుబంధం-డి) తో పాటు అతని అనుభవం మరియు పనిప్రదేశాన్ని తెలుపవలసి ఉంటుంది.
7) ప్రస్తుతం ఉన్న బ్యాంక్ / ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూట్ నుండి నిరభ్యంతర సర్టిఫికేట్‌తో ఇతర బ్యాంకులు / ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూట్ జాబితాలో ఉన్నట్టి అప్రైజర్ దాఖలు చేసుకొనవచ్చును. అయితే ప్రత్యేకంగా మా బ్యాంక్ పని చేయుటకు ఆసక్తి కలిగిన మరియు అర్హత పొందిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
8) వారి అభ్యర్థిత్వం పరిశీలనలోనికి తీసుకున్నట్టి ప్రదేశంలో సొంత ఇంటితో సిటీ / టౌన్ శాశ్వత నివాసితులైనట్టి దరఖాస్తుదారులకు ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
9) దరఖాస్తుదారు నియమితులైన ప్రాంతీయ కార్యాలయ పరిధిలోని సిబ్బందితో ఎటువంటి రక్త సంబంధం / చుట్టరికం కలిగి ఉండరాదు.
10) ఏదేని ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్లో దరఖాస్తుదారు డిఫాల్టర్ అయి ఉండకూడదు.
11) అతడు గతంలో జైలు శిక్షకు గురై మరియు ఏదేని క్రిమినల్ నేరం చేసి ఉండరాదు.
12) దరఖాస్తుదారు గురించి మార్కెట్లో సంతృప్తి నివేదిక ఉండవలెను.
13) పూలింగ్ గోల్డ్ అప్రైజర్సుకు బ్యాంకు నిబంధనల ప్రకారం కమీషన్ చెల్లించబడును. బ్యాంకు వారు ఏ ఇతర ఖర్చులు చెల్లించరు.
14) ఎంపిక చేయబడిన గోల్డ్ అప్రైజర్ అవసరమైన అగ్రిమెంట్ మరియు ఇండెమినిటీ బాండ్ సమర్పించవలసి ఉంటుంది. అప్రైజర్ బ్యాంక్కు ఆమోదయోగ్యమైన ఇద్దరు హామీదారుల హామీ ఇవ్వవలసి ఉంటుంది మరియు బ్యాంకు నిబంధనల ప్రకారం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయవలసి ఉంటుంది.

దరఖాస్తుకు ఆఖరి తేది : 31-08-2024

కనీస విద్యార్హత : 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండవలెను.
వయస్సు : కనిష్టం 30 సం॥రాలు గరిష్టం 65 సం॥రాలు
దరఖాస్తు విధానం: పై అర్హతలు కలిగి అసక్తి కలిగిన దరఖాస్తుదారు ప్రాంతీయ కార్యాలయం విజయవాడ నుండి నేరుగా పొందవచ్చును. దరఖాస్తుదారు ప్రాంతీయ కార్యాలయముకు దాఖలు చేయవలసి ఉంటుంది. దరఖాస్తుదారు ప్రాంతీయ కార్యాలయముకు **తేది. 31-08-2024** లోపు దాఖలు చేయవలెను.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎటువంటి కారణాలను పేర్కొనకుండా స్వీకరించిన ఏదైనా లేదా అన్ని దరఖాస్తులను తిరస్కరించే హక్కును కలిగి ఉంటుంది.

తేది : 17-08-2024, ప్రదేశం : విజయవాడ
సం/- రీజనల్ హెడ్

అర్హత గల రాజు

ఒక అడవిలో రకరకాల పక్షులు, ఎటువంటి అరమరికలు లేకుండా కలిసిమెలిసి గుంపుగా నివసిస్తూ ఉండేవి. వాటి ఐకమత్యం చూసి మిగతా జంతువులన్నింటికీ చాలా ముచ్చటేసేది. ఆ పక్షులన్నీ వాటి వాటి జంట పక్షులతో, పిల్లలతో ఎవరికి వారు గూడు నిర్మించుకుని చక్కగా నివసిస్తూ ఉండేవి.

ఆ పక్షులన్నిటిలో వృద్ధపక్షి అయిన ఒక గ్రద్ద – 'మిగతా జంతువుల వలే మనక్కూడా ఒక రాజు ఉంటే బాగుంటుంది. ఎవరికైనా ఏమైనా సలహా కాని, కష్టం వచ్చినపుడు సహాయం చేయడానికైనా బావుంటుంది' అని చెప్పడంతో మిగతా పక్షులన్నీ సరేనన్నాయి.

'అయితే మనలో రాజుగా ఉండే అర్హత ఎవరికి ఉందో ముందు పరీక్షించాలి. ఆ తర్వాతే వారిని రాజుగా ఎన్నుకోవాలి' అని చెప్పడంతో అన్నీ ఆలోచనలో పడ్డాయి. పోటీకి కొన్ని జంతువుల పేర్లు కూడా ఇచ్చాయి. నెమలి గుంపు నుండి ఓ నెమలి ముందుకు వచ్చి తను చాలా అందమైన పక్షినని తనని రాజుగా ఎన్నుకుంటే అందరికీ సహాయం చేస్తానని, దాంతోపాటు అప్పుడప్పుడు వర్షం వచ్చినప్పుడు నృత్యం కూడా చేసి అందర్నీ అలరిస్తానని చెప్పింది.

రామచిలుకల గుంపు నుండి ఓ చిలక పోటీలో నిలబడి నేనూ అందమైన పక్షినే. నెమలి ఎక్కువ దూరం ఎగరలేదు కానీ నేను ఎక్కువ దూరం కూడా ఎగరగలను నన్ను రాజుగా చేయమని కోరింది.

అలా అన్ని పక్షులు గుంపుల నుండి పోటీకి ఒక్కొక్కటి చొప్పున నుంచున్నాయి. ఎవరికి వారు వాటి గొప్పతనం చెబుతూ వచ్చాయి. కానీ పిచ్చుకల గుంపు నుంచి ఏ ఒక్క పిచ్చుక రాలేదు. గ్రద్ద, పిచ్చుకలను చూసి 'మీ నుంచి పోటీకి ఎవరూ రాలేదేంటి? అని ప్రశ్నించింది. 'ఓ నేస్తమా మేము అందంగా ఉండం. ఇంకా ఎందులోనూ గొప్ప వాళ్ళం కాదు అందుకే రాలేదు' అని చెప్పాయి.

అయితే అనుకోకుండా ఆ రోజు రాత్రి విపరీతమైన వర్షం కురిసి చెట్లు కొమ్మలు విరిగిపోయి, గూళ్ళన్నీ నేలరాలి పక్షులు చెల్లాచెదరయ్యాయి. పిల్ల పక్షులు వాటి తల్లి పక్షుల కోసం బిక్కు బిక్కు మంటూ భయంతో ఏడవసాగాయి.

రామచిలుకలన్నీ వాటి పిల్లల్ని మాత్రమే వెతుక్కుని గూళ్లకి చేర్చుకున్నాయి. నెమలి గుంపు కూడా తమ గూడుల్ని, మిగతా నెమలి పిల్లల్ని కాపాడుకుని క్షేమంగా గూటికి చేర్చాయి.

కానీ పిచ్చుకలు గుంపు మాత్రం వాటి పిల్లలతో పాటు మిగతా పిల్లలను కూడా అక్కున చేర్చుకుని, ఆ రాత్రి ఆహారాన్ని ఇచ్చి, ధైర్యం చెప్పి వాటి తల్లులను వెతికి, తల్లి పక్షుల దగ్గరకి చేర్చాయి.

ఇదంతా గమనించిన గ్రద్ద ఆరోజు సాయంత్రం అన్నింటిని పిలిచి సమావేశం ఏర్పాటు చేసింది. 'నిన్న రాత్రి భారీ వర్షంలో తమ ప్రాణాలు సైతం లెక్కచేయక పిచ్చుకలు గుంపు వాటి పిల్లలతోపాటు మిగతా పిల్లల్ని కూడా కాపాడి వాటి తల్లిదండ్రులు దగ్గరికి చేర్చాయి. మనమందరం చూసాం. ఇప్పుడు చెప్పండి రాజుగా ఉండడానికి ఎవరికి అర్హత ఉందో?' అనగానే అన్ని పక్షులు ముక్తకంఠంతో పిచ్చుకలు.. పిచ్చుకలు.. అని అరిచాయి.

నెమలిగుంపు, రామచిలుకలు గుంపు సిగ్గుతో తలదించుకున్నాయి.

రాజుగా ఉండాలంటే అందం కాదు, అందరికీ ఆనందాన్ని పంచడం మాత్రమే కాదు. నా, నీ భేదం లేకుండా అందరికీ సహాయం చేయడం, అందరిని సమాదరించడం అనే గొప్ప లక్షణాలు కూడా ఉండాలి. ఆ అర్హత మనం పిచ్చుకలు గుంపులో చూశాం .అందుకే ఈరోజు రాజుగా పిచ్చుకలు గుంపు నుండి ఒకరిని రాజుగా ఎన్నుకుందాం' అనేసరికి మిగతా పక్షులన్నీ రెక్కలతో శబ్దం చేస్తూ వాటి వాటి హర్షాన్ని వ్యక్తం చేశాయి.

- పేలూరి వెంకట మీనాక్షి,
99126 01765.

నేను గీసిన బొమ్మ



షేక్ నేహా,
6 వ తరగతి,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఉర్దూ),
కర్నూలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మౌనశ్రీ మల్లిక్... పాటను అతను ప్రేమిస్తాడు.. శ్వాసిస్తాడు.. పాటే ప్రపంచంగా బతుకుతాడు. వీలు చిక్కినప్పడల్లా ఆ పాటనే సామాజిక సమస్యలపై ఆయుధంగా ఎక్కుపెడతాడు. ఇప్పడు 'తిరిగి చూడు తిరిగి చూడు' అంటూ మనిషి బాధ్యతను తట్టి లేపుతున్నాడు. అందుకే సాహిత్య, అభ్యుదయకారుల నుండి ప్రశంసలు అందుకుంటున్నాడు. ఆధిపత్యం, అంటరానితనం, లింగ వివక్ష... ఒక్కటేమిటీ దేశం నేడు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యనూ నాలుగు చరణాల్లో ప్రపంచానికి చాటి చెప్పిన ఆయనతో ముఖాముఖీ...

సామాజిక సమస్యలపై ఎక్కు పెట్టిన ఆయుధం 'తిరిగి చూడు'

మీ కుటుంబ నేపథ్యం..?

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల కేంద్రంలో జన్మించాను. అమ్మ వెంకటమ్మ, నాన్న బక్కయ్య. వీరు నిరక్షరాస్యులు. బతికినంత కాలం కూలీలుగానే జీవించారు. మేము నలుగురం సంతానం. నాకు అక్క, అన్న, చెల్లి ఉన్నారు. మాది చాలా నిరుపేద కుటుంబం. వర్ధన్నపేటలోనే ఇంటర్ పూర్తి చేసి, వరంగల్ సికెఎం కళాశాలలో బికాం డిగ్రీ, హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం నుండి జర్నలిజంలో మాస్టర్ డిగ్రీ తీసుకున్నాను.

పాటలు రాయడానికి మీకు ప్రేరణ, స్ఫూర్తినిచ్చిన రచయితలు?

ఊహ తెలిసినప్పటి నుండి పాటలు వినడం చాలా ఇష్టం. సినిమా పాటలంటే మరీ ఇష్టం. రేడియోలో వచ్చే పాటలను ఎంతో ఇష్టంగా విని పాడుకుంటూ ఉండేవాడిని. దూరదర్శన్‌లో వచ్చే 'చిత్రలహరి' కార్యక్రమాన్ని ఎంతో ఇష్టంగా చూసేవాడిని. మా ఊర్లో ఒక టూరింగ్ థియేటర్ ఉండేది. అందులో ఎక్కువగా సినిమాలు చూస్తూ ఉండేవాడిని. అలా నాకు పాటలపై మమకారం ఏర్పడింది. పాట ఏదైనా, ఎక్కడ వినబడినా అక్కడే స్థాణువుగా మారి, పాట పూర్తయ్యాకే అక్కడినుండి కదిలేవాడిని. అప్పట్లో పాటలోని అర్థాలు తెలిసేవి కాదు. వయసుతో పాటు పాటలోని భావం అర్థం చేసుకునే జ్ఞానం పెరుగుతూ వచ్చింది. అలా పాట వలన నాకు భాషా జ్ఞానం, భావనా బలం, ఊహా శక్తి అంతకంతకు పెరుగుతూ వచ్చింది. భాషతో రచయితలు చేసిన ప్రయోగాలు, పాట రూపకల్పనలో రచయితలు చూపిన ప్రతిభకు ఆశ్చర్యపోయేవాడిని. ఆత్రేయ, సినారె, వేటూరి, సిరివెన్నెల చాలా ఇష్టం. ఇప్పుడు సుద్దాల అశోక్ తేజ, చంద్రబోస్ రచనా శైలీ ఇష్టం. ఎస్పీ బాలసుబ్రమణ్యం పాటలు నా యవ్వనప్రాయాన్ని ఇంద్రధనువులపై ఊరేగించాయి. అలా పాటతో ప్రేమలో పడ్డాను.

మీరు కవిత్వం కూడా రాశారు కదా?

మొదటి నుండి సమయం చిక్కినప్పుడల్లా లైబ్రేరీలో ఎక్కువ సమయం గడుపుతూ పుస్తకాలు బాగా చదివేవాడిని. అలా విస్తృతమైన అధ్యయనంతో భాషపై పట్టు లభించింది. నాలో కవితావేశం కలిగినప్పుడల్లా కవితలు రాసి పత్రికలకు పంపేవాడిని. అలా కవిగా నా ప్రయాణం మొదలైంది. కవితల పోటీల్లోనూ పాల్గొనేవాడిని. సుమారు 200 కవితల పోటీల్లో ప్రథమ బహుమతి లభించింది. వీటిలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి బహుమతులు కూడా ఉన్నాయి. ఆ బహుమతి పొందిన కవితలను ఒకచోట కూర్చి దిగంబర, గరళం, తప్తస్పృహ, మంటల స్నానం కవితా సంపుటాలుగా ప్రచురించాను.

ఇప్పటివరకు ఎన్ని పాటలు రాసుంటారు?

టెలివిజన్ సీరియళ్లలో ఎక్కువ పాటలు రాశాను. కె. రాఘవేంద్రరావు నిర్మించిన కోయిలమ్మ సీరియల్లో 550 పాటలు, కృష్ణ తులసి సీరియల్లో 200 పాటలు రాశాను. అలాగే సీరియళ్లలో ఎక్కువ పాటలు రాసిన రచయితగా నాకు మంచి గుర్తింపు లభించింది. అలాగే మౌనరాగం, కలిసుందాం రా, అనుపల్లవి, ఎదలోయల్లో ఇంద్రధనస్సు, కేరాఫ్ అనసూయ, అగ్నిసాక్షి, అగ్నిసాక్షి 2 సీరియళ్లలో పాటలు రాశాను. ఇంకా రాస్తూనే ఉన్నాను. ఇప్పటివరకు టీవీ సీరియళ్లకు సంబంధించి, సుమారు 750 పాటలు రాసి ఉంటాను. అలాగే కొన్ని సినిమాలకు కూడా రాశాను. నా మొదటి సినిమా 'చేతిలో చెయ్యేసి' 2010లో విడుదలైంది. తర్వాత థ్రిల్లింగ్, గుడ్ మార్నింగ్, చెంబు చినసత్యం వంటి 50 చిత్రాలకు 100 పైగా పాటలు రాశాను.

'ఇండియా ఫైల్స్' చిత్రంలో పాటలు రాసే అవకాశం ఎలా వచ్చింది?

కోవిడ్ టైంలో విడుదలైన 'జాతీయ రహదారి' చిత్రంలో మొత్తం పాటలు నేనే రాశాను. ఆ పాటలు విన్న ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కనకదుర్గ గారు నన్ను దర్శకనిర్మాత బొమ్మకు మురళి గారికి పరిచయం చేశారు. అలా 'ఇండియా ఫైల్స్' చిత్రంలో పాటలు రాసే అవకాశం వచ్చింది. కేవలం ఒక్క పాట రాయడానికి వెళ్ళిన నేను వాళ్ళ సంస్థల్లో సుమారు 20 పాటల వరకు రాశాను. బొమ్మకు క్రియేషన్స్ నుంచి త్వరలో రాబోయే మరో సినిమా 'బాబాయిజం' చిత్రంలో కూడా పాటలు రాశాను. మరికొన్ని చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం కొన్ని సినిమాలకు పాటలు రాస్తున్నాను.

'తిరిగి చూడు' పాటకు సాహిత్యకారుల నుండి మంచి ప్రశంసలు వస్తున్నాయి. ఎలా ఫీలవుతున్నారు?

ఈ పాటతో ఓ ఐడెంటిటీ వచ్చింది. చాలామంది సామాజిక కార్యకర్తలు, ఉద్యమ నేతలు, ముఖ్యంగా సాహిత్య రంగ ప్రముఖులు, ఈ పాటపై ప్రశంసలు కురిపిస్తున్నారు. చాలామంది కవులు స్వచ్ఛందంగా ఈ పాటపై పత్రికల్లో సమీక్షలు చేస్తున్నారు. అది నేను చాలా గౌరవంగా భావిస్తున్నాను. పాట విడుదలై నెల రోజులు దాటినా ఇప్పటికీ ఫోన్ కాల్స్, మెసేజెస్ వస్తూనే ఉన్నాయి.



రాఘవేంద్రరావుతో మల్లిక్

ఈ పాట సాహిత్యకారులకు, ఉద్యమకారులకు బాగా నచ్చింది. అంతేకాకుండా శాస్త్రీయ దృక్పథం గలవారు ఈ పాటను భుజాన ఎత్తుకున్నారు. చాలామంది సినీ రంగ ప్రముఖులు కూడా ప్రత్యేకంగా ఫోన్ చేసి అభినందిస్తున్నారు.

ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న ప్రతి సమస్యనూ పాటలో లోతుగా ప్రస్తావించారు. ఇంతటి సామాజిక అవగాహన ఎలా వచ్చింది?

మొదటి నుండి సామాజిక స్పృహ ఉంది. నా చుట్టూ ఏం జరుగుతుందో, నా రాష్ట్రంలో ఏం జరుగుతుందో, నా దేశంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాల్సిన బాధ్యత నాకు ఉంది. మన దేశంలో చాలా సామాజిక సమస్యలు ఉన్నాయి. స్వాతంత్ర్యం సిద్ధించి 78 సంవత్సరాల మైలు రాయిని చేరుకున్నప్పటికీ, మనిషి సాటి మనిషిని ప్రేమించలేకపోతున్నాడు. కష్టాల్లో ఉన్నప్పుడు ఆదరించలేకపోతున్నాడు. అందుకు కారణం ఆర్థిక అసమానతలు. అలాగే యువతరం చదువు విలువ తెలుసుకోలేక జీవితంలో చాలా కోల్పోతుంది. నైతికత లేనివారికి ఓటేసి, నాయకులను ఎన్నుకొని మంచి జరగాలని కోరుకోవడం హాస్యాస్పదం. అలాగే కుల దురహంకారం, మతవాదుల ఛాందసం కూడా ఈ దేశ ప్రగతికి ఆటంకాలుగా ఉన్నాయి. ఈ విషయాలపై ఒక కవిగా ఎప్పుడూ నేను స్పందిస్తూనే ఉంటాను. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, కవులు రాజకీయ నాయకులకు జై కొట్టడం. ఈ బాధలు నాలో ఎప్పటినుండో ఘనీభవించి ఉన్నాయి. 'తిరిగి చూడు' పాట ద్వారా అవి అభివ్యక్తం అయ్యాయని అనుకుంటున్నాను.

ఇలాంటి పాటలు గతంలో ఏమైనా రాశారా?

కొన్ని సినిమాల్లో ఇలాంటి సామాజిక గీతాలు రాసే అవకాశం వచ్చింది. కానీ ఆ సినిమాలు విజయవంతం కాలేదు. అందువలన పాటలు ప్రజల్లోకి వెళ్లలేదు. కొన్ని ప్రైవేటు ఉద్యమ గీతాలు కూడా రాశాను. 'నీ స్వేదం చిందుచోట', 'కాపాడరా కల్పవల్లినీ' వంటి పాటలు చాలానే ఉన్నాయి. అలాగే తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా కొన్ని పాటలు రాశాను.

ఎంఎం కీరవాణి వంటి గొప్ప సంగీత దర్శకుడితో పని చేయడం ఎలా అనిపించింది?

కీరవాణి గారితో పనిచేయడం అద్భుతమైన అనుభవం. పైగా ఆయన ఆస్కార్ విజేత. నేను చిన్నప్పటినుండి బాలసుబ్రమణ్యం గారిని ఎంత ప్రేమించానో, అంతే స్థాయిలో కీరవాణి గారికి అభిమానిగా మారాను. ముఖ్యంగా సీతారామయ్యగారి మనవరాలు నుండి ఆర్.ఆర్.ఆర్ వంటి అనేక చిత్రాలకు ఆయన అందించిన సంగీతం అనన్య సామాన్యం. ఆయన పక్కన నిలబడి ఫొటో తీయించుకుంటే చాలు అనుకునే నేను, ఆయన స్వరాలకు పాటలు రాయడం గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. పాటల స్వరకల్పన సమయంలో ఆయన నాతో ఎంతో సన్నిహితంగా, ప్రేమగా మెలిగారు. చాలాసార్లు తిరిగి చూడు పాటలోని సాహిత్యాన్ని ఉన్నతంగా ప్రశంసించారు. పాట విడుదలైన తర్వాత వేదిక మీద పాట లోని సాహిత్యం అద్భుతం అని అనడం ఆయన గొప్పతనం.

అసలు పాటంటే మీ దృష్టిలో ఏంటీ.. పాటకూ సమాజానికీ మధ్య సంబంధం..?

పాటకూ మనిషికి ఉన్న సంబంధం విడదీయరానిది. ఈ భూమిపై మనిషి ఉన్నంతవరకు పాట ఉంటుంది. పాట మనిషికి ఆయుధమే కాదు, ఔషధం కూడా. సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని గొంతెత్తి ప్రశ్నిస్తుంది. గాయపడిన సమాజానికి ఔషధంగా మారడమే కాదు, చైతన్యాన్ని కూడా నింపుతుంది. మనిషిలోని భావోద్వేగాలను ఉత్కృష్టమైన స్థాయిలో అభివర్ణించే ప్రక్రియ పాట. ఈ సృష్టిలో పాటకు సాటి మరొకటి లేదు అంటే అతిశయోక్తి కాదు. అందుకే సినారె 'మాటకు దండం పెడతా పాటకు దండం పెడతా, మాటను పాటను నమ్మిన మనిషికి దండం పెడతా' అన్నారు.

సంభాషణ : సలీమ



షూటింగు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న చిత్రబృందం

హను రాఘవతో ప్రభాస్

హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కనున్న సినిమా షూటింగ్ శనివారం మొదలైంది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. మహేశ్ బాబు నటించిన 'గుంటూరు కారం' చిత్రంలోని 'కుర్చీ మడతపెట్టి' సాంగ్‌కు స్టెప్పులేస్తూ చేసిన రీల్ విపరీతంగా వైరల్ అయిన పాకిస్థానీ డాన్స్ కొరియోగ్రాఫర్ ఇమాన్వి ఈ చిత్రంలో కథానాయికగా నటించనుంది. పూర్తిస్థాయి పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం రూపొందనుంది. ఇప్పటికే విశాల్ చంద్రశేఖర్ ఈ చిత్రం కోసం మూడు పాటలు కంపోజ్ చేసినట్లు దర్శకుడు హను రాఘవపూడి ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. పాన్ ఇండియా స్థాయిలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రలు పోషించనున్నారు ఇతర వివరాలు త్వరలో వెల్లడిస్తారు.



'జటాధర'తో సుధీర్‌బాబు

వెంకట్ కళ్యాణ్ దర్శకత్వంలో సుధీర్‌బాబు నటిస్తున్న తాజా చిత్రం టైటిల్ వచ్చేసింది. శివన్ నారంగ్‌తో పాటు ప్రముఖ నిర్మాత ప్రేరణా అరోరా నిర్మిస్తున్న ఈ మూవీకి 'జటాధర' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు.. 'జటాధర' ఇప్పటికే తెలుగు, బాలీవుడ్ రెండింటిలోనూ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసిన ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్. మేకర్స్ రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్ అవుతోంది. రుస్తోమ్, టాయిలెట్ : ఏక్ ప్రేమ్ కథ, ప్యాడ్ మ్యాన్, పరి లాంటి సూపర్ హిట్స్ అందించిన విజనరీ ప్రొడ్యూసర్ ప్రేరణా అరోరా నిర్మాణ భాగస్వామిగా వున్న ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. షూటింగ్ త్వరలో హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని, టాప్ టెక్నీషియన్స్ ఈ సినిమాకు పనిచేయనున్నారని ఈ సందర్భంగా మేకర్స్ ప్రకటించారు. అలాగే ఈ సినిమాను 2025 మహాశివరాత్రికి విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లుగా కూడా ప్రకటించేశారు. ప్రేరణ అరోరా, శివిన్ నారంగ్, నిఖిల్ నందా, ఉజ్వల్ ఆనంద్ ఈ చిత్రాన్ని హై బడ్జెట్ తో నిర్మిస్తున్నారు.

రోషన్ హీరోగా 'ఛాంపియన్' మొదలైంది

శ్రీకాంత్ తనయుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన రోషన్ ప్రముఖ ప్రొడక్షన్ హౌస్ వైజయంతి మూవీస్ బ్యానర్‌లో ఓ చిత్రం చేయనున్నారు. 'ఛాంపియన్' అనే టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కబోతుంది. చిత్ర యూనిట్ ఈ సినిమా గురించి అధికారిక ప్రకటన చేసి నెలలు గడుస్తోంది. ఇది ఒక భారీ బడ్జెట్ సినిమాగా తెరకెక్కనుంది. కానీ గత కొంతకాలంగా ఈ సినిమా గురించి ఒక్క అప్డేట్ కూడా లేదు. తాజాగా ఈ సినిమాపై క్రేజీ అప్ డేట్ ఇచ్చింది చిత్రయూనిట్. ఈ సినిమా షూటింగ్ మొదలు పెట్టినట్లు ఓ మోషన్ పోస్టర్ రిలీజ్ చేసింది. ఈ పోస్టర్‌లో కల్కి ఫేమ్ నాగాశ్విన్ క్లాప్ కొడుతూ కనిపించారు. ఈ చిత్రానికి ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర వివరాలు త్వరలోనే ప్రకటించనున్నారు.

మేమే చెడగొట్టాం : దిల్ రాజు

గత కొన్నాళ్లుగా చిన్న సినిమాలు థియేటర్లలో రిలీజ్ అయిన వారం రెండు వారాలకే ఓటీటీలోకి వస్తున్నాయి. స్టార్ హీరోల సినిమాలు కూడా మూడు, నాలుగు వారాలకు ఓటీటీలోకి వస్తున్నాయి. ఇటీవల అయితే ముందు ఓటీటీ డీల్ ఓకే అయ్యాక సినిమా మొదలు పెడుతున్నారు కొంత మంది. దీంతో ఓటీటీలోకి వచ్చేస్తుంది కదా, ఇప్పుడు అంతంత రేట్లు పెట్టుకొని థియేటర్‌కి వెళ్లడం ఎందుకని చాలా మంది థియేటర్లకు వెళ్లడమే మానేస్తున్నారు. ఈ అంశం మీద తాజాగా దిల్ రాజు స్పందించారు. చిన్న సినిమా 'రేవు' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆయన 'చిన్న సినిమా అని వదిలేయకండి. థియేటర్‌కి వెళ్లి చూడండి, ఇటీవల చాలా మంది థియేటర్‌కి వచ్చి సినిమాలు చూడట్లేదు. అసలు ఆడియన్స్‌ని మేమే చెడగొట్టాము, మీరు ఇంట్లోనే కూర్చోండి, నాలుగు వారాల్లో సినిమా ఓటీటీలోకి వస్తుంది అని మేమే వాళ్ళని థియేటర్స్‌కి రాకుండా చేసుకున్నాం' అన్నారు. వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'రేవు'. ఈ చిత్రాన్ని సంహిత్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్, పారుపల్లి ప్రొడక్షన్‌పై నిర్మాత డా. మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి సంయుక్తంగా నిర్మించారు. హరినాథ్ పులి ఈ చిత్రానికి దర్శకత్వం వహించగా ఆగస్టు 23న రిలీజ్ కానుంది. ఈ క్రమంలో ఇటీవల ట్రైలర్ లాంచ్ చేయగా ఆ ఈవెంట్‌కి దిల్ రాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు.

సీక్వెల్‌గా 'తంగలాన్ 2' : విక్రమ్



తమిళ్ హీరో చియాన్ విక్రమ్–పా.రంజిత్ కాంబినేషన్‌లో తెరకెక్కిన సినిమా 'తంగలాన్'. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న ఈ సినిమా విడుదలైంది. పాజిటివ్ టాక్‌ను అందుకుంది. దీంతో 'తంగలాన్'కు సీక్వెల్ ఉంటుందని హీరో విక్రమ్ ప్రకటించారు. పాన్‌ఇండియా స్థాయిలో కెఇ జ్ఞానవేల్‌రాజా, జ్యోతి దేశ్ పాండే నిర్మించారు. పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ కీలకపాత్రలు పోషించారు. హైదరాబాద్‌లో జరిగిన సక్సెస్‌మీట్‌లో విక్రమ్ మాట్లాడారు. 'తంగలాన్' ఒక మట్టి సినిమా అని, ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుందటం అభినందనీయమన్నారు. త్వరలోనే 'తంగలాన్ 2'తీసుకొస్తామంటూ విక్రమ్ ప్రకటించారు. పా.రంజిత్, నిర్మాత జ్ఞానవేల్‌రాజా అంగీకరించారన్నారు. స్టూడియో గ్రీన్ ప్రొడక్షన్స్ హౌస్ సిఇఒ ధనుంజేయర్ మాట్లాడారు.

వినేశ్ ఫోగాట్‌కు ఘన స్వాగతం

• పూలదండలతో ముంచెత్తిన సహచర రెజ్లర్లు, అభిమానులు • వేలాదిమందితో ర్యాలీ

న్యూఢిల్లీ: పారిస్ నుంచి ఢిల్లీకి చేరిన మహిళా రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌కు ఘన స్వాగతం లభించింది. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న వినేశ్‌కు ఘన స్వాగతం పలికేందుకు వేలాదిమంది అభిమానులు భారీగా తరలివచ్చారు. వినేశ్‌ను చాంపియన్ తరహాలో గ్రాండ్‌వెల్‌కమ్ చెప్పారు. ఎయిర్‌పోర్ట్ వద్ద ఆమెకు అభిమానులు, మద్దతుదారులు ఆపూర్వ స్వాగతం లభించింది. ఓపెన్ టాప్ వ్యాన్‌లో ర్యాలీగా ఆమెను ఊరేగించారు. ఈ సందర్భంగా వినేశ్ ఫోగాట్ తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీటిపర్యంతమైంది. ఆమెను కాంగ్రెస్ ఎంపి దీపిందర్ హుడా, రెజర్లు సాక్షిమలిక్, బజరంగ్ పునియా తదితరులు ఓదార్చారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. కాగా 55 కేజీల విభాగంలో ఫైనల్‌కు ముందు 100 గ్రాములు అదనపు బరువు కారణంగా అనర్హతకు ఫోగాట్ గురైంది. 'కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్(కాస్)లో అప్పీలు చేసినా సానుకూలంగా ఫలితం దక్కలేదు. ఆమె అభ్యర్ధనను స్పోర్ట్స్ కోర్డు ఇటీవలే తిరస్కరించడంతో పతకం చేజారింది.

న్యూఢిల్లీ విమానాశ్రయంలో వినేశ్ ఫోగాట్‌కు ఘన స్వాగతం పలుకుతున్న అభిమానులు

రిటైర్మెంట్ వెనక్కి...?

పారిస్ ఒలింపిక్స్‌లో పతకం చేజారడం షాక్‌కు గురైన వినేశ్ ఫోగాట్ రెజ్లింగ్ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. అయితే ఇప్పుడు వినేశ్ ఫోగట్ తన రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకునే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా ఎక్స్‌లో ఉద్వేగభరిత పోస్టు షేర్ చేసిన ఆమె.. అందులో పలు విషయాలను ప్రస్తావించింది. భవిష్యత్ ఎలా ఉంటుందో చెప్పలేను కానీ, రెజ్లింగ్ కొనసాగించే సత్తా మాత్రం తనకు ఉందని తెలిపింది. నా బృందానికి, నా తోటి భారతీయులకు, నా కుటుంబ సభ్యులకు ఒక విషయం చెప్పాలని అనుకుంటున్నాను. మా లక్ష్యాన్ని మేము ఇంకా చేరుకోలేదు. ఏదో మిస్ అయినట్లు అన్పిస్తోంది. అయితే పరిస్థితులు ఇకపై మునపటి లా ఉండకపోవచ్చు. నేను 2032వరకు రెజ్లింగ్ వృత్తిని కొనసాగించాలని భావిస్తున్నాను. కానీ భవిష్యత్ నా కెరీర్ ను ఎలా నిర్ణయిస్తుందో తెలియదు. కానీ నేను నమ్మిన దాని కోసం నా పోరాటం ఆపనని వినేష్ పేర్కొంది. అలాగే తనకు అండగా నిలిచిన అథ్లెట్లు, కోచ్ ఇతర సహాయ సిబ్బందితో పాటు మద్దతు పలికిన ప్రతి ఒక్కరి ధన్యవాదాలు అంటూ ఫోగట్ ఎక్స్‌లో రాసుకొచ్చింది.

భారత రెజ్లింగ్ సంఘం నుంచి మద్దతే లేదు
వినేశ్ ఫొగాట్ భర్త సోమ్‌వీర్

భారత రెజ్లింగ్ సంఘంపై స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ భర్త సోమ్‌వీర్ రాథీ తీవ్ర ఆరోపణలు చేశాడు. పారిస్ ఒలింపిక్స్ ఫైనల్‌లో అనర్హత వేటుకు గురైన వినేశ్‌కు డబ్ల్యూఎఫ్ఐ మద్దతుగా నిలవలేదని విమర్శించాడు. "దేశం మొత్తం వినేశ్‌పై అభిమానం కురిపిస్తోంది. ఆమెకు ఘనస్వాగతం లభించింది. ఇలా చూడటం చాలా ఆనందంగా ఉంది. వినేశ్ సహచర రెజ్లర్లూ పెద్ద ఎత్తున అండగా నిలిచారు. మేం భారత్‌లోకి అడుగు పెట్టేవరకూ ఇలాంటి సంబరాలు అస్సలు ఊహించలేదు. ఏం మాట్లాడాలో కూడా తెలియడం లేదు. పతకం కాస్తలో చేజారింది. మేమంతా క్లిష్టసమయంలో ఉన్నాం. కాస్‌లో తీర్పు మనకు అనుకూలంగా రాలేదు. ఇలాంటప్పుడు ఫెడరేషన్ మాకు మద్దతుగా లేదు. అథ్లెట్లకు మద్దతుగా లేకపోతే నిర్భయంగా ఎలా ప్రదర్శన చేయగలరు?" అని సోమ్‌వీర్ వ్యాఖ్యానించాడు.

భారత హాకీ గోల్‌కీపర్ పిఎం శ్రీజేశ్ కుటుంబ సభ్యులతో ప్రధాని నరేంద్ర మోడీ

వెస్టిండీస్ లక్ష్యం 263పరుగులు

దక్షిణాఫ్రికా 246ఆలౌట్

గయానా: బౌలర్లకు స్వర్గధామమైన ప్రొవిడెన్స్ స్టేడియంలో వెస్టిండీస్ జట్టు రెండో టెస్ట్‌లో దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌ను 246పరుగులకే కుప్పకూల్చింది. ఓవర్‌నైట్ స్కోర్ 5వికెట్ల నష్టానికి 223పరుగులతో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా మరో 23పరుగులు జతచేసి చివరి ఐదు వికెట్లను కోల్పోయింది. వెస్టిండీస్ పేసర్ సెలెస్‌కు ఆరు, మోటీ, వార్రికాన్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ జట్టు 144 పరుగులే చేసింది. మరో రెండ్రోజుల ఆట మిగిలి ఉండగా.. 263 పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి ఉంది. లంచ్ విరామానికి వెస్టిండీస్ వికెట్ నష్టపోయి 43పరుగులు చేసింది. తొలి టెస్ట్ డ్రా అయ్యింది.

డోపింగ్‌కు పాల్పడ్డ శ్రీలంక వికెట్ కీపర్

కొలంబో: శ్రీలంక వికెట్ కీపర్ నిరోషన్ డిక్వెల్లా డోపింగ్‌లో దొరికిపోయాడు. డోపింగ్ టెస్ట్‌లకు దూరంగా ఉన్నాడు. దీంతో డోపింగ్ నిరోధక ఉల్లంఘనలకు పాల్పడ్డ ఆరోపణలతో శ్రీలంక క్రికెట్‌బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. డిక్వెల్లాపై సస్పెన్షన్ తక్షణమే అమలుకానున్నట్లు, తదుపరి నోటీసులు ఇచ్చేవరకు అతడు అన్ని ఫార్మాట్‌ల క్రికెట్‌కు దూరంగా ఉండాలని ఓ ప్రకటనలో బోర్డు ఆ ప్రకటనలో పేర్కొంది. శ్రీలంక ప్రిమియర్ లీగ్(ఎస్‌పిఎల్) సందర్భంగా ఆటగాళ్లకు నిర్వహించింది. ఎస్‌పిఎల్‌లో డిక్వెల్లా గాలే మార్వెల్స్‌కు కెప్టెన్‌గా ఉన్నాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68